www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 7-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 172 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి ఉ.9.17 తదుపరి పాడ్యమి తె.5.53 వరకు, నక్షత్రం: రేవతి రా.1.28 తదుపరి అశ్విని, వర్జ్యం: మ.2.45-4.10, దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, రా.9.56-10.43, అమృతఘడియలు: రా.11.19-12.45, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 5.55 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సంవత్సరీకం



కీ॥శే॥ శ్రీ నారా రామమూర్తి నాయుడు గారు

మాజీ శాసనసభ్యులు, చంద్రగిరి

చెరిగిపోనిది మీ ఘనత...
మరపురానిది మీ మమత
నమ్మిన ప్రజల ఆరాధ్య దైవం మీరు
మీ ప్రజాదరణ ఆ చంద్రతారార్కం
తేజో విరాజం

నారా చంద్రబాబు నాయుడు
నారా లోకేష్, నారా గిరీష్, నారా రోహిత్



అట్లూరి నారాయణరావు,
కన్వీనర్ - NTR Literature Committee
గౌరవాధ్యక్షులు, ఆం.ప్ర. సాధు పరిషత్

బిజినెస్

విజయవాడ ● మంగళవారం 7 అక్టోబరు 2025

టాటా ట్రస్టులో ఇంటి పోరు!

TATA TRUSTS

నోయెల్ టాటా అధికారాలపై గుస్సా

10న టాటా ట్రస్ట్స్ బోర్డు సమావేశం

న్యూఢిల్లీ: టాటాల సామ్రాజ్యంలోనూ ఇంటి పోరు ప్రారంభమైనట్టు సమాచారం. రతన్ టాటా వారసుడిగా పగ్గాలు చేపట్టిన ఆయన సోదరుడు, టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా అధికారాలపై ట్రస్టు సభ్యులు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. టాటా గ్రూప్ మాతృ సంస్థ టాటా సన్స్ ఈక్విటీలో టాటా ట్రస్ట్స్‌కు 60 శాతానికిపైగా వాటా ఉంది. టాటా సన్స్ బోర్డులోకి నోయెల్ టాటా కొందరి పేర్లను సూచించగా నలుగురు ట్రస్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో ఈ నెల 10న జరిగే టాటా ట్రస్ట్స్ బోర్డు సమావేశం గరంగరంగా జరుగుతుందని భావిస్తున్నారు.

టాటా సన్స్ లిస్టింగ్‌పై చర్చ

శుక్రవారం జరిగే టాటా ట్రస్ట్స్ బోర్డు సమావేశంలో టాటా సన్స్ లిస్టింగ్‌పైనా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. నిజానికి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం గత నెలాఖరుకే ఈ కంపెనీ ఐపీఓ పూర్తి కావాల్సి ఉంది. అయితే సెబీ అనుమతి ఉన్నా టాటా గ్రూప్ ఆ పని పూర్తి చేయలేక పోయింది. మరోవైపు టాటా సన్స్ ఈక్విటీలో 18.37 శాతం వాటా ఉన్న షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్ తన అప్పుల భారం తగ్గించుకోవాలని భావిస్తోంది. వీలైనంత త్వరగా ఐపీఓ జారీ చేస్తే పారదర్శకంగా తన వాటాను మార్కెట్ ధరకు విక్రయించి బయట పడొచ్చని ఆశించింది.

అయితే ఐపీఓ వాయిదాల మీద వాయిదాలు పడడంతో తీవ్ర అసంతృప్తితో ఉంది. తన భార్య ఎస్‌పీ గ్రూప్ చీఫ్ సోదరి కావడంతో నోయెల్ టాటా దీనిపైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. దీనికి కూడా టాటా ట్రస్ట్‌లోని కొందరు ట్రస్టీలు నోయెల్ టాటాను తప్పుపడుతున్నట్టు సమాచారం.

బంగారు నగ.. భగ భగ

- పసిడి సరికొత్త ఆల్‌టైం రికార్డు
- రూ.1.23 లక్షలు దాటిన 10 గ్రాముల ధర
- ఒక్కరోజులో రూ.2,700 పెరుగుదల



న్యూఢిల్లీ: పండగ సీజన్‌లో పసిడి, వెండి బెంబేలెత్తిస్తున్నాయి. ఈ విలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. తులం బంగారం రూ.1.23 లక్షలు దాటేయగా.. కిలో వెండి రూ.1.60 లక్షల దిశగా పరుగులు తీస్తోంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం సోమవారం ఏకంగా రూ.2,700 ఎగబాకి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1,23,300కు పెరిగింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.2,700 పెరిగి కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,22,700కు చేరింది. వెండిదీ అదే తీరు. కేజీ సిల్వర్ రూ.7,400 పెరుగుదలతో మరో కొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.1,57,400కు ఎగబాకింది. ఖజానా ఖాళీ అవడంతో అమెరికా ప్రభుత్వ యంత్రాంగం స్తంభించిపోయి (యూఎస్ షట్‌డౌన్) 6 రోజులవుతుండటంతో పాటు డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డు కనిష్ఠానికి క్షీణించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు తెలిపాయి.

4,000 డాలర్లకు చేరువలో ఔన్స్ గోల్డ్

షట్‌డౌన్‌తో అమెరికాలో రాజకీయ, ఆర్థిక అనిశ్చితి మరింత పెరగడంతో పాటు ఫ్రాన్స్, జపాన్‌లో తాజా రాజకీయ పరిణామాలు అంతర్జాతీయంగా విలువైన లోహాల ధరలను ఎగదోస్తున్నాయి. అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీ రేట్లను మరో 0.25 శాతం తగ్గించవచ్చన్న అంచనాలూ బులియన్ ర్యాలీకి మరో కారణం.ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు తొలిసారిగా 3,900 డాలర్ల మైలురాయిని దాటేసింది. సిల్వర్ సైతం ఒక శాతానికి పైగా పెరిగి 48.75 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. ఈ ఏడాదిలో ఇప్పటికే 50 శాతానికి పైగా పెరిగిన ఔన్స్ గోల్డ్ అతి త్వరలో 4,000 డాలర్లు మించిపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏపీలో ఓఎన్‌జీసీ భారీ పెట్టుబడులు



రూ.8,110 కోట్లతో 172 బావుల తవ్వకం

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ).. ఆంధ్రప్రదేశ్‌లో చమురు, సహజ వాయువుల అన్వేషణను ఉధృతం చేస్తోంది. ఇందులో భాగంగా రూ.8,110 కోట్ల పెట్టుబడి అంచనాతో రాష్ట్రంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్ ప్రాంతంలోని భూ ఉపరితల ప్రాంతాల్లో 172 బావులు తవ్వబోతోంది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఈఎ్‌ఫసీసీ)కు చెందిన నిపుణుల కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. కోనసీమ ప్రాంతంలో తనకు కేటాయించిన ఎనిమిది పెట్రోలియం మైనింగ్ లీజు (పీఎంఎల్) బ్లాకుల్లో ఓఎన్‌జీసీ ఈ తవ్వకాలు జరపనుంది. ఇందులో పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ) కోసం రూ.172 కోట్లు, ప్రజాభిప్రాయ సేకరణ కోసం రూ.11 కోట్లు ఖర్చు చేయనుంది.

షరతులు: కేజీ బేసిన్ ప్రాంతంలో చమురు, గ్యాస్ తవ్వకాలకు అనుమతి ఇస్తూనే పర్యావరణ సంరక్షణకు ఎంఈఎఫ్‌సీసీ పెద్దపీట వేసింది. ఓఎన్‌జీసీ తవ్వే ఈ 172 బావుల్లో ఏ బావి కూడా కోరంగి వన్యప్రాణి సంరక్షణా కేంద్రానికి పది కిలోమీటర్ల లోపు ఉండకూడదని స్పష్టం చేసింది. అలాగే ముందస్తు అనుమతి లేకుండా అటవీ ప్రాంతాలు, సంరక్షిత ప్రాంతాల నుంచి ఎలాంటి పైప్‌లైన్లు వేయకూడదని షరతు విధించింది. చమురు, గ్యాస్ క్షేత్రాల కారణంగా కోనసీమ ప్రాంతంలో భూమి కుంగిపోతోందన్న నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో ఈఏసీసీ నిపుణుల కమిటీ ఈ షరతులు విధించినట్టు భావిస్తున్నారు.

భారీ నిక్షేపాలు: కేజీ బేసిన్‌లో దాదాపు 69.8 కోట్ల టన్నుల చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు అంచనా. ఇది గత ఆర్థిక సంవత్సరం మన దేశం దిగుమతి చేసుకున్న ముడి చమురు కంటే దాదాపు రెండు రెట్లు ఎక్కువ. దీంతో ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఈ ప్రాంతంలో పెద్దఎత్తున చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషిస్తున్నాయి. రిలయన్స్ ఇప్పటికే ఈ ప్రాంత లోతట్టు సముద్ర జలాల్లో గ్యాస్ ఉత్పత్తి చేపట్టింది. ఓఎన్‌జీసీ కూడా 500 కోట్ల డాలర్ల పెట్టుబడితో ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఉత్పత్తి ప్రారంభించింది. ఇప్పుడు కేజీ బేసిన్‌లోని ఉపరితల ప్రాంతంలోనూ పెద్దఎత్తున బావులు తవ్వి చమురు, గ్యాస్ ఉత్పత్తి ప్రారంభించాలని యోచిస్తోంది.

చమురు గిరాకీ మరింత పైకే

పునరుత్పాదక ఇంధన వినియోగం ఎంతగా పెరుగుతున్నా మన దేశంలో చమురు గిరాకీ ఇప్పట్లో తగ్గేలా లేదు. ప్రస్తుతం రోజుకు 54 లక్షల బ్యారళ్ల వరకు ఉన్న డిమాండ్ 2050 నాటికి 91 లక్షల బ్యారళ్లకు చేరుతుందని బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) ప్రధాన ఆర్థికవేత్త స్పెన్సర్ డేల్ అంచనా. ఇదే సమయంలో దేశ సహజ వాయువు డిమాండ్ కూడా రెండింతలు పెరిగి 15,300 కోట్ల ఘనపు మీటర్లకు చేరుతుదని తెలిపారు. వచ్చే పాతికేళ్లలో చమురు గిరాకీ మరే దేశంలోనూ ఈ స్థాయిలో పెరగదని తేల్చిచెప్పారు. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి ఎంతగా పెరిగినా భారత ఇంధన వినియోగంలో చమురు వాటా హవా కొనసాగుతుందన్నారు.

నవంబరు 25 నుంచి హైదరాబాద్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): దక్షిణాసియాలోనే అతి పెద్ద పౌల్ట్రీ సదస్సును వచ్చే నెల 25 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) తెలిపింది. సోమవారం నాడిక్కడ ఐపీఈఎంఏ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ దిశగా స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్తు కోసం 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను "వన్ నేషన్ వన్ ఎక్స్‌పో" థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించే ఈ ఎక్స్‌పోలో 1,500కి పైగా ప్రతినిధులు, అంతర్జాతీయ నిపుణులు పాల్గొని సస్టేనబుల్ ఫీడ్ సొల్యూషన్స్, ఆటోమేషన్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాలపై చర్చిస్తారని తెలిపారు. అలాగే 50 దేశాల నుంచి 500కి పైగా ఎగ్జిబిటర్స్ పాల్గొంటారని ఉదయ్ పేర్కొన్నారు.

ఏపీ ప్లాంట్ కోసం రూ.1,908 కోట్ల నిధుల సమీకరణ

హీరో ఫ్యూచర్ ఎనర్జీస్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో నిర్మించనున్న 120 మెగావాట్ల సామర్థ్యం గల పునరుత్పాదక ఇంధన హైబ్రిడ్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకుల నుంచి రూ.1,908 కోట్లు సమీకరించినట్టు హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ ప్రకటించింది. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న వేళల్లో అందుకు అవసరమైన విద్యుత్‌ను అందించే ఈ ప్రాజెక్టును ఎస్‌జేవీఎన్‌కు కాంట్రాక్టు ఇచ్చారు. ఇది పవన, సౌర విద్యుత్ రెండింటినీ సమీకృతం చేస్తుంది. తిరిగి చెల్లించేందుకు 21 సంవత్సరాల కాల పరిమితి ఉన్న ఈ నిధుల సహాయంతో ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి ప్రారంభించే వీలు కలుగుతుందని కంపెనీ తెలిపింది.

ఫార్మా ఎగుమతుల కోసం తొలి రీఫర్ రైల్ సర్వీస్

హైదరాబాద్: హైదరాబాద్ సమీపంలోని తిమ్మాపూర్‌లో ఉన్న తమ కేంద్రం నుంచి నవసేవకు (జేఎన్‌పీఏ) తొలి రీఫర్ రైల్ సరకు రవాణా సేవను ఓషియన్ నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ (వన్) సహాయంతో ప్రారంభించినట్టు డీపీ వరల్డ్ తెలిపింది. దీనివల్ల తిమ్మాపూర్ ఐసీడీ నుంచి నవసేవకు రిఫ్రిజిరేటెడ్ రైలు అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. ఇది ప్రధానంగా ప్రాంతీయ ఫార్మా ఎగుమతిదారులకు ఎంతో ఉపయోగపడుతుందని, వారికి అవసరమైన లాజిస్టిక్ సొల్యూషన్లు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. ఈ వీక్లీ సర్వీసు ద్వారా 40 అడుగుల నిడివి గల 43 కంటైనర్లను ఒకే రైలు ద్వారా రవాణా చేసే అవకాశం ఉంటుంది.

లలిత జువెలరీ రూ.1,700 కోట్ల ఐపీఓ

హైదరాబాద్: మరో జువెలరీ కంపెనీ త్వరలో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. చెన్నై కేంద్రంగా పనిచేసే లలిత జువెలరీ మార్ట్ రూ.1,700 కోట్ల సమీకరణ కోసం ఐపీఓ జారీ చేయనుంది. ఈ ఏడాది జూన్ 6న కంపెనీ ఇందు కోసం క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసింది. ఈ దరఖాస్తుపై సెబీ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయక పోవడంతో కంపెనీ ఐపీఓకు మార్గం సుగమమైంది. ఫ్రెష్ ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,200 కోట్లు, ప్రమోటర్ కిరణ్ కుమార్ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద రూ.500 కోట్ల షేర్లను ఈ ఇష్యూ ద్వారా విక్రయించబోతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా లలిత జువెలరీ మార్ట్ 57 స్టోర్లు నిర్వహిస్తోంది. కాగా కంపెనీ తమిళనాడులో రెండు మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లను నిర్వహిస్తోంది.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

583 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, హెల్త్‌కేర్ రంగ షేర్లలో కొనుగోళ్లతో సోమవారం సెన్సెక్స్ 582.95 పాయింట్లు బలపడి 81,790.12 వద్ద ముగిసింది. ఒక దశలో సూచీ 639.25 పాయింట్లు ఎగబాకి 81,846.42 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, 183.40 పాయింట్ల వృద్ధితో 25,077.65 వద్ద స్థిరపడింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,500 పాయింట్లకు పైగా, నిఫ్టీ 466 పాయింట్లు లాభపడ్డాయి. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.459.84 లక్షల కోట్లకు పెరిగింది.

నిరాశపరిచిన అమీన్‌జీ రబ్బర్: సోమవారం బీఎస్ఈ ఎస్ఎంఈ ఎక్స్ఛేంజీలో లిస్ట్ అయిన హైదరాబాద్ కేంద్రంగా ఉన్న అమీన్‌జీ రబ్బర్ లిమిటెడ్ మదుపరులను నిరాశపరిచింది. ఇటీవల రూ.30 కోట్ల సమీకరణ కోసం ఐపీఓకు వచ్చిన ఈ కంపెనీ ఒక్కో షేరును రూ.95-100కు జారీ చేసింది. సోమవారం బీఎస్ఈలో రూ.101 వద్ద లిస్టయిన కంపెనీ షేరు ఇంట్రాడేలో ఒక దశలో రూ.96.05కు పడిపోయింది. చివరికి రూ.6.05 స్వల్ప లాభంతో రూ.106.05 వద్ద ముగిసింది.

- సాంప్రే న్యూట్రిషన్స్ లిమిటెడ్.. ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్ల (ఎఫ్‌సీసీబీ) జారీ ద్వారా రూ.355 కోట్లు సమీకరించనుంది. ఈ మేరకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం లభించిందని కంపెనీ వెల్లడించింది. రూ.355.06 కోట్లకు సమానమైన ఎఫ్‌సీసీబీలను జారీ చేయటం ద్వారా ఈ మొత్తాలను సమీకరించనుంది. ఈ మొత్తాలను కంపెనీ ఈజిప్ట్, లైబీరియా సహా వర్ధమాన మార్కెట్లలో కార్యకలాపాలను విస్తరించేందుకు ఉపయోగించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	530
వరంగల్	517	గోదావరి	530
చిత్తూరు	528	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	124
వరంగల్	115	గుంటూరు	122
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	119
కర్నూలు	115	నెల్లూరు	124
విశాఖపట్నం	127	అనంతపురం	124
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,20,770 ▲	1,10,700 ▲	1,66,000 ▲
విజయవాడ	1,23,000 ▲	1,17,000 ▲	1,56,850 ▲
విశాఖపట్నం	1,22,920 ▲	1,10,000 ▲	1,67,000 ▲
రాజమండ్రి	1,20,760 ▲	1,10,700 ▲	1,53,800 ▲
ప్రొద్దుటూరు	1,23,700 ▲	1,13,800 ▲	1,55,000 ▲
ముంబై	1,19,249 ▲	1,09,232 ▲	1,48,833 ▲

స్పోర్ట్స్

విశాఖ చేరుకున్న హర్మన్ సేన

9న దక్షిణాఫ్రికాతో మ్యాచ్





విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): దక్షిణాఫ్రికాతో ఈనెల తొమ్మిదిన జరిగే మహిళల ప్రపంచ కప్ వన్డే మ్యాచ్‌లో తలపడే భారత జట్టు సోమవారం నగరానికి చేరుకుంది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటికే శ్రీలంక, పాకిస్థాన్ జట్లపై విజయాలు సాధించి మంచి ఊపుమీదుంది. భారత జట్టుకు విశాఖ విమానాశ్రయంలో ఆంధ్ర క్రికెట్ సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. భారత క్రికెటర్లు మంగళవారం సాయంత్రం సాధన చేస్తారు.

మిథాలీ పేరిట స్టాండ్

గేటుకు కల్పన పేరు

మంత్రి లోకేష్ ప్రతిపాదనకు ఏసీఏ ఆమోదం

విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఒక స్టాండ్‌కు భారత మహిళా క్రికెట్ మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరును, అలాగే స్టేడియంలోని ఓ గేటుకు మరో క్రికెటర్ రావి కల్పనల పేరు పెట్టనున్నారు. ఆదివారం ఇక్కడ భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మహిళల వరల్డ్‌కప్ మ్యాచ్ సందర్భంగా వీటిని ఆవిష్కరించనున్నారు. ఇటీవలే ఓ చాట్ షోలో మహిళా క్రికెటర్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని మంత్రి నారా లోకేష్‌కు స్మృతి మంధాన విజ్ఞప్తి చేసింది. తక్షణం స్పందించిన లోకేష్ స్టాండ్స్‌కు మహిళా క్రికెటర్ల పేర్లు పెట్టే ప్రతిపాదన చేయగా ఏసీఏ ఆమోదించింది.

డోపింగ్‌లో మళ్లీ దొరికిన ధనలక్ష్మి



న్యూఢిల్లీ: తమిళనాడు స్ప్రింటర్ ధనలక్ష్మీ శేఖర్ రెండోసారి డోపింగ్‌లో పట్టుబడింది. పంజాబ్‌లో జరిగిన ఓపెన్ అథ్లెటిక్ మీట్ సందర్భంగా జూలై 27న ఆమె నుంచి సేకరించిన శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకం డ్రొస్టానెలోన్ ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో నాడా ఆమెపై తాత్కాలిక సస్పెన్షన్ విధించింది. అంతకుముందు పది రోజుల క్రితం..అంటే జూలై 17న ఆమెపై ఉన్న నిషేధం తొలగిపోయింది. ఇక ధనలక్ష్మి రెండోసారి డోపీగా పట్టుబడడంతో విచారణ అనంతరం ఆమెపై 8ఏళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది.



బ్రిట్స్..భళా!

తజ్మిన్ రికార్డు శతకం

కివీస్‌పై సఫారీల గెలుపు

ఇండోర్: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా బోణీ చేసింది. తజ్మిన్ బ్రిట్స్ (101) అసాధారణ ఫామ్‌ను కొనసాగిస్తూ శతకంతో అదరగొట్టడంతో సోమవారం న్యూజిలాండ్‌పై సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఏడాది బ్రిట్స్‌కు ఇది ఐదో వన్డే శతకం కావడం విశేషం. ఈ క్రమంలో ఒక కేలండర్ ఇయర్‌లో నాలుగు శతకాలు బాదిన టీమిండియా స్టార్ స్మృతి మంధాన రికార్డును బ్రిట్స్ అధిగమించింది. మంధాన నిరుడు నాలుగు, ఈ సంవత్సరం కూడా నాలుగు సెంచరీలు చేసింది. ఇక.. ఈ టోర్నీలో తమ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై 69 పరుగులకే కుప్పకూలిన సౌతాఫ్రికా.. కివీస్‌పై ఆల్‌రౌండ్ షో ప్రదర్శించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 47.5 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ సోఫీ డివైన్ (85), బ్రూక్ హ్యాలీడే (45), జార్జియా ప్లిమ్మర్ (31) రాణించారు. స్పిన్నర్ ఎంలబాకు 4 వికెట్లు దక్కాయి. కివీస్ తమ చివరి ఏడు వికెట్లను కేవలం 44 పరుగుల తేడాతో కోల్పోయింది ఆ తర్వాత ఛేదనలో సౌతాఫ్రికా 40.5 ఓవర్లలోనే 234/4 స్కోరుతో నెగ్గింది. రెండో వికెట్‌కు బ్రిట్స్-సున్ లూస్ (83 నాటౌట్) 159 రన్స్ జోడించారు. కెర్‌కు 2 వికెట్లు లభించాయి. బ్రిట్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 47.5 ఓవర్లలో 231 ఆలౌట్ (సోఫీ డివైన్ 85, బ్రూక్ హ్యాలీడే 45, జార్జియా ప్లిమ్మర్ 31, ఎంలబా 4/40); **దక్షిణాఫ్రికా:** 40.5 ఓవర్లలో 234/4 (తజ్మిన్ బ్రిట్స్ 101, సున్ లూస్ 83 నాటౌట్, కెర్ 2/62).

ప్రపంచ కప్‌లో నేడు

ఇంగ్లండ్ X బంగ్లాదేశ్

మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

వెళ్లి ఆటో నడుపుకోమంటారు

విమర్శకులపై సిరాజ్



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో పేసర్ మహ్మద్ సిరాజ్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో నిలకడగా చోటు దక్కించుకుంటున్నాడు. అయితే కెరీర్ ఆరంభంలో సరిగ్గా రాణించకపోవడంతో విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగితేనే ఫలితం ఉంటుందని సిరాజ్ చెబుతున్నాడు. 'నువ్వు బాగా రాణిస్తే అభిమానులతో పాటు క్రీడాలోకం కూడా సిరాజ్‌లాంటి బౌలర్ మరొకరు లేడంటూ పొగుడుతారు. అదే విఫలమైతే.. 'నువ్వేం బౌలర్‌వి? వెళ్లి మీ తండ్రితో కలిసి ఆటో నడుపుకో' అంటూ విమర్శిస్తారు. అంత త్వరగా వీరు తమ అభిప్రాయాలను ఎలా మార్చుకుంటారు? అందుకే బయట నుంచి వచ్చే కామెంట్స్, విమర్శలను పట్టించుకోకూడదనుకున్నా. నా జట్టు సభ్యులు, కుటుంబం ఎలా ఆలోచిస్తున్నారన్నదే నాకు ముఖ్యం. ఇతరుల గురించి నాకనవసరం' అని సిరాజ్ స్పష్టం చేశాడు. భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పుడు ధోనీ కూడా తనకిదే సలహా ఇచ్చినట్టు గుర్తుచేసుకున్నాడు.

ఫైనల్లో హుస్సాముద్దీన్

చెన్నై: తెలుగు బాక్సర్ మొహమ్మద్ హుస్సాముద్దీన్ బీఎఫ్ఐ కప్ ఫైనల్లో ప్రవేశించి పతకం ఖాయం చేసుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల 55-60 కిలోల సెమీస్ బౌట్‌లో హుస్సాముద్దీన్ 5-0తో మితేష్ దేశ్వాల్ (రైల్వేస్)ను చిత్తుగా ఓడించాడు. మిగతా బాక్సర్లలో మాజీ వరల్డ్ చాంపియన్ అనుక్షిత బోరో, అరుంధతి చౌధురి స్వర్ణాలు సాధించారు. అనుక్షిత (అసోం) 60-65 కిలోల కేటగిరీ ఫైనల్లో 3-2తో పార్థవి (రాజస్థాన్)పై, 65-70 కిలోల ఫైనల్ బౌట్‌లో అరుంధతి (సర్వీసెస్) 5-0తో స్నేహ (ఏపీ)పై విజయం సాధించారు. 45-48 కిలోల ఫైనల్లో నివేదిత (ఉత్తరాఖండ్) 3-2తో మంజు రాణి (రైల్వేస్)ని ఓడించి విజేతగా నిలిచింది. భావన శర్మ (రైల్వేస్) 5-0తో సవిత (రైల్వేస్)పై నెగ్గి బంగారు పతకం దక్కించుకుంది.

ఢిల్లీ జోరు



చెన్నై: ప్రొ.కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ జోరు కొనసాగిస్తోంది. సోమవారం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో 29-26తో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌కు షాకిచ్చింది. ఈ గెలుపుతో తాజా సీజన్‌లో 20 పాయింట్లు సాధించిన తొలి జట్టుగా ఢిల్లీ నిలిచింది. ఢిల్లీ జట్టులో అషుమాలిక్ (8), సందీప్ (7) సత్తా చాటారు. రెజా, దీపాన్షు హైఫైవ్‌తో మెరిసినా జైపూర్‌కు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 36-28తో యూపీ యోధాస్‌ను చిత్తు చేసింది.

భగత్‌కు మూడు స్వర్ణాలు

అబియా పారా బ్యాడ్మింటన్



న్యూఢిల్లీ: నైజీరియాలో జరిగిన అబియా పారా బ్యాడ్మింటన్ టోర్నీలో ఏస్ షట్లర్ ప్రమోద్ భగత్ మూడు స్వర్ణాలు సాధించాడు. టోక్యో పారాలింపిక్స్‌లో పసిడి పతకం నెగ్గిన ప్రమోద్.. ఆ తర్వాత నాడాకు మూడు సార్లు తాను ఎక్కడ ఉన్నదీ తెలియజేయలేదు. దీంతో 18 నెలల నిషేధానికి గురైన భగత్.. పారిస్ పారాలింపిక్స్‌లో ఆడలేకపోయాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్ 3 కేటగిరీలో భారత షట్లర్ల మధ్య జరిగిన ఫైనల్లో ప్రమోద్ 21-7, 9-21, 21-9తో మాంటు కుమార్‌పై గెలిచాడు. డబుల్స్ తుదిపోరులో ప్రమోద్-సుకాంత్ కదమ్ జోడీ 21-13, 21-17తో నెగ్గింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆర్తీ పాటిల్‌తో కలసి ఆడిన ప్రమోద్ మూడో బంగారు పతకాన్ని సొంతం చేసుకొన్నాడు. మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో రజతం సాధించిన ఉమా సర్కార్.. డబుల్స్‌లో ఆర్తితో కలసి కాంస్యం అందుకొంది. డబ్ల్యూహెచ్1 విభాగంలో రంజిత్ సింగ్ మూడు కాంస్యాలు దక్కించుకొన్నాడు. ఎస్‌యు5 కేటగిరీలో కరణ్, రాహుల్, సతివద స్వర్ణ, రజత, కాంస్యాలతో క్లీన్‌స్వీప్ చేశారు.



జట్టు సంస్కృతి దెబ్బతినకూడదనే..

రోహిత్‌కు పగ్గాలివ్వలేదా?


ముంబై: ఆస్ట్రేలియాలో పర్యటనకు ఇటీవల ప్రకటించిన భారత జట్టులో రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. టీ20లు, టెస్టుల నుంచి వైదొలగిన హిట్‌మ్యాన్ కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్నాడు. కానీ ఒక ఫార్మాట్‌కే సారథిగా ఉన్న రోహిత్ తనదైన శైలిలో జట్టును నడిపిస్తాడని.. అది జట్టుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ భావిస్తున్నట్టు సమాచారం. 'రోహిత్ స్థాయి ఆటగాడు నాయకత్వ బాధ్యతల్లో ఉంటే..డ్రెస్సింగ్ రూమ్‌లో తనదైన ముద్ర వేస్తాడు. ఒకే ఫార్మాట్‌లో.. అది కూడా ఎప్పుడో జరిగే వన్డేలకు అతడు కెప్టెన్‌గా ఉండడం జట్టు సంస్కృతిని దెబ్బతీస్తుంది' అని బీసీసీఐ ముఖ్యుడొకరు వెల్లడించారు. కోచ్‌గా నియమితుడైన గంభీర్ తొలి ఆరు నెలలు జట్టుపై ఏమాత్రం పట్టు సాధించలేకపోయాడట. అయితే న్యూజిలాండ్‌తో స్వదేశంలో, ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టు టెస్టులు ఓడిపోవడం గంభీర్‌కు కలిసొచ్చింది. ఆ రెండు సిరీస్‌లలో పరాజయాల అనంతరం కోచ్‌గా గంభీర్ జట్టును తన చేతుల్లోకి తీసుకున్నాడట.



చేదు వార్తలు వినాల్సి రావచ్చు..

వన్డే వరల్డ్ కప్‌కు జట్టును సన్నద్ధం చేసే క్రమంలో రోహిత్ శర్మను సారథ్య బాధ్యతల నుంచి తప్పించి ఉంటారని దిగ్గజ బ్యాటర్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయంతో రోహిత్ కూడా ఏకీభవిస్తాడని చెప్పాడు. '2027 ప్రపంచ కప్‌కు రోహిత్ సిద్ధంగా ఉంటాడో లేదో తెలియదు. అతడు వన్డేలే ఆడుతున్నాడు. అంతర్జాతీయ కేలండర్‌ను చూస్తే భారత జట్టు పెద్దగా 50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడబోవడంలేదు. ఏడాదికి ఐదు నుంచి ఏడు వన్డేలు ఆడితే వరల్డ్ కప్‌లాంటి పెద్ద టోర్నీకి కావాల్సినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించదు. అందుకే శుభ్‌మన్‌ను సన్నద్ధం చేసేందుకు కెప్టెన్సీపై నిర్ణయం తీసుకొని ఉంటారు. పైగా..50 ఓవర్ల ఫార్మాట్‌కు జట్టు యాజమాన్యం ప్రణాళికలను పటిష్ఠం చేసుకోవాలని భావిస్తున్నందున రాబోయే రోజుల్లో మరిన్ని చేదు వార్తలు వినాల్సి రావొచ్చు' అని గవాస్కర్ అన్నాడు. అంటే..రోహిత్ వన్డేలకూ వీడ్కోలు పలుకుతాడన్న అభిప్రాయాన్ని గవాస్కర్ పరోక్షంగా చెప్పాడన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

గిల్‌పై అగార్కర్ ఒత్తిడి తెచ్చాడు!



వన్డే జట్టు సారథ్యం నుంచి రోహిత్‌ను తొలగించడాన్ని టీమిండియా మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ తప్పుబట్టాడు. అంతేకాదు..వన్డే జట్టు కెప్టెన్సీ చేపట్టాలని గిల్‌పై చీఫ్ సెలెక్టర్ అగార్కర్ ఒత్తిడి తెచ్చి ఉంటాడని అభిప్రాయపడ్డాడు.

ముంబై వరుసగా రెండో విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) సీజన్-4లో ముంబై మీటియర్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం రాత్రి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబై 3-0తో (15-9, 15-8, 15-12) డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్‌పై గెలిచింది. ఈ గెలుపుతో ముంబై పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. ముంబై సారథి అమిత్ గులియాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శ్రీశైలం చరిత్రలోనే అత్యధిక వరద


జూన్ నుంచి ఇప్పటిదాకా ప్రాజెక్టులోకి 2,105 టీఎంసీల ఇన్‌ఫ్లో

ఈ వాటర్ ఇయర్‌లో మరో 100 టీఎంసీలు వచ్చే అవకాశం

1994, 2022లో 2,039 టీఎంసీల చొప్పున శ్రీశైలంలోకి వరద

నాగార్జునసాగర్‌కు ఇప్పటిదాకా 1,578 టీఎంసీల ఇన్‌ఫ్లో

బంగాళాఖాతంలోకి 3,905 టీఎంసీల గోదావరి జలాలు



10

మంగళవారం | 7-10-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**



సీజేఐపై బూటు విసరబోయిన లాయర్!

సుప్రీం కోర్టు హాల్లో దిగ్ర్భాంతికర సంఘటన.. మధ్యలోనే అడ్డుకున్న భద్రతా సిబ్బంది

సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదంటూ లాయర్ రాకేశ్ కిశోర్ నినాదాలు

విష్ణుమూర్తి విగ్రహం కేసులో జస్టిస్ గవాయ్ చేసిన వ్యాఖ్యలపై నిరసన.. లాయర్‌ను అదుపులోకి తీసుకొన్న పోలీసులు

దాడి యత్నంపై చలించని జస్టిస్ గవాయ్.. విచారణలు కొనసాగించిన జడ్జీలు.. కేసు నమోదుకు సుప్రీంకోర్టు నిరాకరణ

మూడు గంటల తర్వాత విడుదల.. బార్ కౌన్సిల్ సభ్యత్వం తాత్కాలికంగా రద్దు.. దేశంలో ఎక్కడా వాదించకుండా చర్యలు

దాడి ఘటనను ఖండించిన ఖర్గే, సోనియా, పవార్, చంద్రబాబు, పినరయి విజయన్.. సీజేకు ఫోన్‌లో మోదీ పరామర్శ



రాకేశ్ కిశోర్

న్యూఢిల్లీ, అక్టోబరు 6: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కోర్టు హాలులో సోమవారం దిగ్ర్భాంతికర సంఘటన జరిగింది. 71 సంవత్సరాల వృద్ధ న్యాయవాది ఒకరు జస్టిస్ గవాయ్ బెంచ్ మీదకు బూటు విసరబోయారు. అయితే, పక్కనే ఉన్న భద్రతా సిబ్బంది మెరుపు వేగంతో స్పందించి బూటు బెంచ్ వరకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సంఘటన తర్వాతా జస్టిస్ గవాయ్ నిబ్బరంగా ఉన్నారు. "మీరు పట్టించుకోకండి. మేం పట్టించుకోం. ఇలాంటి సంఘటనలు నన్ను ప్రభావితం చేయలేవు. మీ పని కానివ్వండి" అని న్యాయవాదులను ఉద్దేశించి అన్నారు. ఉదయం 11.35కు జస్టిస్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాదులు అత్యవసర కేసులను ప్రస్తావిస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఢిల్లీలోని మయూర్

మిగతా 10వ పేజీలో...

విదేశీ విద్యకు సర్కారు ఊతం!



విద్యార్థులకు పావలా వడ్డీకే రుణాలు

వారి కలలకు రెక్కలు తొడుగుదాం

14 ఏళ్లలో రుణం చెల్లించే వెసులుబాటు

బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీ

రెసిడెన్షియల్ స్కూళ్లుగా వసతిగృహాలు

ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త..

అమలు బాధ్యత సంక్షేమ శాఖలదే

ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు మరో వరం ఇవ్వాలని నిర్ణయించారు. విదేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే ప్రతి విద్యార్థికీ పావలా వడ్డీకే బ్యాంకు రుణాలుఇచ్చేలా సరికొత్త పథకాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమంపై మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, ఫరూఖ్, సవిత, ఆయాశాఖల ఉన్నతాధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఎంతమంది విద్యార్థులైనా చదువుకునే వీలుండేలా ఈ పథకం ఉండాలని అధికారులకు నిర్దేశించారు. ఐఐటీ, ఐఐఎం, నిట్ వంటి ఉన్నత విద్యా సంస్థల్లో చదవాలనుకునే వారికి కూడా పథకం వర్తింపజేయాలని సూచించారు. "4 శాతం వడ్డీకే బ్యాంకులు రుణాలు ఇవ్వడంతోపాటు, వాటికి ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది. 14 ఏళ్ల పాటు రుణాలు చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తాం. ఐఐటీ, నీట్ ఎంట్రన్స్‌కు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థుల కోసం రెండు ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

ఆ స్కూళ్లు జూనియర్ కాలేజీలుగా మార్పు

రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లనూ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చడంపై అధ్యయనం చేయాలని, దీనిపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. "ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. హాస్టళ్లలో మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనతోపాటు ఏడాది వ్యవధిలో మరమ్మతులు పూర్తి చేయాలి" అని ఆదేశించారు. నసనకోట, ఆత్మకూరు బీసీ బాలికల పాఠశాలలను రూ.2.65 కోట్లతో జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం అనుమతించారు. అలాగే తల్లికి వందనం పథకం నుంచి పాఠశాల నిర్వహణ నిధి, టాయిలెట్

మిగతా 11వ పేజీలో...

డ్రోన్ సిటీకి ప్రధానితో శంకుస్థాపన

16 నాటికి తగిన ఏర్పాట్లు చేయాలి

డిసెంబరులో డ్రోన్‌షో నిర్వహించాలి

క్యూఆర్ కోడ్‌తో కూడా ప్రజాభిప్రాయ సేకరణ

సీసీ కెమెరాలను సమర్థంగా వాడుకోవాలి

ప్రభుత్వ శాఖల పనితీరుపై నెలవారీ ఆడిట్

ఆర్టీజీఎస్, పౌర సేవల సమీక్షలో సీఎం ఆదేశం

11



విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డు విజేత సాలూరుకు చెందిన పారిశుధ్య కార్మికుడు తాడు రాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం చంద్రబాబు

మీరూ 'సిందూర్' వీరుల్లాంటివారే!

దేశాన్ని శుభ్రపరుస్తున్న దేశభక్తులు మీరు

స్వచ్ఛ విజేతలకు పాదాభివందనాలు

స్వచ్ఛాంధ్ర సాకారంతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

ఇక ఏటా స్వచ్ఛ అవార్డులు

సంజీవని ద్వారా కుటుంబానికి కోటి బీమా

పరిశుభ్రత అందరి బాధ్యత.. అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం చంద్రబాబు వెల్లడి

11



బిహార్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తున్న సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు

మోగింది బిహార్ భేరీ

అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

రెండు దశల్లో ఎన్నికలు.. నవంబరు 6, 11 తేదీల్లో పోలింగ్

14న ఓట్ల లెక్కింపు.. సీట్లు 243.. మొత్తం ఓటర్లు 7.43 కోట్లు



న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. బిహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ చెప్పారు. నవంబరు 6, 11 తేదీల్లో పోలింగ్ జరుగుతుందని, 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్, వివేక్ జోషిలతో కలసి ఆయన ఈ వివరాలను వెల్లడించారు. అన్ని ఎన్నికల కన్నా ఈ ఎన్నికలు చాలా ముఖ్యమైనవని అభివర్ణించారు. అక్టోబరు నెలాఖరులో జరిగే ఛత్ పూజ ఉత్సవాల తర్వాత ఎన్నికలు జరపాలని రాజకీయ పార్టీలు కోరడంతో అందుకు అనుగుణంగా తేదీలను నిర్ణయించామని తెలిపారు. దాదాపు 8.5 లక్షల మంది అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారని వివరించారు. బిహార్‌లో సోమవారం నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై వివాదం నేపథ్యంలో.. కౌంటింగ్‌లో

మిగతా 10వ పేజీలో...

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చేనెల 11న



దాడిలో తీవ్రంగా గాయపడి రక్తమోడుతున్న ముఖంతో బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము

బెంగాల్లో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేపై దాడి

ఎంపీ ఖగెన్ ముర్ము తలకు తీవ్ర గాయాలు

వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల సందర్శనకు వెళ్లిన ఎంపీ, ఎమ్మెల్యేపై టీఎంసీ దాడి

బెంగాల్‌లో ఆటవిక రాజ్యం: బీజేపీ

ఇది ఆ పార్టీ స్వయంకృతం: తృణమూల్

10

రోగ నిరోధక వ్యవస్థపై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు

వైద్య నోబెల్

అమెరికాకు చెందిన మేరీ బ్రన్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, జపాన్‌కు చెందిన సకగూచీకి సంయుక్తంగా ప్రకటన

10

నకిలీ మకిలిలో వైసీపీ!



ఏ12 కొడాలి శ్రీనివాసరావు

మద్యం తయారీ కేంద్రం లీజు ఆ పార్టీ నేత పేరుతోనే

ఏ-12గా తెనాలి వైసీపీ నేత కొడాలి శ్రీనివాసరావు

ఐదేళ్లుగా ఇదే దందాలో ఉన్నారనే అనుమానం

అరెస్టు చేస్తే తమ గుట్టూ రట్టవుతుందనే భయం

నిందితులకోసం ఎక్సైజ్ అధికారుల గాలింపు

అదుపులో ఏ-2 నిందితుడు కట్టా రాజు?

జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ కోసం గాలింపు

ఇబ్రహీంపట్నంలో జనార్దన్‌రావు బార్ సీజ్

నిందితుల కాల్ డేటా, బ్యాంక్ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి.. కీలక ఆధారాలు లభ్యం

ఆయన పెద్దిరెడ్డి మనిషే!

జయచంద్రా రెడ్డి వైసీపీ కోవర్టే

ఎన్నికల ముందు టీడీపీలో చేరిక

అనూహ్యంగా తంబళ్లపల్లి టికెట్

ద్వారకానాథ్ గెలుపునకు సహకారం

మిథున్‌తో కలిసి ఉగాండాలో వ్యాపారం?

విజయవాడ/తెనాలి/రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం తయారీ కేసులో వైసీపీ లింకులు బయటపడుతున్నాయి. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో బయట పడిన మద్యం తయారీ 'కేంద్రం' లీజు తీసుకున్నదే వైసీపీ నేత. ఇక... మరో అనుమానితుడు జయచంద్రారెడ్డి పేరుకే టీడీపీ నాయకుడు! ఆయన మనసంతా వైసీపీయే అనే వాదనలున్నాయి. నిజానికి ఐదేళ్ల కిందట వైసీపీ హయాంలోనే ఈ 'నకిలీ మకిలి'

మిగతా 12వ పేజీలో...



సోమవారం ముంబైలో టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్‌తో సమావేశమైన మంత్రి లోకేశ్

తరలిరండి

రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్‌కు లోకేశ్ ఆహ్వానం

అన్ని రంగాల్లోనూ పెట్టుబడులు పెట్టండి

ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ ఇన్‌ఫ్రా అభివృద్ధిలో పాలుపంచుకోండి

రూఫ్‌టాప్ సోలార్ అభివృద్ధిలో కూడా

విశాఖలో టాటాఎలెక్సీ సెంటర్ పెట్టండి

శ్రీసిటీలో ఎలక్ట్రానిక్ వాహన విడిభాగాల యూనిట్ల స్థాపనను పరిశీలించండి

భూమి, వసతులు కల్పిస్తాం.. లోకేశ్ హామీ

పలువురు ఇతర పారిశ్రామికవేత్తలతోనూ వరుస భేటీలు.. పెట్టుబడులకు ఆహ్వానం

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో టాటా గ్రూప్ భాగం కావాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ పిలుపిచ్చారు. అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. సోమవారం ముంబైలో ఆయన టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో సమావేశమయ్యారు. టాటా పవర్ రెన్యూవబుల్స్ సీఈవో సంజయ్‌కుమార్ బంగా, ఇండియా హోటల్స్ ఎండీ పునీత్ చత్వాల్, టాటా ఆటో కాంప్ సీఈవో

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రాల మధ్య సహకారం ముఖ్యం



కర్ణాటకలోని చింతామణిలో జరిగిన సభలో జస్టిస్ వి.గోపాల గౌడ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభివాదం

7

2019లో నేను ఓడినప్పుడు జస్టిస్ గోపాలగౌడ అండగా ఉన్నారు.. ఎంతో ధైర్యం చెప్పారు

సుప్రీం మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాలగౌడ పుట్టినరోజు వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

2027కల్లా పూర్తిచేయాలి

ఆలోపే పునరావాసం కూడా

పోలవరంపై కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ స్పష్టీకరణ

ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష

బిహార్ ఎన్నికల తర్వాత వస్తానని కేంద్ర మంత్రి వెల్లడి

11



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను సత్కరిస్తున్న మంత్రి నిమ్మల

మల్లోజుల లొంగుబాట!

మావోయిస్టు పార్టీని వీడేందుకు సిద్ధమైన అగ్ర నేత?

9

పోలీసులతో సంప్రదింపులు? సమాచారం లేదంటున్న పోలీసులు

తాజాగా మల్లోజుల వేణుగోపాల్ మరో లేఖ విడుదల

పార్టీ తప్పిదాలే పోరాటాన్ని దెబ్బతీశాయి.. ప్రాణత్యాగాలను ఆపాలి

పార్టీ నష్టపోవడంలో నేనూ కారకుడినే.. తప్పుకొంటున్నా: మల్లోజుల

ఐసీయూలో ఆరుగురు ఆహుతి

- జైపూర్‌లోని ప్రభుత్వాస్పత్రిలో షార్ట్ సర్క్యూట్
- ట్రామా సెంటరులో వేగంగా మంటల వ్యాప్తి
- అక్కడ చికిత్స పొందుతున్న 11 మందిలో ఐదుగురిని రక్షించగలిగిన సహాయక సిబ్బంది
- విచారం వ్యక్తంచేసిన ప్రధాని నరేంద్ర మోదీ

10

ఎకరా 177 కోట్లు!

తెలంగాణలో రికార్డు ధర పలికిన భూమి

7.67 ఎకరాలకు రూ.1,357 కోట్లు.. దుర్గంచెరువు పక్కనే కొండపై భూమి

వేలంలో కొన్న ఎంఎస్ఎన్ రియాల్టీ.. 11 ఎకరాలు 1,556 కోట్లకు కొన్న ప్రెస్టీజ్

మూడేళ్ల కిందట ఎకరం 100 కోట్లు.. నాడు రాజపుష్ప కొన్నదే రికార్డు

10

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బిహార్ భేరీ

నితీశ్‌కుమార్ ఎటుంటే బిహార్‌లో అధికారం అటు పరుగు దీస్తుందని ఆయన పార్టీవారు గొప్పగా చెబుతూంటారు. రెండుదశాబ్దాలుగా బిహార్‌లో జరుగుతున్నదేమిటో తెలిసిందే కనుక, గిట్టనివారు సైతం నిజమేనని అనక తప్పడం లేదు. ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటించడంతో, బిహార్‌లో ఏ పార్టీ గెలుస్తుందన్న ప్రశ్నకంటే, నితీశ్ మళ్ళీ సీఎం అవుతారా? అన్న చర్చే ఎక్కువగా సాగుతోంది. మొన్న శనివారం ప్రధాని సమక్షంలో జరిగిన ఒక జాతీయస్థాయి సమావేశంలో పాట్నానుంచి వర్చువల్‌గా పాల్గొన్న నితీశ్ నిముషానికి పైగా చేతులు జోడించి నమస్కారాలు పెడుతూ, వాటిని అదే పనిగా ఊపుతూ, అర్థంలేని చూపులు చూస్తున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. ప్రధాని మోదీని ప్రసన్నం చేసుకోవడానికి నితీశ్ మరీ సాగిలబడిపోతూ బిహారీల పరువు తీసేస్తున్నారని ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్ ఘాటుగా విమర్శించారు. నితీశ్ ఇలా వింతగా ప్రవర్తించడం కొత్తేమీ కాదంటూ, తనకు స్వాగతం పలుకుతూ ఒక మొక్కని అందించినవారి నెత్తిమీదే దానిని తిరిగి ఉంచి నితీశ్ నవ్వుతూండటం, జాతీయగీతాన్ని లక్ష్యపెట్టకుండా ఒక సీనియర్ అధికారితో ముచ్చట్లు పెట్టడం వంటి మరికొన్ని వీడియోలు కూడా ఈ ఎన్నికలవేళ ప్రచారంలోకి వస్తున్నాయి. ఈ సుశాసన్ బాబు మానసిక స్థితి సరిగా లేదనీ, 74ఏళ్ళ ఈయన ఇక బిహార్‌ను ఏలేందుకు ఎంతమాత్రం సమర్థుడుకాదని తేజస్వి అవకాశం దొరికినప్పుడల్లా ప్రచారం చేస్తూనే ఉన్నారు. అయితే, మళ్ళీ నితీశేనా? అన్న ప్రశ్న ఆయన ఆరోగ్యస్థితినుంచి పుట్టినది కాదు. బీజేపీ గతంలో లాగానే ఈమారు కూడా ఆయనపట్ల ఉదారంగా ఉంటుందా? అన్న అనుమానం వల్ల.

దేశవ్యాప్తంగా ఓటరుజాబితాల ప్రక్షాళనకు బిహార్ పునాదిగా, ప్రయోగ కేంద్రంగా ఎన్నికల సంఘానికి ఉపకరించింది. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) విపక్షాలకూ, ఎన్నికల సంఘానికీ మధ్య తీవ్రస్థాయి ఘర్షణ సృష్టించింది. రమారమి ఓ యాభైలక్షల పేర్లు తొలగిన తరువాత ఇప్పుడు తుదిజాబితాలో మిగిలిన 7. 42కోట్లమంది ఓటర్లు రాజకీయపార్టీల భవిష్యత్తును నిర్ణయించబోతున్నారు. దేశవ్యాప్తంగా అమలు చేయాలనుకుంటున్న 17 కొత్త సంస్కరణలు కూడా బిహార్‌నుంచే మొదలవుతున్నాయి. ఒక పోలింగ్ బూత్‌ను 1200మంది ఓటర్లకు మాత్రమే పరిమితం చేయడం, ఈవీఎంల మీద అభ్యర్థుల కలర్ ఫోటోలు, ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును ముందుకు జరిపి, తప్పనిసరి చేయడం ఇత్యాదివి ఆహ్వానించదగినవి. రాహుల్ చేసిన'ఓట్ చోరీ' ఆరోపణలు, యాత్రలు ఎన్నికల సంఘాన్ని ఆత్మరక్షణలోకి నెట్టినమాట నిజం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో ఈసీ కుమ్మక్కయిందని, జాబితా ప్రక్షాళన పేరుతో విపక్షాల ఓట్లను గల్లంతుచేశారని ఆ పార్టీలు ఆరోపించడం, 'సర్'కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానంలో పలు కేసులు దాఖలు కావడం, చివరకు కోర్టు ఆదేశాల మేరకు ఓటరు యోగ్యతాపత్రంగా ఆధార్‌ను సైతం పరిగణనలోకి తీసుకోవడానికి ఈసీ తప్పనిసరిగా అంగీకరించడం తెలిసినవే. జాబితాలో తొలగింపులు, జోడింపుల అక్రమాలు బయటపడకుండా ఉండటానికే ఎన్నికల సంఘం మెషీన్ రీడబుల్ ఫార్మేట్‌లో ఓటరు లిస్టులు అందివ్వడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. ఈవీఎం డేటా, బ్యాటరీ లాగ్స్, సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వడానికి ఈసీ నిరాకరించడం, పైపెచ్చు నలభైఐదు రోజుల్లో ఫుటేజ్‌ను నాశనం చేయాలని కలెక్టర్లను ఆదేశించడం కూడా వివాదాస్పదమైనాయి. 'సర్'ను సవాలు చేయడంతో పాటు, ఎలక్షన్ కమిషనర్ల నియామక ప్రక్రియను కూడా తప్పుబడుతూ సుప్రీంకోర్టులో కేసులు దాఖలైనాయి. చీఫ్ జస్టిస్ స్థానంలో ప్రధాని నియమించిన ఒక మంత్రిని సెలక్షన్ ప్యానెల్‌లోకి తెచ్చి, ఎన్నికల సంఘాన్ని అధికారపక్షం హస్తగతం చేసుకుందంటూ విపక్షాలు మరోమారు విరుచుకుపడ్డాయి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కూడా గతానికి భిన్నంగా రాజకీయపార్టీలతో గట్టిగానే పోరాడారు.

ఐదేళ్ళక్రితం ఎన్నికల్లో మహాగఠ్బంధన్ కంటే ఓ పదిహేను అసెంబ్లీ స్థానాలను అధికంగా తెచ్చుకొని ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. అరవైఐదెనిమిది శాతం స్ట్రైక్‌రేట్‌తో 74సీట్లను నెగ్గుకొచ్చిన బీజేపీ, 37శాతం స్ట్రైక్‌రేట్‌తో 43సీట్లను మాత్రమే గెలుచుకున్న నితీశ్‌ను తమ అధినాయకత్వం ముఖ్యమంత్రి పీఠంమీద కూచోబెట్టినందుకు బిహార్ బీజేపీ నాయకులకు ఇప్పటికీ ఎంతో బాధగా ఉంది. ఈ మారు ఏమాత్రం లెక్కలో తేడా వచ్చినా, ఆ ఔదార్యం కొనసాగనివ్వకూడదని వారి వాదన, ఆవేదన.

రైతు క్షేమమా, ట్రంప్ స్నేహమా.. ఏది ముఖ్యం?

అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య ఒప్పందాలు, వాటికి సంబంధించిన సంస్థలు అన్నీ సంపన్న దేశాల ప్రయోజనాల కోసమే ఉన్నాయన్నది కాదనలేని నిజం. కాకులను కొట్టి గద్దలకు వేసినట్టు పేద, వర్ధమాన దేశాల మీద అభివృద్ధి చెందిన దేశాల పెత్తనాన్ని బలోపేతం చేయడానికే అవి అవతరించాయి. అప్పటికీ సంతృప్తి చెందని అమెరికా ఈ ఒప్పందాలు నిర్దేశించిన నియమాలను కూడా కాలరాస్తున్నది.

అమెరికా తన రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తూ, వారు పండించిన పంటలను తక్కువ ధరలకు ఎగుమతి చేసుకొని లాభపడేలా చూస్తున్నది. ఇది వర్ధమాన దేశాల్లో వ్యవసాయ సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. ఇంకా జన్యుమార్పిడి పంటల భారీ ఎగుమతి, వాణిజ్య పంటల సాగును మితి మించి ప్రోత్సహించడం వంటి చర్యలతో అమెరికా వంటి సంపన్న దేశాలు పేద దేశాల సాగు వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఆహారభద్రతకు హాని తెస్తున్నాయి.

అంతర్జాతీయ ఒప్పందాలు ఎంతగా సంపన్న దేశాలకు, బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు దాస్యం చేస్తున్నప్పటికీ వర్ధమాన దేశాల మేలు కోరి ఒకటీ అరా నియమాలను చేర్చకపోలేదు. 1995లో ఏర్పాటైన ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) సభ్య దేశాలు పరిమిత సుంకాలకు కట్టుబడాలనే నియమాన్ని విధించింది. ఈ సుంకాలను దాటాలంటే చర్చలు తప్పనిసరి అనే నిబంధననూ చేర్చింది. ఈ 'tariff bindings' ప్రకారం అమెరికా అన్ని రకాల విదేశీ సామగ్రి పైన సగటున 3.4 శాతానికి మించి సుంకాలను విధించకూడదు. అయితే చివరకు ఈ నిబంధనలన్నీ ఏనుగును పురికొస తాళ్ళతో బంధించినట్లే అయ్యింది. అమెరికా విశృంఖలత్వాన్ని ఆపే శక్తి వీటికి కొరవడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) ఇండియా తదితర వర్ధమాన, పేద దేశాలకు కొన్ని వెసులుబాట్లు కల్పించింది. వాటినే ప్రత్యేక వెసులుబాట్లు (special differential treatment – STD)గా పరిగణిస్తారు. విదేశీ వస్తువుల మీద తాము విధించే అధిక సుంకాలను క్రమక్రమంగా తగ్గించే అవకాశాన్ని ఈ నిబంధన అభివృద్ధి చెందుతున్న దేశాలకు కల్పించింది. దేశీయ కీలక రంగాలను సంపన్న దేశాల సరకుల దాడి నుంచి కాపాడుకోవడంలో ఇండియాకు ఈ ఎస్‌టీడీ ఉపయోగపడుతున్నది. ఆర్థిక బలహీన దేశాలు తమ వ్యవసాయాది రంగాలను కాపాడుకోడానికి సంపన్న దేశాల ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేయడానికి ఈ వెసులుబాటు అవకాశమిస్తున్నది. ఇండియా భారీ సుంకాలు విధిస్తున్నదని ట్రంప్ గగ్గోలు పెట్టడానికి ఇదే కారణం. ఇవి నియమబద్ధ సుంకాలు. ఇండియాతో వాణిజ్య లోటు తగ్గించుకోడానికి స్టీల్ దిగుమతుల మీద 25శాతం, అల్యూమినియం మీద 10 శాతం సుంకాలను అమెరికా విధించి ఉంది. అమెరికా వాణిజ్య చట్టం 232 సెక్షన్ కింద జాతీయ భద్రతా వసరాల కోసం వీటిని విధించినట్టు చెప్పుకున్నది. వాణిజ్య ఒప్పందాలను జాతీయ భద్రత పేరుతో ఉల్లంఘించడం అక్రమమని ప్రపంచ వాణిజ్య సంస్థ తీర్పు ఇచ్చింది. అయినా అమెరికా దూకుడు ఆగలేదు.

వాణిజ్య రంగంలో ఇండియాను బూటు కాళ్ళతో తొక్కిపట్టి తన షరతులకు అంగీకరింపజేయాలని ట్రంప్ తెగబడుతున్నాడు. ప్రధాని మోదీ తన సన్నిహిత మిత్రుడు అంటూనే భారతీయ సరకులపై 25శాతం సుంకంతోబాటు రష్యా నుంచి క్రూడాయిల్‌ను కొంటున్నందుకు అదనంగా మరి 25శాతం, మొత్తంగా 50 శాతం సుంకాలను విధించాడు. ట్రంప్ విధించిన ఈ 50శాతం సుంకాలు అమెరికాకు భారతీయ ఎగుమతులను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. ఆగస్టు 6 వరకు 10 శాతం సుంకాలనే భరించిన ఇండియా ఆ నెల 27 వరకు 25 శాతం, ఆ తర్వాత నుంచి 50 శాతం సుంకాలను చెల్లిస్తున్నది. ఈ విధంగా అధిక సుంకాల భారం ఆగస్టులో పరిమితమే అయినప్పటికీ ఆ కొద్ది రోజుల్లోనే ఇండియా నుంచి అమెరికాకు స్మార్ట్ ఫోన్ల ఎగుమతులు 58శాతం తగ్గిపోయాయి, మందుల ఎగుమతులు 13.3శాతం పతనమయ్యాయి. అల్యూమినియం 19శాతం; ఇనుము, స్టీలు 13.1 శాతం; రాగి 10.2 శాతం పడిపోయాయి. రొయ్యల వంటి సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతులు 43.8శాతం దెబ్బతిన్నాయి. ఈ అన్ని రంగాల్లోను దేశంలో ఉద్యోగాలు గణనీయంగా మాయమయ్యాయి. నిరుద్యోగం ప్రబలుతున్నది.

వాస్తవానికి ఇండియాపై ట్రంప్ కోపానికి కారణం మనం రష్యా నుంచి ఆయిల్ కొనడం ఒక్కటే కాదని, అమెరికా నుంచి జన్యు మార్పిడి మొక్కలను (మొక్కజొన్న) కొనుగోలు చేయకపోడమేనని స్పష్టపడిపోయింది. '140 కోట్ల జనాభా గల ఇండియా అమెరికా నుంచి ఒక బషేల్ (27.2 కిలోలు) మొక్కజొన్న కొనలేదా?' అని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లూత్నిక్ హుంకరించాడు. 'ఇండియా మెడలు వంచి అమెరికా మొక్కజొన్నను కొనిపిస్తాం చూడండి' అని గాండ్రించాడు. ప్రపంచంలోని అత్యధిక మొక్కజొన్న ఉత్పత్తిదార్లలో ఇండియా ఐదవ స్థానంలో ఉంది. దాని పంటే దానికి ఎక్కువైపోతున్నప్పుడు దానిని దిగుమతి చేసుకోవలసిన అవసరం ఇండియాకు లేదు. ఇండియాలో 50 కోట్లమంది వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. ఇలాంటప్పుడు అధిక సబ్సిడీల చౌక వ్యవసాయోత్పత్తులను అమెరికా నుంచి దిగుమతి చేసుకొని దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసుకోడం అంటే తానెక్కిన కొమ్మను నరుక్కోడమే అవుతుంది.

ట్రంప్ ప్రకటించిన ఏకపక్ష టారిఫ్ యుద్ధం అమెరికాకు మేలు చేయకపోగా తీవ్ర సంక్షోభాన్ని దాని మెడకు చుడుతున్నది. ధరలు పెరిగిపోయి అమెరికా పౌరుల జేబులు గుల్ల అయ్యే పరిస్థితి తలెత్తింది. చైనా మీద సుంకాలు పెంచడంతో అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి చేసుకోవడం అది మానుకున్నది. ప్రపంచంలో పండే సోయాబీన్ పంటలో 60శాతాన్ని చైనా దిగుమతి చేసుకుంటున్నది. ఇందులో సగం అమెరికా నుంచే కొనేది. ఇప్పుడు అది అమెరికా నుంచి కొనడం మానేసింది. ఆ మేరకు సోయాబీన్‌ను బ్రెజిల్ నుంచి కొంటున్నది. దీనితో అమెరికా రైతు నష్టాల్లో కూరుకుపోయాడు. ముఖ్యంగా ట్రంప్ మద్దతుదార్లు, మితవాద రైతులు అత్యధికంగా ఉన్న మధ్య అమెరికా రాష్ట్రాల (లోవా, నెబ్రెస్కా, కన్సాస్ తదితర రాష్ట్రాలు) సోయాబీన్, మొక్కజొన్న పంటలకు ఎగుమతి ద్వారాలు మూసుకుపోయాయి. దీనితో ఇండియాను భయపెట్టి తన జన్యు మార్పిడి మొక్కజొన్నను కొనుగోలు చేసేలా ఒప్పించాలని అమెరికా అన్ని ఉపాయాలను ప్రయోగిస్తున్నది. అమెరికా రైతు వర్గం చాలా బలమైనది. ఒక్కొక్క రైతుకీ కనీసపక్షం 500 నుంచి 10,000 ఎకరాల భూమి ఉంటుంది. వీరి లాభాల కోసం ఒకటి, అర ఎకరాల కమతాలు మాత్రమే ఉండే భారతీయ బక్క రైతు రక్తాన్ని మరింతగా పీల్చుకోవాలని అమెరికా చూస్తున్నది.

అమెరికన్ల అసంతృప్తి పెరిగి ఉప్పొంగితే తప్ప ట్రంప్ తలకు ఎక్కిన ఉన్మాదం తగ్గుముఖం పట్టదు. ట్రంప్‌తో దోస్తీనా, దేశీయ రైతు క్షేమమా.. ఈ రెండిటిలో ఏది ముఖ్యమో తేల్చుకోలేక ప్రధాని మోదీ గుంజాటన పడుతున్నారు. ఇప్పటికే అమెరికా పత్తి దిగుమతులపై సుంకాలను మనం తాత్కాలికంగా తొలగించి దానిని పొడిగిస్తూ ఉన్నాం. చైనా మాదిరిగా అమెరికా సరకులపై ప్రతి సుంకాలను విధించి సవాలు చేయడానికి ఇంకా భయపడుతున్నాం. ఇది మోదీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నది. అమెరికా కపట మైత్రి, దాని భారీ సుంకాల వాస్తవికత ఎంతగా గాయపరుస్తున్నా, వాణిజ్య చర్చల్లో ఏదో ఒక సానుకూలత లభిస్తే మళ్ళీ దాని పంచన చేరవచ్చని బహుశా మోదీ ఎదురు చూస్తుండవచ్చు.

రక్తం చవి చూడనిదే పులి వదిలిపెట్టదనే సంగతి అందరికీ తెలిసిందే. భారత సువిశాల మార్కెట్‌పై అమెరికా కన్నేసింది. మన రైతుల ప్రయోజనాలపై పడగ నీడ పరిచింది. చవకగా లభిస్తున్న రష్యా చమురును కొనుగోలు చేయడం ఇండియా చేస్తున్న నేరంగా అమెరికా చూపిస్తున్నది. ఈ అమెరికా వైఖరి వల్ల రష్యా, చైనాలకు ఇండియా చేరువ కాక తప్పటం లేదు. మున్ముందు సైతం ఈ సాన్నిహిత్యాన్ని బలోపేతం చేసుకుని చైనాతో సరిహద్దు వివాదాన్ని కూడా ఉభయ హితంగా పరిష్కరించుకోగలిగితే ఇండియాకు గణనీయమైన మేలు జరుగుతుంది.



భారత సువిశాల మార్కెట్‌పై అమెరికా కన్నేసింది. మన రైతుల ప్రయోజనాలపై పడగ నీడ పరిచింది. చవకగా లభిస్తున్న రష్యా చమురును కొనుగోలు చేయడం ఇండియా చేస్తున్న నేరంగా అమెరికా చూపిస్తున్నది. ఈ అమెరికా వైఖరి వల్ల రష్యా, చైనాలకు ఇండియా చేరువ కాక తప్పటం లేదు.

◆ గార శ్రీరామమూర్తి
సీనియర్ పాత్రికేయులు

గ్రామీణాభివృద్ధికి సీఎస్ఆర్ చేయూత

కంపెనీలు తమ నికర లాభంలో కొంత భాగాన్ని సమాజానికి ఉపయోగపడే పనుల కోసం ఖర్చు చేయడం– కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్). కంపెనీల చట్టం–2013 ప్రకారం, పెద్ద సంస్థలు తమ సగటు నికర లాభాలలో కనీసం రెండు శాతం తప్పనిసరిగా విద్య, ఆరోగ్యం, పర్యావరణం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలపై ఖర్చు చేయాలి. ఇది చాలా మంచి నిర్ణయం. ఎందుకంటే ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు పేదల సంక్షేమం, విద్య, వైద్యం, గ్రామ రహదారులు, పర్యావరణ రక్షణ లాంటి కార్యక్రమాలకు వెళ్తున్నాయి. దీంతో వ్యాపార సంస్థలు కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యత కూడా తీసుకుంటున్నాయి.

ఈ చట్టం అమలులో ఉన్నప్పటికీ, కంపెనీలు తమ కార్యాలయాలు, పరిశ్రమలు ఉన్న కేవలం నగరాల పరిసర ప్రాంతాలలోనే వీటిని ఖర్చు పెట్టడానికి ఇష్టపడుతున్నాయి. 70 శాతం ప్రజలు నివసిస్తున్న మారుమూల గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాలు, వెనుకబడిన జిల్లాలకు మాత్రం తక్కువ నిధులు వెళ్తున్నాయి. పట్టణాలలో జరిపే కార్యక్రమాల ద్వారా ఎక్కువ ప్రచారం, గుర్తింపు లభిస్తాయని కంపెనీలు భావిస్తున్నాయి. అందువల్ల ఎక్కువ అవసరం ఉన్న మారుమూల ప్రాంతాలకు సీఎస్ఆర్ నిధులు చేరడం లేదు. ఈ విధానం, నిధుల నిరుపయోగానికి దారితీస్తున్నది. ఇది దేశ సమగ్రాభివృద్ధి లక్ష్యానికి విరుద్ధం.

సామాజిక, ఆర్థిక స్థితిగతులు, వనరుల లభ్యత ఆధారంగా భారత ప్రభుత్వం కొన్ని జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించింది. ఇవి విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల పరంగా వెనుకబడి ఉన్నాయి. 2018లో నీతీ ఆయోగ్ 'ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రామ్' ప్రారంభించింది. దేశంలో వందకి పైగా జిల్లాలను గుర్తించి, వీటిని త్వరగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, నీటి వనరులు, నైపుణ్యాభివృద్ధి–ఉపాధి, రహదారులు, విద్యుత్, కనెక్టివిటీ లాంటి వాటిని ప్రధాన రంగాలుగా ఎంపిక చేసింది. ఈ ప్రాంతాల అభివృద్ధిపై ఎక్కువ నిధులు కేటాయించి, తగిన మౌలిక వసతులను కల్పిస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.

చిన్న చిన్న పెట్టుబడులు గ్రామాలలో పెద్ద మార్పులను తీసుకురాగలవు. గ్రామాల మధ్య రహదారులు వేస్తే వందల కుటుంబాలు మార్కెట్, పాఠశాల, ఆసుపత్రి వంటి వాటికి సులభంగా వెళ్లగలుగుతాయి. ఆరోగ్య కార్యక్రమాల వల్ల మాతా–శిశు మరణాలు తగ్గుతాయి. నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. చెరువుల మరమ్మతు వల్ల వందల ఎకరాల్లో పంటలు పండుతాయి. ఇలా సీఎస్ఆర్ పెట్టుబడి వల్ల జీవన ప్రమాణాలు పెరుగుతాయి, వలసలు తగ్గుతాయి, గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.



పట్టణాలలో అభివృద్ధి జరిగితే అది సమగ్రాభివృద్ధి అనిపించుకోదు. గ్రామాలలో విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. కనీసం ఒక శాతం సీఎస్ఆర్ నిధులు వెనుకబడిన జిల్లాల్లో తప్పనిసరిగా ఖర్చు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించాలి.

చాలా గ్రామాల్లో రహదారులు, తాగు నీరు, విద్యుత్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు లేవు. సరైన పాఠశాలలు, టీచర్లు లేకపోవడం వల్ల గిరిజన పిల్లల్లో డ్రాప్‌ఔట్ రేటు ఎక్కువ. పోషకాహార లోపం, మాతా–శిశు మరణాలు, కాలానుగుణ వ్యాధులు ఎక్కువ. వీటి నివారణకు మొబైల్ హెల్త్ యూనిట్లు, అవగాహన కార్యక్రమాలు అవసరం. వర్షాధార వ్యవసాయం వల్ల రైతులు నష్టపోతున్నారు. సీఎస్ఆర్ ద్వారా నీటి వనరులు, నైపుణ్యాభివృద్ధి, చిన్న వ్యాపారాలకు సహాయం చేయవచ్చు. గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధిలో భాగం కావడానికి సీఎస్ఆర్ నిధులు తోడ్పడతాయి.

టాటా స్టీల్ సంస్థవారు జార్ఖండ్ గిరిజన ప్రాంతాల్లో మాతా–శిశు ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేశారు. దీనివల్ల శిశు మరణాలు తగ్గాయి. ఐటీసీ కంపెనీ మధ్యప్రదేశ్ మారుమూల ప్రాంతాల రైతులకు డిజిటల్ కియోస్క్‌లను అందజేసింది. రైతులు పంట ధరలు, వాతావరణ సమాచారం, కొత్త పద్ధతులు తెలుసుకొని ఎక్కువ లాభం పొందుతున్నారు.

తెలంగాణలోని, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలలో కే-ఫిన్-టెక్, టెరాడేటా, మెడ్‌ప్లస్ వంటి కార్పొరేట్ సంస్థల సహకారంతో సాగునీటి బావులు, సోలార్ కంచెలు, వాటర్–షెడ్ లాంటి అనేక పనులను ఏకలవ్య ఫౌండేషన్ చేపట్టింది. దీంతో గతంలో ఒక్క పంట పండించే రైతులు, ఇప్పుడు రెండు పంటలు పండిస్తున్నారు. 30 శాతం వరకు ఆదాయం పెరిగి, వలసలు తగ్గాయి. వేదాంత సంస్థ ఒడిశా, రాజస్థాన్ గిరిజన ప్రాంతాల్లో ఆధునిక అంగన్‌వాడీలను నిర్మించింది. చిన్నారులకు విద్య, పోషకాహారం, ఆరోగ్యం అందించడంతో పాటు మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు.

గిరిజన, మారుమూల ప్రాంతాలలో సీఎస్ఆర్ ప్రాజెక్టులు అమలు చేయడానికి కొన్ని అడ్డంకులు ఉన్నాయి. సరైన రోడ్లు లేకపోవడం వల్ల ఆయా ప్రాంతాలకు చేరుకోవడం కష్టంగా ఉంది. విశ్వసనీయతతో పనిచేసే స్వచ్ఛంద సంస్థల కొరత ఉన్నది. స్థానిక పరిస్థితులు, భాషలు తెలిసిన యోగ్యమైన సిబ్బంది అందుబాటులో లేరు. సీఎస్ఆర్ సంస్థలు మారుమూల ప్రాంతాలలో పనిచేయడానికి సిద్ధంగా లేవు. గ్రామీణ ప్రాంతాలలో మార్పునకు కొంత ఎక్కువ సమయం పడుతుంది. అందుకు సంస్థలు సిద్ధం కావడం లేదు.

కనీసం ఒక శాతం సీఎస్ఆర్ నిధులు వెనుకబడిన జిల్లాల్లో తప్పనిసరిగా ఖర్చు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించాలి. వెనుకబడిన జిల్లాల్లో ప్రాజెక్టులు చేపట్టిన కంపెనీలకు ప్రభుత్వం అవార్డులు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి. స్థానిక ప్రభుత్వాలు, నీతీ ఆయోగ్, ఎన్‌జీఓలతో కలిసి ప్రాజెక్టులు అమలు చేయాలి. మొబైల్ యాప్‌లు, శాటిలైట్ మ్యాపింగ్ వాడి ప్రాజెక్టులను పర్యవేక్షించాలి. గ్రామాల సమూహాన్ని ఒక క్లస్టర్‌గా దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధికి యోచన చేయాలి.

కేవలం పట్టణాలలో అభివృద్ధి జరిగితే అది సమగ్రాభివృద్ధి అనిపించుకోదు. గ్రామాలలో విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. వ్యవసాయ రంగం, గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి చెందితే యువతకు జీవనోపాధితో పాటు నగరవాసులకు అవసరమైన నిత్యావసరాలు అందుబాటులోకి వస్తాయి. భారతదేశానికి మూలం గ్రామాలే. గ్రామాల బాగుకు ప్రభుత్వ కృషికి సీఎస్ఆర్ నిధుల సహకారం ఎంతైనా అవసరం.

• పి. వేణుగోపాల్‌రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు

'ఉపాధి' సిబ్బందిపై ఉదాసీనత

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రానికి మెటీరియల్ నిధులు రావడానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వారూ కారణమే. పథకంలో ఇంత ప్రాధాన్యం కలిగిన సదరు సిబ్బందికి కనీస వేతనాలు కూడా దక్కడం లేదు. ఆ ఉద్యోగుల సమస్యలపై స్పందిస్తూ ప్రభుత్వం గత ఏడాది డిసెంబరులో ఇంటర్నల్ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ఆ కమిటీ నేటికీ నివేదిక ఇవ్వకపోవడం విచారకరం. డిప్యూటీ సీఎం చొరవ తీసుకుని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌తో చర్చలు జరిపితే తప్ప ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్య పరిష్కారమయ్యేలా కన్పించడం లేదు.

ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నెలకు కేవలం రూ.13,000 నుంచి రూ.15,865 వరకు మాత్రమే గౌరవ వేతనాన్ని చెల్లిస్తోంది. 2019 తర్వాత వారి జీతాల పెంపును పాలకులు విస్మరించారు. ఇవన్నీ ఒకెత్తయితే కేవలం గౌరవ వేతనంతో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకంలోని ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ వారికి 'తల్లికి వందనం, రేషన్ కార్డులు, పింఛన్' వంటి అనేక సదుపాయాలను అధికారులు నిలిపేశారు. దీంతో రాష్ట్రంలోని దాదాపు రెండు వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

ఎస్.ఆర్.డి.ఎస్ (సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) నిబంధనల ప్రకారం మూడేళ్ల సర్వీసు పూర్తయ్యాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టీఈ (ఫిక్స్ టెన్యూర్ ఎంప్లాయ్)లుగా మార్చాలి. కానీ తొమ్మిదేళ్లు గడచినా ఆ నిబంధనలేవీ అమలు కావడం లేదు. దీంతో సదరు ఉద్యోగులు ఇంక్రిమెంట్లను కూడా కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 'ఉపాధి'లోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

– గోనుగుంట్ల శ్రీకాంత్

స్వచ్ఛత ఉంటేనే స్వస్థత!

మానవాళికి తిండీ నీరూ ఎంత అవసరమో, చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉండటమూ అంతే ముఖ్యం. ఇంటి చుట్టూ చెత్త, మురికి చేరితే అంటు వ్యాధులకు దారి తీసి, అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. వాటి నుంచి బయటపడేందుకు డబ్బు వెచ్చించాలి. రెక్కాడితే గానీ డొక్కాడని వారు పనులకు వెళ్ళలేక ఆర్థికంగా ఇబ్బందులకు లోనవుతారు. అందుకే మనం ఇంటినీ పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని, స్వచ్ఛాంధ్ర ద్వారానే స్వర్ణాంధ్ర సాకారం అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఆనంద, ఆరోగ్య, ఆర్థిక ఆంధ్ర ప్రదేశ్‌ను నిర్మించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత.

స్వచ్ఛాంధ్ర ఉద్యమం ఈనాటిది కాదు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లోనే 'పచ్చదనం–పరిశుభ్రత' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు జరిపి, పల్లెలు–పట్టణాల్లో పరిశుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన కలిగించారు. వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేసి, చిట్టడవుల్లో కూడా భారీగా మొక్కలు నాటించి, పోషించి, అటవీ విస్తీర్ణాన్ని కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో పెంచారు. ఆ అనుభవాన్ని గుర్తించి, ఆయన ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫారసుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని రూపొందించి, ఈ స్వచ్ఛతా ఉద్యమానికి నిధులు సమకూరుస్తున్నది.

ప్రస్తుతం చెత్తాచెదారం తొలగించడంతో పాటు చెత్త నుంచి సంపదను సృష్టించే బృహత్ కార్యానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది తొలినాళ్లలో మొదలుపెట్టిన 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ప్రధానంగా మున్సిపల్, పంచాయతీ రాజ్, విద్య, ఆరోగ్యం, దేవాదాయ, పర్యావరణ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి శాఖకు స్పష్టమైన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు (KPIs) నిర్ణయించి, పారదర్శక పర్యవేక్షణ వ్యవస్థను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఓ ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. నెలకో థీమ్‌తో ప్రతి మూడవ శనివారం క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించి, ప్రజలతో మమేకమై చెత్తను నిర్మూలించే కార్మికుల కష్ట సుఖాలు కూడా తెలుసుకుంటూ వారిని ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నారు. పేరుకుపోయిన చెత్తను తొలగించడం, మొక్కలు నాటించడం, పరిసరాలను శుభ్రం చేయించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించడం, ఈ–వేస్ట్ మేనేజ్‌మెంట్, కంపోస్ట్ తయారీ వంటివెన్నో వినూత్న కార్యక్రమాలు పరిశీలిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆయా కార్యక్రమాల్లో ముఖ్యమంత్రే స్వయంగా పాలుపంచుకుంటున్నారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. రాష్ట్రంలో రోజుకు సుమారు 8,900 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిని సమర్థంగా నిర్వహించేందుకు 1,500 పైగా ఎలక్ట్రిక్ వాహనాలనూ, ఆధునిక యంత్రాలనూ మున్సిపాలిటీలకు ప్రభుత్వం అందించింది. గత ప్రభుత్వ హయాంలో కొండల్లా పేరుకుపోయిన 85.9 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఇప్పటికే తొలగించారు. వచ్చే జనవరి లోపు మిగిలిన చెత్తను తొలగించి, భవిష్యత్తులో పోగుపడే అవకాశం లేకుండా, ఇంటింటా హోమ్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించనున్నారు. వైజాగ్, గుంటూరు నగరాల్లో ఇప్పటికే రెండు 'వేస్ట్ టు ఎనర్జీ' ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. వాటి నుంచి సుమారు 30 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నది. ఇంకో ఆరు 'వేస్ట్ టు ఎనర్జీ' ప్రాజెక్టులు నెల్లూరు, రాజమండ్రి, కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతిలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వ్యర్థాలను విద్యుత్తుగా మార్చే ఈ ప్రక్రియలో దేశానికి ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోంది.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. రాష్ట్రంలో రోజుకు సుమారు 8,900 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిని సమర్థంగా నిర్వహించేందుకు 1,500 పైగా ఎలక్ట్రిక్ వాహనాలనూ, ఆధునిక యంత్రాలనూ మున్సిపాలిటీలకు ప్రభుత్వం అందించింది. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఆనంద, ఆరోగ్య, ఆర్థిక ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత.




ఇప్పుడు చాలా గ్రామాలు బహిరంగ మల విసర్జనను నివారించడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణ, ద్రవ వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత పట్ల ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాయి. అలాంటి గ్రామాలను బహిరంగ మల విసర్జన లేని (ఓపెన్ డిఫికేషన్ ఫ్రీ) Plus Model గ్రామాలుగా ప్రభుత్వం గుర్తిస్తోంది. రాష్ట్రంలోని 15,995 గ్రామాల్లో ఇప్పటికే 8,814 ODF+ మోడల్ గ్రామాలుగా గుర్తింపు పొందాయి. 2026 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గ్రామాలను ODF+గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగడం హర్షణీయం. గ్రామీణ ప్రాంతాలలో మేజిక్ డ్రైన్స్ లాంటి కొత్త ప్రయోగాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి.

మరో వైపు వ్యర్థాలను నిరుపయోగంగా ఎక్కడంటే అక్కడ పడవేసి పర్యావరణాన్ని కలుషితం చేయకుండా, వాటిని సాంకేతిక పరిజ్ఞానంతో పునర్వినియోగంలోకి తీసుకువచ్చే వలయార్థిక విధానాన్ని 'సర్క్యులర్ ఎకానమీ' అంటారు. ఈ విధానం వల్ల పర్యావరణ పరిరక్షణతో బాటు పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక ఉద్యోగ కల్పన, ఆర్థికాభివృద్ధి సమకూరుతుంది. ఈ దిశగా దేశంలోనే మొట్టమొదట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీ 2025–30" ప్రకటించింది. ఈ విధానం ప్లాస్టిక్, ఈ–వేస్ట్, టెక్స్టైల్, బ్యాటరీలు వంటి అన్ని వ్యర్థాల పునర్వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. వాడి పడవేసే అలవాటును విడిచి 'Recover–Reuse–Recycle' పద్ధతికి దారి చూపుతోంది. తద్వారా కాలుష్య నియంత్రణ కూడా సాధ్యమవుతోంది. సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటుతో బాటు, పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టే వారికి 75 శాతం వరకు పెట్టుబడి రాయితీతో పాటు భూకేటాయింపు, విద్యుత్ రాయితీ వంటి వివిధ ప్రోత్సాహకాలు ఇచ్చి, రీసైక్లింగ్ పరిశ్రమలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దీంతో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉపాధి లభించనుంది.

రాష్ట్రంలో ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. కాబట్టి, బాధ్యత గల పలు శాఖలు ప్రభుత్వ రంగంలో పనిచేసే పారిశుధ్య యంత్రాంగం, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. వాటికి బదులు బయో–డీగ్రేడబుల్ ఉత్పత్తుల ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలి. వీటికి కూడా ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించింది.

ఈ స్వచ్ఛతా కార్యక్రమాలు ఇంకా ఉధృతంగా చేయాలనే సంకల్పంతో, బాగా పనిచేసి సానుకూల మార్పునకు నడుం బిగించిన వ్యక్తులకు, శాఖలకు, స్వచ్ఛంద సంస్థలకు గౌరవం ఇచ్చి, ఇంకా ఎక్కువ మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేసే లక్ష్యంతో 'స్వచ్ఛాంధ్ర అవార్డ్స్–2025'కి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటికి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. రాష్ట్రంలోని 21 విభాగాల్లో దాదాపుగా 1,20,000 సంస్థలు పోటీలో పాల్గొన్నాయి. అధికారులు పారదర్శకంగా వ్యవహరించి, మూడు దశల్లో పరిశీలన చేసి రాష్ట్ర స్థాయిలో 69 అవార్డులనూ, జిల్లా స్థాయిలో 1,257 అవార్డులనూ ప్రకటించారు. స్వచ్ఛత మన అందరి బాధ్యత అని తెలియపరిచే కార్యక్రమం ఇది. రానున్న రోజుల్లో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో ప్రజలందరూ భాగస్వాములవుతారని ఆశిద్దాం.

■ డా. పి. క్రిష్ణయ్య, ఐఏఎస్ (రిటైర్డ్)
చైర్మన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3

ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
మంగళవారం 7 అక్టోబరు 2025



నగరంలో సోమవారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును కార్పొరేషన్ తరఫున స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర.. చిత్రంలో మంత్రులు నారాయణ, పార్థసారథి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి 6

నకిలీ కిక్!

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని ములకలచెరువులో వెలుగులోకి వచ్చిన నకిలీ మద్యం లింక్‌తో విజయవాడకు ఉన్న సంబంధాలు బయటపడుతున్నాయి. నకిలీ మద్యం తయారీలో కీలక సూత్రధారిగా ఉన్న జయచంద్రారెడ్డితో చేతులు కలిపిన ఇబ్రహీంపట్నానికి చెందిన జనార్దన్ పేరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగుతోంది. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన తర్వాత జనార్దన్ పేరుకు మాత్రమే డిపోల నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి, దాని ముసుగులో నకిలీ మద్యాన్ని విక్రయించినట్టు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ నకిలీ మద్యం విక్రయాలు ఏఎన్ఆర్ బార్‌లో భారీగా సాగినట్టు సమాచారం.

విజయవాడను తాకిన నకిలీ మద్యం లింక్

నాయకత్వం వహించిన ఏఎన్ఆర్ బార్ యజమాని జనార్దన్

- ప్రధాన నిందితుడు జయచంద్రారెడ్డికి బాల్యమిత్రుడు
- ఇబ్రహీంపట్నంలో రూ.25లక్షల నకిలీ మద్యం సీజ్
- పరారీలో జనార్ధన్
- ఎక్సైజ్ పోలీసుల అదుపులో జనార్దన్ సోదరుడు జగన్మోహనరావు
- భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు
- జనార్ధన్‌కు పలు మద్యం షాపుల్లో భాగస్వామ్యం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బార్‌లకు సంబంధించి కొత్త విధానాన్ని ప్రకటించింది. ఇందులో మొదటిసారి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేయకుండా జనార్దన్ దూరంగా ఉన్నాడు. రెండోసారి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో మాత్రం దరఖాస్తు చేసి అదే ఏఎన్ఆర్ బార్‌ను హస్తగతం చేసుకున్నాడు. ఇబ్రహీంపట్నంలో పదేళ్లుగా జనార్దన్ బార్‌ను నిర్వహిస్తున్నాడు. తెలుగుదేశం పార్టీ నాయకుడిగా చలామణి అవుతున్నాడు.



దక్షిణాఫ్రికా నుంచి రాగానే పేలిన బాంబు

జయచంద్రారెడ్డి తయారు చేస్తున్న నకిలీ మద్యంతో జనార్దన్‌కు సంబంధాలు ఉన్నాయి. విద్యార్థి దశలో ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఆ స్నేహం నకిలీ మద్యం తయారీ వరకు సాగింది. జయచంద్రారెడ్డి ఏర్పాటు చేసిన డిస్టిలరీలో జనార్దన్‌కు భాగస్వామ్యం ఉంది. అంతేగాకుండా వారు దక్షిణాఫ్రికాలోనూ డిస్టిలరీలను ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల క్రితం ఈ బ్యాచ్ మొత్తం దక్షిణాఫ్రికా వెళ్లింది. మూడు రోజుల క్రితం అక్కడి నుంచి నకిలీ గ్యాంగ్ హైదరాబాద్ చేరుకుంది. ఇంతలోనే నకిలీ మద్యం మూలాలు బయటకు వచ్చాయి. ప్రస్తుతం జనార్దన్ హైదరాబాద్‌లోనే ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇబ్రహీంపట్నంలో ఏఎన్ఆర్ బార్‌ను చేజిక్కించుకున్న జనార్దన్ తెలంగాణలోని పలు మద్యం దుకాణాల్లో స్లీపింగ్ పార్టనర్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతోపాటు ఇటీవల జిల్లాలో కేటాయించిన మద్యం దుకాణాల్లో మిగతా 4లో..

నకిలీ అమ్మకాలు ఎక్కడ?

ములకలచెరువులో తయారైన నకిలీ మద్యాన్ని జనార్దన్ చాలా రహస్యంగా ఇబ్రహీంపట్నం చేర్చుతున్నాడు. ఈ సరుకును తీసుకురావడానికి ప్రత్యేకంగా కొంతమందిని ఏర్పాటు చేసుకున్నాడు. బార్‌కు ఎదురుగా ఉన్న సందులోని ఒక గోదాములో నకిలీ సరుకును భద్రంగా ఉంచాడు. కొత్త విధానం ప్రకారం కేటాయించిన ఏఎన్ఆర్ బార్‌లోకి ములకలచెరువు నుంచి వచ్చిన నకిలీ సరుకుని ఉంచినట్టు తెలుస్తోంది. ఈ సరుకుని నిత్యం విక్రయించినట్టు విశ్వసనీయవర్గాల చెబుతున్నాయి. అంతేగాకుండా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే బెల్టు దుకాణాలకు ములకలచెరువు సరుకును పంపినట్టు తెలుస్తోంది. నకిలీ బాగోతం బయట పడిన తర్వాత జనార్దన్ హైదరాబాద్‌లోనే ఉండిపోయాడు. ఆయన సోదరుడు జగన్మోహనరావును మాత్రం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏఎన్ఆర్ షట్టర్ దించేసిన భవానీపురం ఎక్సైజ్ పోలీసులు జనార్దన్‌పై కేసు నమోదు చేశారు. ఇబ్రహీంపట్నంలో పట్టుకున్న నకిలీ సరుకు విలువ రూ.25లక్షల వరకు ఉంటుందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. జనార్ధన్ తాను సరుకును ఇక్కడికి తీసుకురావడమే కాకుండా మరికొంతమంది వ్యాపారులను తీసుకెళ్లి జయచంద్రారెడ్డికి పరిచయం చేసినట్టు మద్యం వ్యాపార వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ వ్యాపారులు నకిలీ మద్యాన్ని కొనుగోలు చేశారా లేదా అన్నది ఎక్సైజ్ అధికారులు దర్యాప్తులో తేలుతుంది. జిల్లాలోను, అటు తెలంగాణలో పలు మద్యం షాపుల్లో జనార్దన్ భాగస్వామిగా ఉండడంతో అక్కడికి కచ్చితంగా నకిలీ మద్యం చేరిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టమోత!

కర్నూలులో కిలో రూ.2 కూడా పలకని టమాటా ధర

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రైతు బజార్లలో మాత్రం రూ.22

మార్కెటింగ్‌శాఖ అధికారుల తీరుపై విమర్శలు



రైతు బజారులో కిలో రూ.22కు విక్రయిస్తున్న టమాటాలు

విజయవాడ, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): కిలో టమాటా రూ.2లకు కూడా అమ్మలేక కర్నూలు జిల్లాలో రైతులు బాధలు పడుతుంటే ఉమ్మడి కృష్ణాజిల్లా రైతు బజార్లలో మాత్రం రూ.20 నుంచి రూ.22లకు అమ్ముతున్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖ అధికారులను ప్రశ్నిస్తే కర్నూలు మార్కెట్లో 15 రూపాయలు ఉందని, అక్కడి నుంచి ఇక్కడికి తీసుకురావడానికి మూడు రూపాయలు ఖర్చు అవుతుందని, కేజీకి మొత్తంగా 18 రూపాయలు ఖర్చు కాగా, రెండు నుంచి నాలుగు రూపాయల లాభానికి రైతు బజార్లో బోర్డ్ రేట్ ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు. అసలు రైతు బజార్ల మిగతా 4లో..

ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిప్పర్, లారీ ఓనర్స్ అసోసియేషన్, కూటమి నేతలు, బాధిత గ్రామాల ప్రజలు



ఎన్టీటీపీఎస్ ముట్టడి ఉద్రిక్తం

టిప్పర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన

- ఉచిత బూడిద ఉద్యమానికి కాలుష్య బాధిత గ్రామాల ప్రజలు మద్దతు
- ఆందోళనకారులకు అండగా కూటమి నేతలు
- ఎన్టీటీపీఎస్ సీఈకి మూడ్రోజులు గడువు
- 10న అన్ని సమస్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ సోమవారం తలపెట్టిన ఎన్టీటీపీఎస్ ప్రధాన గేటు ముట్టడి ఉద్రిక్తంగా మారింది. గత 40 రోజులుగా జరుగుతున్న ఉచిత బూడిద లోడింగ్ ఉద్యమానికి డాక్టర్ ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడుతున్న బూడిద కాలుష్య బాధిత గ్రామాల ప్రజలు, కూటమి నేతలు మద్దతుగా నిలిచారు. వీరంతా పశ్చిమ ఇబ్రహీంపట్నం నుంచి ఇబ్రహీంపట్నం రింగ్ మీదుగా ఎన్టీటీపీఎస్ ప్రధాన గేటు వద్దకు చేరుకొని గేటు ముట్టడికి ప్రయత్నించగా, వారిని భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. ఎన్టీటీపీఎస్ యాజమాన్యం, చీఫ్ ఇంజనీర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. స్పందించి నిరసనకారుల వద్దకు వచ్చిన సీఈ శివరామాంజనేయులుపై ఒక్కసారిగా జనం మండిపడ్డారు. బూడిద సమస్యతో పాటు 79 ఉద్యోగాలు ఎవరెవరికి, ఎంతెంతకు అమ్ముకున్నావని నిలదీశారు. సమాధానం చెప్పకుండా నవ్వుతున్న సీఈపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి చేయిదాటిపోయేలా ఉండటంతో ఇబ్రహీంపట్నం సీఐ ఎ.చంద్రశేఖర్ కల్పించుకొని కూర్చొని మాట్లాడుకుందామని సర్దిచెప్పడంతో గేటు సమీపంలో ఉన్న నిరసన టెంట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ సీఈతో కూటమి నేతలు చెన్నుబోయిన మిగతా 4లో..

నిన్నటి వరకు పెడన మండలంలో ఇష్టారాజ్యంగా మడ చెట్ల నరికివేత చేపట్టిన అక్రమార్కులు ఇప్పుడు రూటు మార్చారు. పది వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బంటుమిల్లి మండలంపై కన్నేశారు. యథేచ్ఛగా మడ చెట్లను నరికివేసి రాత్రికి రాత్రే రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. వందలాది ఎకరాల్లో మడ చెట్లను నరికేస్తుంటే అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు సముద్రం నుంచి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు.



మడ అడవులపై కన్ను!



బంటుమిల్లి మండలంలో తవ్విన చేపల చెరువు

బంటుమిల్లి మండలంలో యథేచ్ఛగా మడ చెట్ల నరికివేత

- రాత్రికి రాత్రే రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు!
- వందల ఎకరాల్లో పాగావేసిన అక్రమార్కులు
- నిన్నటి వరకు పెడనలో.. నేడు బంటుమిల్లిలో దందా!
- మామూళ్ల మత్తులో జోగుతున్న రెవెన్యూ అధికారులు
- జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- గ్రామాలకు పొంచి ఉన్న సముద్ర ముప్పు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బంటుమిల్లి మండలంలో సుమారుగా 10 వేల ఎకరాల విస్తీర్ణంలో మడ అడవి ఉంది. ఈ అడవి అంతా కూడా సముద్రానికి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది. తుఫాన్లు వచ్చిన సమయంలో మడ అడవి ప్రాంతం అత్యంత సమీపానికి సముద్రం నీరు వస్తుంది. దీంతో చాలా వరకు మడచెట్లు సముద్రపు ఉప్పునీటిలో ఉండేవి. మడచెట్ల నరికివేత లేని రోజుల్లో మడ అడవుల సమీపంలో ఉన్న పొలాల్లో బంగారం పండేది. నేల కూడా మంచి సారవంతంగా ఉండేది. పంట దిగుబడులు అత్యధికంగా ఉండేవి. ఇటువంటి పరిస్థితుల్లో అక్రమార్కుల కన్ను మడ అడవులపై పడింది. బంటుమిల్లి, మణిమేశ్వరం, నారాయణపురం, పాండ్రాక, రామాపురం, ఇంతేరులో భారీ స్థాయిలో మడచెట్లు నరికేస్తున్నారు. వందల ఎకరాలను రాత్రికి రాత్రే రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. అక్రమార్కుల చెరలో చిక్కిన భూములకు అంతే వేగంగా పట్టాలు కూడా వచ్చేస్తున్నాయి. ఆ వెంటనే ఇతరులకు లీజులకు ఇచ్చేస్తున్నారు. జెట్ స్పీడ్‌తో మిగతా 4లో..

దెబ్బతిన్న పంట భూములు

మడచెట్ల నరికివేత ప్రారంభం కాగానే.. పంట పొలాలు కూడా కలుషితంగా మారిపోతున్నాయి. మడచెట్ల నరికివేత కారణంగా సముద్రం ఉప్పొంగినపుడు రొయ్యల చెరువులలోకి ఉప్పునీరు వస్తుంది. ఉప్పునీటిలో రొయ్యలు ఎక్కువగా బతుకుతాయన్న ఉద్దేశంతో.. సముద్రపు పాయలకు గాడి కొడుతూ ఆ నీటిని రొయ్యల చెరువులలోకి మళ్లిస్తుంటారు. ఒక్కోసారి ఆటుపోట్ల కారణంగా సముద్ర పాయల నుంచి పెద్ద ఎత్తున ఉప్పునీరు రొయ్యల చెరువులలోకి వచ్చి అవి పొంగిపొర్లి పంట చేల మీదకు ఎగదన్నుతున్నాయి. దీంతో పంట పొలాలు ఉప్పునీటి కారణంగా దెబ్బతింటున్నాయి. పంటలు సరిగా పండని పరిస్థితి ఏర్పడుతోంది. బంటుమిల్లి కేంద్రంగా జరుగుతున్న మడచెట్ల నరికివేతపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత పెల్లుబికుతోంది. ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడంలేదు. జిల్లా యంత్రాంగానికి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎనికేపాడులో భారీ అగ్నిప్రమాదం

గోడౌన్‌లోని ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ బూడిద

రూ.3 కోట్ల వరకు నష్టం ఉంటుందంటున్న నిర్వాహకులు



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఎలక్ట్రానిక్ వస్తువులు

గుణదల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎనికేపాడులోని ఎలక్ట్రానిక్ వస్తువుల గోడౌన్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రూ.3 కోట్ల వరకు నష్టం సంభవించినట్టు నిర్వాహకులు చెబు తున్నారు. పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంలో సీఅండ్ఎఫ్ఏ- శ్రీ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఎనికేపాడులో టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఓవెన్లు భారీగా నిల్వ చేసి ఉంచారు. ఇక్కడి నుంచి పలు జిల్లాల్లోని షోరూమ్‌లకు వస్తువులు హోల్‌సేల్‌గా తరలిస్తుంటారు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ గోడౌన్ నుంచి దట్టమైన పొగ వస్తుండటంతో అక్కడే ఉన్న వాచ్‌మెన్.. అగ్నిమాపక, పోలీసులకు సమాచారం అందించాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి ఏడు శకటాలను రప్పించారు. ప్రమాదం సమయంలో సిబ్బంది కానీ, కూలీలు కానీ లేకపోవడంతో ప్రాణ నష్టమేమీ జరగలేదు. గోడౌన్‌లో నిల్వ ఉన్న సామగ్రిలో 80 శాతం బుడిదయ్యాయి. ప్రమాదం సమయంలో ఏసీలు, రిఫ్రిజరేటర్లలోని గ్యాస్ సిలిండర్లు పేలడం వల్ల పెద్దపెద్ద శబ్దాలు వచ్చాయి. సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఘటనకు షార్ట్‌సర్క్యూట్ కారణమా? లేక అగంతకుల పనా? అనే విషయం దర్యాప్తులో తేలుతుందని చెప్పారు. కాగా, నష్టం రూ.3 కోట్ల వరకు ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. నిన్నటి వరకు భవానీలతో నిండిపోయిన ఆలయం వద్ద సోమవారం సాధారణ భక్తుల సందడి కనిపించింది. క్యూలైన్లలో భారీగా తరలివచ్చిన భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



నిలిచిన తాగునీటి సరఫరా
- కాల్వల్లోకి బూడిద నీరు వదిలిన ఎన్టీటీపీఎస్ అధికారులు
- నీరు కలుషితం.. ఫిల్టర్అవ్వక 2 రోజులుగా సరఫరా బంద్ 4



తొలిరోజు ఆదాయం రూ. 3.57 కోట్లు
- దసరా ఉత్సవాల్లో భక్తుల కానుకలు లెక్కింపు 4

పక్కా ప్లాన్‌తోనే వృద్ధురాలి హత్య!
- అవకాశం కోసం చూసి మత్తు పెట్టి..
- పదునైన ఆయుధాలతో ముక్కలు చేసి..
- ఆధారాలు లేకుండా పోలీసులకే సవాల్..





దుర్గగుడి మహామండపంలో కానుకలు లెక్కిస్తున్న ఉద్యోగులు

తొలిరోజు ఆదాయం రూ.3.57 కోట్లు

» దసరా ఉత్సవాల్లో భక్తుల కానుకలు లెక్కింపు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న హుండీలలో సమర్పించిన కానుకలను ఈవో వీకే శీనానాయక్, దేవస్థానం కమిటీ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) పర్యవేక్షణలో సోమవారం ఉద్యోగులు, పలు సేవాబృందాలు లెక్కించారు. అధికారులు 50 హుండీలు, 237 బ్యాగ్‌లలో కానుకలు లెక్కించగా, రూ.3,57,92,708లు ఆదాయం లభించినట్టు ఈవో తెలిపారు. 122 గ్రాముల బంగారు ఆభరణాలు, 9 కేజీల 700 గ్రాముల వెండి ఆభరణాలు భక్తులు అమ్మవారికి సమర్పించినట్టు ఆయన పేర్కొన్నారు. 52 యుఎస్ఏ డాలర్లు, 55 సింగపూర్ డాలర్లు, 130 యుఏఈ దీనార్లు, 5 కెనడా డాలర్లు, 3 సౌదీ రియాల్స్ 7 1/2 కువైట్ దీనార్లు లభించినట్టు ఈవో వివరించారు. మంగళవారం కూడా లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, దేవదాయశాఖ జిల్లా కార్యనిర్వహణాధికారులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి : ప్రతి పౌర్ణమి నాడు జరిగే గిరిప్రదక్షిణ మాసవారీ ఉత్సవం ఈనెల 7న నిర్వహిస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని టోల్ గేట్ వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్దనుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఘాట్ రోడ్డు అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుంచి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. సకలాభీష్టాలు నెరవేర్చే ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని దుర్గామల్లేశ్వరుల అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

మతదాడులు ప్రమాదకరం

» ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్

విజయవాడ లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత్ లాంటి లౌకిక దేశంలో అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై కోర్టు వాదనలు జరిగే తరుణంలో ఓ వ్యక్తి దాడికి యత్నించడాన్ని ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇది వ్యక్తిపై దాడి కాదని, న్యాయవ్యవస్థపై దాడి అని చలసాని పేర్కొన్నారు. న్యాయస్థానాలపై దాడులు జరిగే స్థాయిలో మత రాజకీయాలు వుండటం దారుణమని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినచర్యలు తీసుకోవాలని అజయ్‌కుమార్ కోరారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

సుప్రీంకోర్టు హాలులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్టు బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా తెలిపారు. సోమవారం బార్ అసోసియేషన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. న్యాయవాదుల అభిప్రాయం మేరకు మంగళవారం మౌన ప్రదర్శనగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తారని బాషా తెలిపారు. అనంతరం బందరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'సేవ్ జ్యుడీషియరీ - సేవ్ నేషన్' నినాదంతో ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తి పై దాడి

వన్‌టౌన్: చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై ఓ లాయర్ దాడియత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తిపై దాడి అని ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన తెలిపారు. ఈ దాడియత్నం సంవిధాన విలువలపై, న్యాయవ్యవస్థ గౌరవంపై దాడి అని పేర్కొన్నారు.

తాగునీటిలో బూడిద కలవకుండా చూడాలి

» ఎన్టీటీపీఎస్ సీఈకి చిట్టిబాబు వినతి

ఇబ్రహీంపట్నం : ఎన్టీటీపీఎస్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నేరుగా బూడిద నీటిని బుడమేరు వరద మళ్లింపు (వేడీసీటి) కాలువ ద్వారా కృష్ణానదిలో కలవకుండా నిలువరించాలని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ప్లాంట్ చీఫ్ ఇంజనీరు పి.శివరామాంజనేయులకు సోమవారం లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్లాంట్ నుంచి విడుదలవుతున్న నీటిని తక్షణం పరీక్షించాలని, కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన వినితపత్రంలో కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌లో 85 ఫిర్యాదులు

విజయవాడ సిటీ : పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక(పీజీఆర్ఎస్)లో 85 మంది బాధితుల నుంచి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి ఫిర్యాదులు స్వీకరించారు. ఆస్తి వివాదాలపై 36 మంది, కుటుంబ కలహాలపై 11, కొట్లాటలపై ముగ్గురు, మోసాలపై ఆరుగురు, మహిళా సంబంధిత నేరాలపై తొమ్మిది మంది, చోరీలపై ముగ్గురు, చిన్నచిన్న వివాదాలపై 17 మంది ఫిర్యాదులు ఇచ్చారు. ఫిర్యాదులను నిర్దేశిత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను డీసీపీ ఆదేశించారు.

మడ అడవులపై కన్ను!

(3వ పేజీ తరువాయి)

క్రయ విక్రయాలు జరిగిపోతున్నాయి. అనేక మంది చేతులు మారిపోతున్నాయి. ఈ పాపంలో స్థానిక రెవెన్యూ యంత్రాంగం భాగస్వామ్యం ఉందని విమర్శలు ఉన్నాయి. ఆర్డీవో కార్యాలయంలో కూడా అక్రమార్కులకు సహకారం లభిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మడచెట్ల నరికివేత పతాకస్థాయికి చేరింది.

మామూళ్ల మత్తులో రెవెన్యూశాఖ

బంటుమిల్లి మండల రెవెన్యూ యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోందని విమర్శలు వస్తున్నాయి. స్థానికంగా కొందరు వీఆర్వోలు మడచెట్ల నరికివేత పుణ్యమా అంటూ బాగా స్థిరపడ్డారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలిచిన వీఆర్వోలు కొందరు ఖరీదైన ప్లాట్లను, ఫ్లాట్లను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయానికి కూడా అవినీతి పాకింది. ప్రజలు ఫిర్యాదులు చేస్తుంటే అక్కడ మడ చెట్లు లేవు కదా అని అధికారులు వాదించే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఆర్డీవో కార్యాలయం ఉద్యోగి ఒకరు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉదంతం వెలుగుచూసింది.

పొంచి ఉన్న ప్రమాదం

వందేళ్లకు ఒకసారి సముద్రపు విపత్తులు సంభవిస్తున్న చరిత్ర బందరు ప్రాంతంలో ఉంది. వందేళ్ల కిందట సముద్రంలో సంభవించిన చమురు పేలుడు కారణంగా ఘంటసాల వరకు సముద్రం ఉప్పొంగింది. ఆ సందర్భంలో 30 వేల మందికి పైగా చనిపోయారు. ఇలాంటి విపత్తులు భవిష్యత్తులో రావని చెప్పలేం.. సునామీలు కూడా వచ్చే అవకాశం లేకపోలేదు. ఇలాంటి సందర్భాలలో నష్టాన్ని కొంత మేర నియంత్రించలిగలిగేవి మడ అడవులే. ఇప్పటికైనా మడ అడవుల సంరక్షణపై కలెక్టర్ బాలాజీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నిలిచిన తాగునీటి సరఫరా

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బూడిద చెరువులోకి మళ్లించాల్సిన బూడిద నీటిని ఎన్టీటీపీఎస్ అధికారులు వేడి నీటి కాల్వ, చన్నీళ్ల కాల్వలోకి వదిలేస్తున్నారు. దీంతో తాగునీరు బూడిదతో నిండిపోయి కలుషితమవుతుంది. ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేసే తాగునీటిలో పెద్ద ఎత్తున బూడిద కలవడంతో తాగునీరు ఏ మాత్రం ఫిల్టర్ కావడం లేదు. దీంతో రెండు రోజులుగా మైలవరం నియోజకవర్గంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గత 45 రోజులుగా బూడిద చెరువులో బూడిద రవాణా నిలిచిపోవడంతో ప్లాంట్ నుంచి బూడిద చెరువుకు పైపులైన్ ద్వారా వెళ్లాల్సిన బూడిదతో నిండిన నీటిని ఎన్టీటీపీఎస్ అధికారులు ఏం చేయాలో తెలియక రెండు కాల్వల ద్వారా మళ్లిస్తున్నారు. ఎన్టీటీపీఎస్ అధికారుల అనాలోచిత నిర్ణయాలు 104 గ్రామాల ప్రజలకు పదే పదే తాగునీటి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. చన్నీళ్ల కాల్వ నుంచి ఫిల్టర్ బెడ్‌కు నీరు తీసుకునే ఎగువ భాగంలో ఎన్టీటీపీఎస్ ప్లాంట్ నుంచి వచ్చే ప్రధాన డ్రెయినేజీ ఉంది. ఆ డ్రెయినేజీ ద్వారా ప్లాంట్‌లో ఉన్న బూడిద మొత్తం చన్నీళ్ల కాల్వలో కలవడం వల్ల సమస్య తలెత్తుతుంది. అదే డ్రెయినేజీని ఫిల్టర్ బెడ్ నుంచి తీసుకునే నీటికి దిగువ భాగంలో ఏర్పాటు చేసుకుంటే తాగునీరు కలుషితం కాకుండా ఉంటుందని అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎన్టీటీపీఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్య ఎప్పటిలోగా పరిష్కరించి తాగునీటిని సరఫరా చేస్తారోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.



చన్నీళ్ల కాలువ నుంచి ఫిల్టర్ బెడ్‌కు వస్తున్న బూడిద నీరు



ఫిల్టర్ బెడ్ వద్ద కుదపలు కుదపలుగా పడుతున్న బూడిద

ఎన్టీటీపీఎస్ ముట్టడి ఉద్రిక్తం

(3వ పేజీ తరువాయి)

చిట్టిబాబు, రావి మణిరాజ్ (ఫణి), అక్కల గాంధీ, చనమోలు నారాయణ, బొలియశెట్టి శ్రీకాంత్, కోయ వెంకట్రావ్, మైలా సైదులు తదితరులు మాట్లాడారు. గతంలో ఎలా అయితే ఉచితంగా బూడిద లోడింగ్ చేశారో అలానే స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు ఉచిత బూడిద లోడింగ్ చేయాలని, కాంట్రాక్టు సంస్థ నుంచి వచ్చే రూ.3 కోట్లు స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ మీకు చెల్లిస్తారని తెలిపారు. సీఎస్ఆర్ నిధులు రూ.30 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలని, పొల్యూషన్ కంట్రోల్ చేయాలని, మొక్కలు పెంచాలని, ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఈ మాట్లాడుతూ ఈ విషయాలన్నింటిని జెన్కో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ఈనెల 10న సమాధానం చెబుతానని చెప్పారు. అనంతరం పీడిత గ్రామాలకు చెందిన ప్రజలు, టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ వారు సీఈకి వినతిపత్రాలను అందించారు.

కవులూరు గ్రామాన్ని విస్మరిస్తున్నారు

ఎన్టీటీపీఎస్ కాలుష్య ప్రభావిత గ్రామాల జాబితాలో కవులూరు గ్రామం కూడా ఉందని స్థానికులు తెలిపారు. ఎన్టీటీపీఎస్ నుంచి కేవలం 3 కిలో మీటర్ల దూరంలో మా గ్రామం ఉంటే 12 కిలో మీటర్లు ఉన్నట్లు ఎన్టీటీపీఎస్ అధికారులు రికార్డుల్లో చూపారని ఆరోపించారు. తమ గ్రామానికి కూడా కాలుష్య పీడిత గ్రామాల జాబితాలో చేర్చాలని సీఈకి వినతి పత్రం అందించారు. కూటమి నేతలు పెద్దర్ల రవి, చుట్టుకుదురు శ్రీనివాసరావు, వల్లూరు కిషోర్ కుమార్, చెరుకూరి రామకృష్ణ, గరికపాటి శ్రీనివాసరావు, పోలిశెట్టి తేజ, తదితరులు పాల్గొన్నారు. ఉచిత బూడిద లోడింగ్ కోసం చేస్తున్న రిలే నిరసన దీక్ష సోమవారం ఆందోళన అనంతరం యథావిధిగా కొనసాగించింది.

సంతృప్తికర పరిష్కారం చూపాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై వుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. అర్జీదారులతో సంబంధిత అధికారి మర్యాదగా ప్రవర్తించాలని, ఎండార్స్‌మెంట్ తప్పకుండా ఇవ్వాలని చెప్పారు. వ్యవహారశైలి, పరిష్కార విధానం సరిగ్గా లేవన్న అభిప్రాయం అర్జీదారుల నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ రాకూడదని స్పష్టం చేశారు. రీఓపెన్ చేసిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టిసారించి, త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సంతృప్త స్థాయిని పెంచాలన్నారు. విజన్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్ క్రియాశీలతకు సమిష్టిగా కృషిచేయాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్‌తో పాటు కీలక ప్రగతి సూచికలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. అర్జీలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

20 గ్రామాల్లో మూడోదశ రీ సర్వే

» రైతులు సద్వినియోగం చేసుకోవాలి

» ఎన్టీఆర్ జిల్లా జేసీ ఇలక్కియా



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో 20 గ్రామాల్లో మూడోదశ రీ సర్వే కార్యకలాపాలు ఈనెల 3న ప్రారంభమయ్యాయని, రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా సోమవారం తెలిపారు. రైతులు షెడ్యూల్ ప్రకారం రీ సర్వేకు హాజరై తమ సొంత పొలం హద్దులు చూపి సర్వే చేయించుకోవాలన్నారు. జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రీ సర్వే ప్రక్రియను దశలవారీగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తిరువూరు డివిజన్‌లో రేపూడి గ్రామం (ఎ.కొండూరు మండలం), గోసవీడు (గంపలగూడెం), కొనిజెర్ల (గంపలగూడెం), నరకుల్లపాడు (రెడ్డి గూడెం), మునుకొళ్ల (తిరువూరు), తాటకుంట్ల గ్రామం (విసన్నపేట మండలం)లో రీసర్వే జరుగుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా నందిగామ డివిజన్‌లో మాగల్లు గ్రామం (నందిగామ మండలం), పున్నవల్లి (చందర్లపాడు), రామచంద్రునిపేట (జగ్గయ్యపేట), మాచినేనిపాలెం (వత్సవాయి), జయంతి (వీరులపాడు), కునికినపాడు (కంచికచర్ల), సైదాపురం (కంచికచర్ల), కొణకంచి గ్రామం (పెనుగంచిప్రోలు మండలం)లో రీసర్వే జరుగుతోందన్నారు. విజయవాడ డివిజన్‌లో రామవరప్పాడు గ్రామం (విజయవాడ రూరల్ మండలం), ప్రసాదంపాడు (విజయవాడ రూరల్), ఎన్.పోతవరం (ఇబ్రహీంపట్నం), కాచవరం (ఇబ్రహీంపట్నం), మొరుసుమిల్లి (మైలవరం), హెచ్.ముత్యాలంపాడు గ్రామం (జి.కొండూరు మండలం)లో రీ సర్వే ప్రారంభమైందని ఇలక్కియా వెల్లడించారు.

అన్నదాత ఆశల సౌధం వేద్రాద్రి

» ఎత్తిపోతల పథకానికి తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసిన పవర్ మిక్

» మోటారుకు ట్రయల్ రన్స్ నిర్వహణ

» విద్యుత్ నిలిపివేసి రైతులకు ట్రాన్స్ కో షాక్

» ఎమ్మెల్యే సౌమ్య చొరవతో పునరుద్ధరణ చర్యలు



ట్రయల్ రన్‌లో నీటిని తోడిపోస్తున్న మోటార్

నందిగామ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత ఆశల సౌధం వేదాద్రి ఎత్తిపోతల పథకానికి తాత్కాలిక మరమ్మతులు పూర్తయ్యాయి. వంద క్యూసెక్కుల నీటిని అందించేందుకు ఒక మోటార్‌ను సిద్ధం చేశారు. మరమ్మతులు నిర్వహించిన పవర్‌మిక్ సంస్థ ఇప్పటికే పలుమార్లు ట్రయల్ రన్స్ నిర్వహించింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ పథకం ఆరేళ్లుగా ఆయకట్టు రైతులకు సాగునీరు అందలేదు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్‌లు శాసనసభలో పలుమార్లు ఈ పథకం గురించి ప్రస్తావించారు. ఎట్టకేలకు ముఖ్యమంత్రి హామీ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ ఎంపీ లాడ్స్ ద్వారా ఒక మోటారు తాత్కాలిక మరమ్మతుకు 33 లక్షలు విడుదల చేశారు. వేదాద్రి పథకంపై ఉన్న రూ.21 కోట్ల బిల్లును రద్దు చేసి.. ఐదేళ్ల వరకూ బిల్లు లేకుండా సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో అధికారులు సరఫరా పునరుద్ధరించారు. దీంతో పవర్‌మిక్ సంస్థ పనులు చేపట్టి ఒక మోటార్‌ను సిద్ధం చేసింది. సుమారు నాలుగు వందల మీటర్ల పొడవైన పైప్‌లైన్లకు సంస్థ మరమ్మతులు పూర్తి చేసింది. ఎంపీ చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభించనున్నారు. రైతులు మంత్రికి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు ట్రాన్స్‌కో షాక్..

పథకం మరమ్మతులు పూర్తయ్యేవరకూ సరఫరా ఇచ్చిన ట్రాన్స్‌కో అధికారులు అంతా సిద్ధమైన తర్వాత సరఫరా నిలిపివేసి రైతులకు షాక్ ఇచ్చారు. దీంతో రైతులు, రైతు సంఘాల నేతలు అధికారులను కలవగా, మరమ్మతులు పూర్తయ్యేవరకే సరఫరా ఇవ్వాలన్న ఆదేశాలున్నాయని, ఉన్నతాధికారులు ఆదేశిస్తే తప్ప సరఫరా ఇవ్వలేమని తేల్చిచెప్పారు.

ఎమ్మెల్యే సౌమ్య చొరవతో..

పథకానికి విద్యుత్ సరఫరా నిలిపివేతపై మంత్రిని సంప్రదించేందుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రయత్నం చేయగా.. ఆయన విదేశీ పర్యటనలో ఉన్నట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే విద్యుత్ సంస్థ సీఎండీతో ఫోన్లో మాట్లాడారు. మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరగా స్పందించిన సీఎండీ ఈ విషయం తన దృష్టిలో లేదని.. దీనిపై స్థానిక అధికారులతో సంప్రదించి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పినట్టు సౌమ్య సాగునీటి సంఘాల ప్రతినిధులకు తెలిపారు. రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వరి పంట రక్షణకు సామూహిక ఎలుకల నివారణ

» రేపు జిల్లావ్యాప్తంగా ప్రారంభం

» పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరి రైతులు తరచుగా ఎదుర్కొంటున్న ఎలుకల సమస్యను నివారించి, పంటను కాపాడటానికి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లావ్యాప్తంగా వరి సాగు చేసే ప్రాంతాల్లో బుధవారం ఈ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలుకల వల్ల తీవ్ర పంట నష్టం సంభవిస్తోందని, దీనిని నివారించడానికి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. రైతు సేవాకేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల నుంచి బ్రోమోడయోలోన్ ఎలుకల మందును కలిపిన ఎరను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఎలుకలు వున్న బొరియలు గుర్తించి వాటిని మట్టితో కప్పి వుంచాలని, మరుసటి రోజు తెరుచుకొని వున్న బొరియలలో బ్రోమోడయోలోన్ ఎలుకల మందు కలిపిన ఎరను వుంచి మూసివేయాలని తెలిపారు. రైతులంతా సామూహికంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని, తద్వారా వరి పంటను ఎలుకల బారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డిప్యూటీ కలెక్టర్ కె.పోశిబాబు, వ్యవసాయ శాఖ ఏడీ అనిత భాను పాల్గొన్నారు.

నకిలీ కిక్!

(3వ పేజీ తరువాయి)

భాగస్వామిగా ఉన్నాడని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. జనార్ధన్ ముందుగా కొండపల్లిలో కేటాయించిన గీత కార్మికుల బార్‌పై కన్నేశాడు. బినామీ పేరుతో దాన్ని దక్కించుకోవాలని భావించాడు. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో మద్యం వ్యాపారం నుంచి తప్పుకుంటున్నట్టు స్థానికంగా చెప్పుకున్నాడు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న విధానంలో ఏమాత్రం లాభం ఉండదని, అందుకే బార్‌ను వదిలేస్తున్నట్టు కొంతమందితో చెప్పాడు. తర్వాత రెండో దఫా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అదే ఏఎన్ఆర్ బార్‌ను కైవసం చేసుకున్నాడు. భవానీపురంలోని సితార సెంటర్‌లో ఉన్న శ్రీనివాస వైన్స్‌లో భాగస్వామిగా ఉన్నాడు. దీనికి సంబంధించిన లైసెన్స్ మాత్రం వేరొకరి పేరు మీద ఉంది. ఏఎన్ఆర్ బార్ మాత్రం జనార్ధన్ పేరు మీద ఉంది.

భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో ఉన్నతాధికారుల సమావేశం

ఈ కేసులో ఏ1గా అద్దెపల్లి జనార్ధన్ ఉండటంతో భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. నకిలీ మద్యం తయారీపై చర్చించి, అతను ఏయే ప్రాంతాల్లో వ్యాపారం నిర్వహిస్తున్నాడనే అంశాలపై ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వివేక్, ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏఈఎస్ రామశివ తదితరులు ఆరా తీశారు. ఈ సమావేశంలో భవానీపురం ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఐఆర్ఎస్ అధికారిణి

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సోమవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారిణి సునీతా బిల్లా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.

వాంబేకాలనీ-మధురానగర్ ఎల్‌హెచ్ఎస్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

వన్‌టౌన్ : మధురానగర్-వాంబేకాలనీ మధ్య లిమిటెడ్ హైట్ సబ్‌వే (ఎల్‌హెచ్ఎస్) నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మధురానగర్-వాంబేకాలనీ ప్రాంత ప్రజలు ఎప్పటినుంచో ఎదుర్కొంటున్న సమస్యను ఎంపీ కేశినేని శివనాథ్ ఇటీవల కేంద్ర రైల్వేశాఖా మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. ఈ లేఖపై స్పందించిన రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్.. మధురానగర్-వాంబేకాలనీ మధ్య ఎల్‌హెచ్ఎస్ నిర్మాణానికి ఆమోదం తెలిపి, డిజైన్, డ్రాయింగ్ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై వాంబేకాలనీ, మధురానగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పక్కా ప్లాన్‌తోనే వృద్ధురాలి హత్య!

» అవకాశం కోసం చూసి మత్తు పెట్టి..

» పదునైన ఆయుధాలతో ముక్కలు చేసి..

» ఆధారాలు లేకుండా పోలీసులకే సవాల్..



విజయలక్ష్మి (ఫైల్)

విద్యాధరపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : భవానీపురంలో కలకలం రేపిన వృద్ధురాలి హత్యను నిందితుడు పక్కా ప్రణాళికతో చేసినట్టు తెలుస్తోంది. హత్య ప్రదేశంలో పోలీసులకు ఎటువంటి ఆధారాలు లేకుండా నిందితుడు జాగ్రత్తపడటమే దీనికి నిదర్శనం. తన భార్య దూరం కావడానికి పిన్ని విజయలక్ష్మి కారణమని కోపంతో రగిలిపోయిన వంకధార హనుమాన్ సుబ్రహ్మణ్యం హత్యకు పథకం రచించాడు. బంధువుల వద్ద తనపై చెడ్డగా ప్రచారం చేస్తుందని సుబ్రహ్మణ్యం కోపంతో రగిలిపోయినట్టు సమాచారం. ఆమెను పథకం ప్రకారం ఇంటికి పిలిపించి రుమాలులో మత్తుమందు చల్లి ముక్కుదగ్గర పెట్టడంతో స్పృహ తప్పి పడిపోయిన తర్వాత విచక్షణా రహితంగా హత్య చేసి, శరీర భాగాలను వేరుచేసి రెండు గోనె సంచుల్లో పెట్టి అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా డ్రైనేజీ కాలువలో పడేశాడు. అనంతరం ఆనవాళ్లు కనపడకుండా ఇంటిలో రక్తం మరకలు శుభ్రం చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి నిందితుడు పక్కా ప్రణాళికతో విజయలక్ష్మిని హత్య చేసినట్టు గుర్తించారు. బొమ్మసానినగర్‌లో డ్రైనేజీలో పోలీసులకు లభించిన విజయలక్ష్మి మొండెం, నిందితుడు ఇంటిలో కనీసం రక్తం మరకలు లేకపోవటంతో పోలీసులకు సవాల్‌గా మారింది. మృతురాలి, తల చేతులు, మొండెం, కాళ్లు లభించాయి.

మృతదేహం కుటుంబసభ్యులకు అప్పగింత...

విజయలక్ష్మి మృతదేహానికి భవానీపురం పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని ఆమె కుటుంబసభ్యులు, బంధువులకు అప్పగించారు. భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి ఒంటిపై ఎటువంటి కత్తిపోట్లు లేవని, కేవలం పదునైన ఆయుధాలతో శరీరాన్ని కోసి వేరుచేసినట్టు తెలిసింది.

ఆధునిక యంత్రాలతో ఆదాయం

» శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్



ఎలక్ట్రిక్ చక్రంపై తయారు చేసిన కుండను బహూకరిస్తున్న కుమ్మరి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యంత్రాలను వినియోగించి చేతివృత్తుల వారు ఆదాయాన్ని పెంచుకోవాలని శాలివాహన సంఘం కార్పొరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ పేర్కొన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర సంచాలకులు ఎస్.గ్రిప్ ఆధ్వర్యంలో గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద మైలవరం మండలం గణపవరం గ్రామంలో ఎలక్ట్రిక్ కుండల తయారీచక్రాల వినియోగంపై సోమవారం శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 15 వరకు తరగతులు కొనసాగనున్నాయి. తొలిరోజు మొత్తం 60మంది వరకు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ, వృత్తి నైపుణ్యం పెంచుకునేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. కేవీఐసీ విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్-2 ఆర్.ఎల్.ఎస్.మూర్తి మాట్లాడుతూ, సంప్రదాయ గ్రామీణ చేతి వృత్తుల వారిని గుర్తించి వారి ఆదాయాన్ని పెంచే క్రమంలో శిక్షణనిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వారికి మెరుగైన తయారీ పరికరాలు అందిస్తామన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.శివరామకృష్ణ మాట్లాడుతూ, పదిరోజుల శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకొని తయారీ వస్తువుల ద్వారా గణపవరానికి మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. మాస్టర్ ట్రైనర్ ఎల్లప్ప శాలివాహనులకు అనేక విషయాలపై శిక్షణనిచ్చారు.

నేడు నగరంలో ఫ్యాప్టో రాష్ట్రస్థాయి ధర్నా

అమరావతి/విజయవాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పలు సమస్యలపై దశలవారీగా ఉద్యమానికి పిలుపునిచ్చిన ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) పోరుబాట పేరుతో మంగళవారం విజయవాడలో ధర్నా చేపట్టనుంది. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, పీఆర్సీని నియమించాలనే ప్రధాన డిమాండ్లతో ధర్నాకు ఫ్యాప్టో పిలుపునిచ్చింది. అలాగే, సీపీఎస్ రద్దు చేయాలని, పదవీ విరమణ ప్రయోజనాల్లో జాప్యం నివారించాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేస్తోంది. ఈ సమస్యలపై పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా స్పందన లేకపోవడంతో ధర్నాకు దిగుతున్నామని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్.చిరంజీవి తెలిపారు. ధర్నాచౌక్‌లో రాష్ట్రస్థాయి ధర్నా చేపట్టనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ అలవాల సుందరయ్య, కార్యదర్శి డాక్టర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టమోత!

(3వ పేజీ తరువాయి)

లక్ష్యాన్ని విస్మరిస్తున్నారు. కడప మార్కెటింగ్ శాఖ డీడీ కొనుగోలు చేసిన టమాటాలను పెద్ద మొత్తంలో చుట్టుపక్కల జిల్లాల రైతు బజార్లకు పంపిణీ చేస్తున్నారు. రోజుకు ఎన్టీఆర్ జిల్లాకు 25 టన్నులు, కృష్ణా జిల్లాకు 10 టన్నులు, ఏలూరు జిల్లాకు 10 టన్నులు, గుంటూరు జిల్లాకు 10 టన్నులు, నెల్లూరు జిల్లాకు 12 టన్నులు. మొత్తం 65 టన్నుల వరకు కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల వినియోగదారుడికి కేజీకి రూ.15 పైనే అధిక భారం పడుతోంది. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతు బజార్ల నిర్వచనాన్నే మార్చేశారు. దళారులతో కలిసి పార్టీ నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది. మార్కెటింగ్ శాఖ పని ఏమిటి? ఏ కూరగాయ ధర పెరిగినా సరైన సమీక్ష చేసి, తగు నిర్ణయాలు తీసుకోవాలి. అటు రైతులకు, ఇటు వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. కానీ అలాంటిదేమీ క్షేత్రస్థాయిలో జరగడం లేదు. అంతా అవినీతిమయమైంది. రెండు జిల్లాల యంత్రాంగాలు ఏం చేస్తున్నాయో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు? వాళ్ల కనుసన్నల్లోనే ఈ దోపిడీ జరుగుతోందా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా రాష్ట్ర స్థాయి అధికారులు, విజిలెన్స్ విభాగం ఈ వ్యవహారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

60శాతం ఆస్తిపన్ను, సభ్యత్వ రుసుం వసూలైతే ఐలాకు ఎన్నికలు

కమిషనర్ కె. బాబ్జీ

ఆటోనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లో 60శాతం ఆస్తిపన్ను, 60 శాతం సభ్యత్వ రుసుం వసూలైతే ఐలా సర్వీస్ సొసైటీ పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఐలా కమిషనర్ కె. బాబ్జీ చెప్పారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇప్పటికి జవహర్ ఆటోనగర్ 54శాతం ఆస్తిపన్ను, 20 శాతం వరకు సభ్యత్వ రుసుం వసూలయిందని,పన్ను వసూలుకు సంబంధించిన సమాచారం ఇప్పటికే ఆటోనగర్‌లోని సంఘాలకు అందజేశామని చెప్పారు. ఈ విషయం ఎంపీ దృష్టికి కూడా తీసుకువెళ్లామని తెలిపారు.

ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 19 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీరు ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణపై నగరపాలక సంస్థ పరిధిలోని జోనల్ కార్యాలయాలు, సచివాలయాల్లో ఆకస్మికంగా తనఖీ నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ కమిటీ జోనల్ కార్యాలయాలు, సచివాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అధికారులు స్వీకరిస్తున్న దరఖాస్తులు, చూపుతున్న పరిష్కారం, ప్రజలతో వాళ్ల వ్యవహరిస్తున్న పనితీరు వంటి అంశాలను పరిశీలించాలని తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో కమిషనర్ ధ్యానచంద్ర ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో, సచివాయాలలో వీసీ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించాలని, అధికారులు ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి సమస్యను పూర్తిస్థాయిలో తెలుసుకొని మళ్లీ పునరావతం కాకుండా పరిష్కరించాలని ఆదేశించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడండి

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. సోమవారం కెనాల్ రోడ్డు, వినాయకుని గుడి, శనీశ్వరాలయం, కృష్ణవేణి ఘాట్, సీతమ్మ పాదాలు, పున్నమిఘాట్, హెచ్‌బీ కాలనీ ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. దసరా ఉత్సవాలు అయిపోయినప్పటికీ భక్తులు ఎక్కువ వస్తున్నందున వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సౌకర్యంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో ఉన్న హెచ్‌బీ కాలనీ అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు అన్న క్యాంటీన్‌ను పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులని ఆదేశించారు.


లబ్ధిదారులతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆరోగ్యానికి కూటమి పెద్దపీట

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)నుంచి మంజూరైన రూ.11లక్షల 25వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్వయంగా లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. అందువల్ల రాష్ట్రంలోని ప్రతిఒక్క పౌరుడు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వపరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన మొదటి రోజు నుంచి సీఎంఆర్ఎఫ్‌ను అమలుచేస్తున్నారని తెలిపారు. ప్రజలు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని గద్దె తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న క్లస్టర్ ఎండీ అన్నే శివనాగేశ్వరరావు

ఆటోనగర్‌లో తాగినీటి కష్టాలు తీర్చండి

ఆటోక్లస్టర్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం

ఆటోనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లో నీటి కష్టాలు తీర్చాలని కోరుతూ ఆటోక్లస్టర్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆటో క్లస్టర్ సర్వసభ్య సమావేశం సోమవారం న్యూ ఆటోనగర్‌లో ఆటోక్లస్టర్ ఎండీ అన్నే శివనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరుతూ ఏపీఐఐసీ ఎండీ, వీఎంసీకి వినతిపత్రాలు ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. ఈసందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ తాగునీటి విషయంలో గతంలో వీఎంసీతో ఐలా అవగాహన ఒప్పందం చేసుకుందని, దానిని వారు అమలుచేయడం లేదని ఆరోపించారు. ఈవిషయం ఇప్పటికే ఎంపీ, తూర్పు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. సమావేశంలో ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, బి. బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ ప్రవేశపెట్టాలి


డీఈవో కార్యాలయ అధికారిణికి వినతిపత్రం ఇస్తున్న వేదిక ప్రతినిధి

విజయవాడ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఇగ్లీష్ మీడియం బోధన సంపూర్ణంగా కొనసాగించాలని, సీబీఎస్ఈ విద్యా విధానం ప్రవేశపెట్టాలని ఇంగ్లీష్ మీడియం విద్యా పరిరక్షణ వేదిక ప్రతినిధులు డి.ఏడుకొండలు, ఇ.గోపీచంద్, కె.మహ్మద్‌నూర్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఈవో కార్యాలయ అధికారికి వారు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులు ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం లేక ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోలేకపోతున్నారని తెలిపారు. ఇంగ్లీష్ మీడియం విద్యను పూర్తిగా అభ్యసించడానికి పేద విద్యార్థులకు ప్రభుత్వం సహకరించాలని కోరారు.


ఆటోనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సుబానీ ప్యానల్ సభ్యులు

టైర్ రీబటన్ అసోసియేషన్ ఎన్నికలు నేడు

ఆటోనగర్‌లో భారీగా మోటార్‌సైకిల్ ర్యాలీలు

ఆటోనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): టైర్ రీబటన్ వల్కనైజింగ్ అసోసియేషన్ ఎన్నికలు మంగళ వారం జవహర్ ఆటోనగర్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా సోమవారం అధ్యక్ష బరిలో ఉన్న సుబానీ, బాబు ప్యానల్ సభ్యులు తమ తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ జవహర్ ఆటోనగర్‌లో మోటారు సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. వారిరువురు ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్‌ను కలిసి తమకు మద్దతునివ్వాలని కోరారు. ఈ ఎన్నికల్లో మొత్తం 1800 మంది సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ సభ్యులతో మాట్లాడుతూ వృత్తిపరంగా తమ సమస్యలను పరిష్కరించే వారికే ఓటు వేయాలని సూచించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన వారి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తారు.

పెన్షనర్లకు కంటి పరీక్షలు

గాంధీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగింది. లైఫ్ సర్టిఫికెట్లు, ఈ ఆర్థిక సంవత్సరం ఇన్‌కంటాక్స్ వివరాలు, 2026 పెన్షనర్స్ డైరీ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అనంతరం అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పెన్షనర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కె.దాలినాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది.


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్

కోఆపరేటివ్ స్టోర్స్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

● ఐదు డైరెక్టర్ పోస్టులు ఏకగ్రీవం

ఆటోనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ది జవహర్ ఆటోనగర్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కన్స్యూమర్ కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్‌కు ఐదుగురు డైరెక్టర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బత్తుల ప్రసాద్, గడదాసు కోటేశ్వరరావు, చింతల సుబ్రహ్మణేశ్వరరావు, జలపారి సురేష్‌కుమార్, మేరుగ వెంకట రాజారావులు డైరెక్టర్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి వేమూరి సామ్రాట్ కుమార్ నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లతో సోమవారం ప్రమాణస్వీకారం చేయించారు. స్టోర్స్ చైర్మన్‌గా మహమ్మద్ రిజ్వాన్, సెక్రటరీగా మంగం నాగేశ్వరరావు, వైస్‌చైర్మన్‌లుగా అబ్దుల్ కలాం, కొండేపాటి మోహనరావు, జాయింట్ సెక్రటరీలుగా త్రిపురనేని హనుమాల్ నాగచంద్, వాటపల్లి శ్రీరాములు ప్రమాణ స్వీకారం చేశారు. ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. సమావేశంలో ఐలా మాజీ సెక్రటరీ అన్నే శివనాగేశ్వరరావు, జామాక్ స్టోర్స్ మాజీ చైర్మన్‌లు కత్తిక శివనాగేశ్వరరావు, సుంకాని వెంకట త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

● సీఐటీయూ వినతి

గవర్నర్‌పేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్టు కార్మికులకు బకాయి పడిన 9 నెలల జీతాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు కె. దుర్గారావు కలెక్టర్ లక్ష్మీశకు విజ్ఞప్తి చేశారు. జీతాలు ఇవ్వకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. స్మృతివనం కాంట్రాక్టు కార్మికులు, సీఐటీయూ నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ లక్ష్మీశ, నగర కమిషనర్ ధ్యానచంద్రలను వేరువేరుగా కలిసి ఫిర్యాదులు చేశారు. నాలుగు రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ సెంట్రల్ సిటీ నాయకులు ఎం. బాబూరావు, ఎం. సోమేశ్వరరావు, ఎం. హనుమంతరావు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

రోడ్డంతా గతుకులమయం వాహనదారుల అవస్థలు



మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి: స్థానిక జమ్మిచెట్టు సెంటర్ నుంచి పీబీ సిద్ధార్థ కళాశాల జంక్షన్ వరకు ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గం రోడ్డు అంతా గతుకులతో.. గుంతలతో నిండి ఉంటుంది. దీంతో కార్లు, ద్విచక్రవాహనదారులు వెళుతున్నపుడు బండితో పాటు శరీరం అదురుంది. ఒక్కోసారి ద్విచక్రవాహనదారులు కింద పడి గాయపడుతున్నారు. ఎపుడైనా ఈ సమస్య కాస్త ఫోకస్ కాగానే అంగుళం మందంతో ప్యాచ్ వర్కులు చేసి వెళతారు. సరిగ్గా నాలుగు రోజులకు మళ్లీ మామూలే. ప్యాచ్ వర్కులు కాకుండా రోడ్డు వేయాలని స్థానికులు, వాహనదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

← బోయపాటి మాధవరావు రోడ్డు ఎదురుగా

పొంగుతున్న యూజీడీ

దుర్వాసనతో స్థానికుల వెతలు


గోపిశెట్టి కోటేష్ వీధిలో సైడు కాల్వలో నిలిచిన మురుగు

గుణదల, ఆంధ్రజ్యోతి: అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పొంగి పొర్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండో డివిజన్లోని పడవలరేవు గోపిశెట్టి కోటేష్ వీధిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ గడచిన వారం రోజులుగా పొంగి పొర్లుతుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. డ్రెయినేజీ పొర్లి పక్కనే ఉన్న సైడు కాల్వలోకి చేరి కాల్వలో ప్రవాహం నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. దీని వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలకసంస్థ పారిశుధ్య విభాగం అధికారులు దీనిపై దృష్టి పెట్టి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గోపిశెట్టి కోటేష్ వీధిలో పొంగి పొర్లుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ

సుప్రీంకోర్టు సీజేఐ గవాయ్‌పై దాడి అమానుషం

● సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



గవర్నర్‌పేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై మతోన్మాదుల దాడి అమానుషమని సీపీఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ అన్నారు. గవాయ్‌పై దాడికి నిరసనగా సోమవారం రాత్రి ఎంజీ రోడ్డులోని రాఘవయ్య పార్కు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదుల ఆగడాలు పెరిగిపోతున్నాయని, సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి తెగబడే స్థాయికి మతోన్మాదం చేరిందని అన్నారు. ఇలాంటి దాడులను అందరూ ముక్త కంఠంతో ఖండించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మతోన్మాదుల ఉన్మాద చర్యలు పెరిగిపోతున్నాయని, అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు డి. సుబ్బారావు, కె. ధనలక్ష్మీ, నిర్మల, వి. కృష్ణయ్య, వై. నరసింహారావు, ఎం. హరిబాబు, బోయి సత్యబాబు, ఆంధ్రు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

బస్టేషన్‌లో గుండెపోటుతో యువకుడు మృతి

బస్టేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో విద్యాధరపురం కబేళా ప్రాంతం రామరాజ్యనగర్‌కు చెందిన చిరువోలు నాగరాజు (32) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. రామరాజ్యనగర్ పెట్రోల్ బంక్ వెనుక కుటుంబంతో ఉంటున్న నాగరాజు ఆదివారం మరో ముగ్గురు కలిసి గుంటూరు వెళ్లటానికి విజయవాడ బస్టేషన్‌కు వచ్చి 57వ ప్లాట్‌ఫారం వద్ద కుర్చీలో కూర్చొన్నారు. కొద్దిసేపటికి గుంటూరు వెళ్లే బస్సు రాగానే నాగరాజు కుర్చీలో నుంచి లేవటానికి ప్రయత్నించగా గుండెపోటు రావటంతో అక్కడికక్కడే కుర్చీలో కూలబడ్డాడు. అక్కడ ఉన్న ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు తెలియపరచటంతో వారు 108 సిబ్బందికి సమాచారం తెలియపరిచారు. వారు పరీక్షించగా అప్పటికే నాగరాజు చనిపోయినట్లు నిర్ధారించారు.

పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించారు. నాగరాజుకు భార్య, సంతానం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



సీఎం చంద్రబాబు నుంచి అవార్డును స్వీకరిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, కృష్ణలంక వీఎంఆర్ఆర్ (జీ) వీఎంసీ హైస్కూల్ హెడ్ మాస్టర్ వృణ్మయి, డీఈవో యూవీ సుబ్బారావు, హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎస్ రాజా, డీఎంహెచ్‌వో సుహాసిని, అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఏడీ డాక్టర్ వై శేఖర్, డాక్టర్ రత్న ప్రియదర్శిని, దావాజీగూడెం బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పీ లక్ష్మి, జిల్లా అధికారి జీ రమేశ్, కేదారేశ్వరపేట-3 అంగన్వాడీ ఎన్‌కే ఆసియా బేగం, పీఎన్‌బీఎస్ డీపీటీవో ఎంవై దానం, రైజ్ డైరెక్టర్ యశస్విని పెద్ది, కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జీ సుబ్బారావు, ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్

స్వచ్ఛతకు పురస్కారాల పట్టం

- భారీ పరిశ్రమల కేటగిరీలో విజయా డెయిరీ ప్రాజెక్టు కామధేను ప్లాంట్ (వీరవల్లి)
- అవార్డు స్వీకరించిన చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి శ్రీధర్‌బాబు
- స్వచ్ఛ సర్వేక్షణ్ (కార్పొరేషన్) అవార్డును స్వీకరించిన కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర
- స్వచ్ఛ బస్‌స్టేషన్ అవార్డును స్వీకరించిన ఆర్టీసీ ఈడీ విజయరత్నం, ఆర్ఎం ఎంవై దానం
- స్వచ్ఛ అంగన్వాడీ, యూపీహెచ్‌సీ తదితర మొత్తం 8 అవార్డులు అందుకున్న ఎన్టీఆర్ జిల్లా

ఆంధ్రజ్యోతి, కలెక్టరేట్/కార్పొరేషన్: 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' లక్ష్యసాధనలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థలు, వ్యక్తులు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులు మీదుగా సోమవారం అవార్డులను స్వీకరించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో మెగా/భారీ పరిశ్రమల కేటగిరిలో 'బెస్ట్ స్వచ్ఛ ఇండస్ట్రీ'గా మొదటి ర్యాంకు సాధించిన కృష్ణా మిల్క్ యూనియన్ ప్రాజెక్ట్ కామధేను ప్లాంట్ (వీరవల్లి)కి అవార్డు వరించింది. ఈ అవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు సంయుక్తంగా అందుకున్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ నేతృత్వంలో పరిశుభ్రమైన వాతావరణంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పాలు, పాల పదార్థాలను వినియోగదారులకు అందించటం జరుగుతోంది. దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధర, క్రమం తప్పకుండా బోనస్ అందించటంతో పాటు, పాడి రైతులు, పశు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్‌కు ఈ అవార్డు లభించటం విశేషం.

సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న విజేతలు

పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు- 2025లో ఎన్టీఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు లభించగా సోమవారం నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛాంధ్ర పురస్కారాలను విజేతలకు అందజేశారు. మొత్తం 69 రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఎనిమిది పురస్కారాలు ఎన్టీఆర్ జిల్లాకు లభించాయి. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ్ సర్వేక్షణ్)ల్లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ తరపున కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర సంయుక్తంగా అందుకున్నారు. స్వచ్ఛ బస్‌స్టేషన్ల విభాగంలో విజయవాడ పీఎన్‌బీఎస్ తరపున ఆర్టీసీ ఈడీ విజయారత్నం, ఆర్ఎం ఎంవై దానం అవార్డు అందుకున్నారు. తర్వాత స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, స్వచ్ఛ అంగన్వాడీలు విభాగంలో కేదారేశ్వరపేట - 3 అంగన్వాడీ కేంద్రం, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కృష్ణలంకలోని వీఎంఆర్ఆర్ (జీ) మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరీలో రైజ్ సంస్థ అవార్డులు సాధించగా ఆయా సంస్థలు, పాలనా యూనిట్ల ప్రతినిధులు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులతో పాటు అభినందనలు అందుకున్నారు.

టీమ్ ఎన్టీఆర్ విజేతలకు కలెక్టర్ అభినందన

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనకు ముందడుగు వేస్తూ స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్‌టీఆర్ జిల్లాను ముందు వరుసలో నిలిపినందుకు అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. ఈ పురస్కారాల స్ఫూర్తిగా జిల్లాను మరింత స్వచ్ఛత దిశగా నడిపించాలన్నారు. పారిశుధ్యం, పరిశుభ్రతలో చేసిన విశేష కృషిని గుర్తించేందుకు ఈ అవార్డులు దోహదపడతాయన్నారు. స్వచ్ఛాంధ్ర మిషన్‌లో కీలకపాత్ర పోషించేలా ప్రోత్సహించేందుకు, సంస్థలు, పాలనా యూనిట్ల మధ్య ఆరోగ్యకర పోటీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భరోసానిచ్చినట్టు తెలిపారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతలో అత్యుత్తమ విధానాలు, ఆవిష్కరణల ప్రదర్శనకు, స్వచ్ఛాంధ్రలో ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు దోహదం చేస్తాయన్నారు.



సీఆర్డీఏ కార్యాలయం వద్ద అధికారులతో ఏడీసీ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ పార్థసారథి

సీఆర్డీఏ భవనానికి హంగులు

- ఏడాది పొడవునా పూసే పూలమొక్కలతో ముస్తాబు

విజయవాడ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీఆర్డీఏ కొత్త భవనం రంగుల హంగులతో ముస్తాబవుతోంది. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీ పార్థసారథి ఆదేశాల మేరకు సీఆర్డీఏ భవనం ఎదుట ఆకర్షణీయమైన, ఏడాది పొడవునా పూసే పూల మొక్కలను అధికారులు ఏర్పాటుచేయనున్నారు. వెంకటపాలెం నర్సరీలోని ఏడీసీ నర్సరీలో ప్రత్యేకంగా పెంచుతున్న మొక్కలను ఇక్కడ ప్లాంటేషన్ చేస్తున్నారు. శీతల దేశాల్లో ఎక్కువగా కనిపించే టబూబియా అర్జెంషియా, అవలాండా, కాస్సియా పిస్టులా, మిల్లింగ్ టోనియా, కాస్సియా జవానికా, ప్లుయేరియా వంటి విలువైన మొక్కలు తెలుపు, గులాబీ, పసుపు రంగుల్లో పూలు పూస్తాయి. వీటిని సీఆర్డీఏ భవనం ఎదుట, పరిసర ప్రాంతాల్లో సుమారు 300 మొక్కల ఏర్పాటుకు ఏడీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక్కడ చేపడుతున్న పచ్చదనం అభివృద్ధి పనులకు ఏడీసీ నర్సరీ మొక్కలు కావడంతో కేవలం రూ.16 లక్షలు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. సీఆర్డీఏ పార్కింగ్, వీఐపీ పార్కింగ్, క్యారిడార్ల వెంట కనువిందు చేసేలా గ్రీన్‌లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రభుత్వ సాగతీత ధోరణి సరికాదు

- పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు దాలినాయుడు

విజయవాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు, సమస్యల గురించి జేఏసీ చర్చల విషయంలో ప్రభుత్వం సాగతీత ధోరణి అవలంబిస్తోందని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కే దాలినాయుడు అన్నారు. నగరంలోని పెన్షనర్ల భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలస్యంగానైనా ప్రభుత్వం పెన్షనర్ల డిమాండ్లు తీరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసోషియేషన్‌ను పటిష్ఠం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గతవారం మృతిచెందిన ఈ కార్యాలయ సభ్యుడు, పెనమలూరు మాజీ ట్రెజరర్ ఐనంపూడి సాంబశివరావుకు శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జీ నారాయణ రావు, జనరల్ సెక్రటరీ బీ విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న పీహెచ్‌సీ వైద్యులు

కొనసాగిన పీహెచ్‌సీ వైద్యుల నిరాహారదీక్ష

ధర్నాచౌక్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన నిరాహారదీక్ష 2వ రోజు సోమవారం కొనసాగింది. జీవో 99ను తక్షణమే రద్దు చేయాలని, ట్రైబల్ అలవెన్స్ చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్ కల్పించాలని, టైమ్‌బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని నినదించారు. మూడేళ్లుగా గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందిస్తున్న వైద్యులకు రూ.5 వేల టీఏ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే గ్రీవెన్స్, కన్సల్టేషన్, ప్లానింగ్ చర్చల్లో ఇతర వైద్య సంఘాలతో మాదిరిగా తమ సంఘానికి అవకాశం కల్పించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రవీంద్ర, డాక్టర్ కిషోర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాహుల్, కోశాధికారి డాక్టర్ వినోద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్ఞానేష్ పాల్గొన్నారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక రైలులో యాత్ర

రైల్వేస్టేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర నవంబరులో ప్రారంభిస్తున్నట్టు భారతీయ రైల్వేస్ భారత్ గౌరవ ట్రైన్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. విజయవాడ బెంజిసర్కిల్‌లోని హోటల్ ఐరాలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రత్యేక పర్యాటక రైలులో తమిళనాడు, కేరళలోని దేవాలయాలు, పంచ ద్వారక, మహదేవ్, జ్యోతిర్లింగాలు దర్శించుకునే అవకాశం ఉందన్నారు. నవంబరు 16, 26న రైలు బయలుదేరుతుందన్నారు. ఇండియన్ రైల్వే, మొదటి భారత్ గౌరవ్ రైలు, సౌత్ స్టార్ రైల్, అతి పెద్ద టూరిస్ట్ రైలు ఆపరేటర్ టూర్ టైమ్స్ ఈయాత్ర చేపట్టిందన్నారు. రిజర్వేషన్ల కోసం టూర్ టైమ్స్‌ను నేరుగా 9355021516 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లోనూ బుక్ చేసుకోవచ్చన్నారు. అందుకోసం టూర్ టైమ్స్ ఇన్‌వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. తమిళనాడు, కేరళ దేవాలయాల యాత్ర నవంబరు 16న పంచ ద్వారక, మహదేవ్, జ్యోతిర్లింగాల యాత్ర నవంబర 26న ప్రారంభం కానుందన్నారు. ఈ ప్రత్యేక రైలులో ఒక ఫస్ట్ ఏసీ, 3 సెకండ్ ఏసీ, 5 థర్డ్ ఏసీ, 2 స్లీపర్, ఒక ప్యాంట్రీ కార్ ఉంటాయన్నారు. ఈ రైలు 650 మంది ప్రయాణికులు సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఈ ప్యాకేజీలో వసతి, సందర్శన, బస్సు, ట్రావెల్ ఇన్సూరెన్స్, మూడు పూటలా భోజనం, యాత్రికులు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యాన్ని పొందవచ్చన్నారు.

గర్భిణులకు ఎనీమియా

70 శాతం మందిలో మైల్డ్ ఎనీమియా



- గర్భిణులను వేధిస్తున్న ఎనీమియా
- పోషకాహారం తీసుకోవడం తప్పనిసరి
- జాగ్రత్తలతో సమస్య నుంచి బయటపడే అవకాశం

జిల్లావ్యాప్తంగా ఐరన్ లోపంతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గైనకాలజీ వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఐరన్ లోపంతో బాధపడే గర్భిణుల్లో సివియర్ ఎనీమియా, మైల్డ్ ఎనీమియా రెండు రకాలు ఉంటారు. సాధారణంగా 70 శాతం గర్భిణులు మైల్డ్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ఆంధ్రజ్యోతి - విజయవాడ: జీజీహెచ్‌లో ప్రతి నెలా సగటున 500 పైగా ప్రసవాలు జరుగుతాయి. వీరిలో 80-90 మంది గర్భిణులు మైల్డ్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. 12 శాతం మందిలో మాత్ర మే సాధారణ స్థాయి కంటే అధికంగా హి మోగ్లోబిన్ ఉంటోందని వైద్యులు తెలిపారు. 3-4 శాతం మంది సివియర్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు వైద్యులు నిర్ధారించారు.

రక్త హీనత నిర్ధారించేలా..

హిమోగ్లోబిన్ పరీక్ష ద్వారా రక్తహీనతను నిర్ధారిస్తారు. హిమోగ్లోబిన్ 11 గ్రాములుంటే సమస్య లేనట్టు. అంతకంటే తక్కువగా ఉంటే రక్తహీనతతో బాధపడుతున్నట్టు గ్రహించాలి. సివియర్ ఎనీమియాతో బాధపడే గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం 7 గ్రాముల కంటే తక్కువే. ఇది అత్యంత ఇబ్బందికరమైనది. ఈ సమస్య ఎక్కువగా గ్రామీణ మహిళల్లో కనిపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఈతరం గర్భిణుల్లో హిమోగ్లోబిన్ 7 నుంచి 9 గ్రాముల మధ్య ఉంటోంది. దీనినే మైల్డ్ ఎనీమియాగా వైద్యులు చెబుతున్నారు. 65-70 శాతం మంది గర్భిణులు ఈ సమస్యతో బాధపడుతున్నారు. గర్భం దాల్చిన తర్వాత తగిన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల మైల్డ్ ఎనీమియాతో ఉన్న గర్భిణులు సివియర్ ఎనీమియా స్థాయికి దిగజారుతారని వైద్యులు చెబుతున్నారు.

ప్రధాన కారణం

రక్తహీనత బారినపడడానికి ప్రధాన కారణం పోషకాహార లోపమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏ, బీ12, బీ2, సీ, డీ, ఈ విటమిన్లు, రాగి, జింక్ లోపంతో రక్తహీనత బారినపడుతున్నారు. దీనివల్ల గర్భిణుల్లో తీవ్రమైన అలసట, కళ్లు పాలిపోవడం, ఆయాసం, గుండెదడ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ముందు జాగ్రత్తలు అవసరం



గర్భిణుల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పోషకాహారం తీసుకోకపోవడం, చిన్న వయసులోనే పెళ్లిళ్ల వల్ల ఈ సమస్య పెరుగుతోంది. ప్రతి 10 మంది గర్భిణుల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్న వారే. వీరికి తగిన మందులతో పాటు డైట్‌ప్లాన్ చెబుతున్నాం. ప్రసవ సమయంలో క్లిష్ట పరిస్థితులు ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా గర్భంతో ఉన్న సమయంలో ఫాస్ట్‌ఫుడ్, బయట ఆహారం జోలికి వెళ్లకపోవడం మంచిది.

డాక్టర్ కేశవచంద్ర,
గైనకాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్

సమస్యలు

పుట్టబోయే బిడ్డ బరువు, పెరుగుదల తక్కువగా ఉంటుంది. హిమోగ్లోబిన్ 7 గ్రాముల కంటే తక్కువగా ఉన్న గర్భిణులకు ప్రసవ మరణాల్లో ఇన్‌డైరెక్ట్ కారణాల్లో ఇదొకటని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలోని ప్రతి లక్ష ప్రసవాల్లో 60 మంది ఈ కారణంగానే మృత్యువాత పడుతున్నారు.

ఆ వయసే కీలకం

గర్భిణుల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించడానికి ముందస్తు చర్యలే మార్గమని చెబుతున్నారు. ముఖ్యంగా 10-19 ఏళ్లలోపు వయసున్న బాలికల్లో రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయాలి. అవసరమైన పోషకాహారం, మందులతో వివాహ సమయానికి కోలుకుంటారని, తద్వారా సమస్యకు శాశ్వతంగా పరిష్కరించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

పోషకాహారంతో మేలు

పోషకాహారం ద్వారా రక్తహీనత సమస్యకు చెక్ పెట్టవచ్చు. ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలు, మాంసం, డ్రైఫ్రూట్స్, పండ్లు తీసుకోవాలి. నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలు బెల్లం చిక్కీలు వంటివి రోజూ తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికారని చెబుతున్నారు. చాలా మందికి పోషకాహారం తీసుకునేందుకు అవకాశమున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ సమస్య ఎదురవుతోందని నిపుణులు చెబుతున్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి గర్హనీయం

- ఐలూ నేతలు సుంకర, నల్లూరి ఖండన



విజయవాడ లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రయత్నం న్యాయవ్యవస్థపై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో అభివర్ణించా రు. రాజ్యాంగాన్ని రక్షించడంలోనూ, నిర్దేశించిన మౌలిక సూత్రాల్లో ఒకటైన భౌతికతత్వాన్ని రక్షించడంలోనూ ఆయన ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. రాజ్యాంగం కంటే సనాతన ధర్మమే గొప్పదని ప్రచారం చేసి ప్రజల మధ్య చిచ్చుపెట్టి, మత విభజనను, మత విద్వేషాన్ని రేపుతున్న సంస్థలు, పాలకుల తీరువల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని సుంకర, నల్లూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) తీవ్రంగా ఖండిస్తోందని, దాడిచేసిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌కు రక్షణ మరింత పెంచాలని, న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడాలని ఐలూ తరపున భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు రాజేంద్రప్రసాద్, మాధవరావు తెలిపారు.

లోకో పైలెట్ మనీషాకు పల్లా అభినందన



రైల్వేస్టేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లికి చెందిన వందే భారత్ రైలు లోకో పైలెట్ గుంటి మనీషా సోమవారం ఆయ న కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయన మనీషాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆ మె లోకో పైలెట్ కావాలనే ఆసక్తిపై వివరాలు, కుటుంబ నేపథ్యం గురించి, ప్రస్తుతం ఆమె ఏ రైల్వే డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. తనకు చిన్నతనం నుంచి డ్రైవర్ కావాలనే ఆకాంక్ష ఉండేదని, అనుకోని పరిస్థితుల్లో లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి చనిపోవటంతో సోదరి ప్రోత్సాహంతో ఐటీఐ చదివి, ఆర్ఆర్‌బీ పరీక్షలో పాసై, లోకో పైలెట్ అయినట్టు వివరించారు. ప్రస్తుతం బెంగళూరు డివిజన్‌లో వందే భారత్ రైలు లోకో పైలట్‌గా పనిచేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు. కాగా, ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో మనీషా గురించి వందే... మనీషా! కథనం ప్రచురితమైంది. ఆమె గురించి తెలుసుకున్న శ్రీనివాసరావు తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు.

డబ్బులిస్తే గౌరవ డాక్టరేట్లు..!

తెనాలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలతో సంబంధం లేకుండా, వైస్ చాన్స్‌లర్ల సంతకాలు లేకుండా.. నకిలీ డాక్టరేట్ సర్టిఫికెట్లు జారీచేస్తున్న తెనాలి వాసిని తెలంగాణ పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని దుగ్గిరాల కేంద్రంగా పెద్దేటి యోహాను అనే వ్యక్తి 'గుర్రం జాషువా స్మారక కళా పరిషత్' పేరుతో సాహిత్య, ఇతర రంగాల్లో విశేష కృషి చేసిన వారికి పురస్కారాలిస్తూ వచ్చాడు. తనకు ఐఎస్‌వో గుర్తింపు ఉందంటూ స్వయంగా గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేయడం మొదలు పెట్టాడు. దీనికోసం ఒక్కో డాక్టరేట్‌కు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేస్తున్నట్టు తెలిసింది.

తప్పిన ఘోర ప్రమాదం

- హనుమాన్‌పేటలో పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ లీకై స్వల్పంగా దగ్ధమైన ట్యాంకర్
- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది
- ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలు

వన్‌టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ హనుమాన్‌పేట పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డులో సోమవారం సాయంత్రం పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ లీకేజీ కావటంతో మంటలు చెలరేగాయి. డ్రైవర్ మంటలు ఆర్పేందుకు ప్రయత్నించటంతో స్వల్పంగా మంటలు అంటుకోగా తప్పించుకుని పరిగెత్తాడు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు తెలియజేయటంతో ఫైర్ ఆఫీసర్, సిబ్బంది సకాలంలో స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కొండపల్లి ఐఓసీఎల్ ప్లాంట్ నుంచి ఏపీ 39 టీజీ 4565 నెంబరు గల ట్యాంకర్ డ్రైవర్ 15వేల లీటర్ల పెట్రోల్, 5వేల లీటర్ల డీజిల్ నింపుకుని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఐఓసీఎల్ బంక్‌కు వెళ్లటానికి సోమవారం మధ్యాహ్నం బయలుదేరాడు. పాయకాపురంలోని ఐసీఎల్ పెట్రోల్ బంక్‌లో ట్యాంకర్‌కు పెట్రోల్ నింపుకుని బుడమేరు వంతెన, అయోధ్యనగర్, గాంధీనగర్, హనుమాన్‌పేట మీదుగా బస్టాండ్ పక్కనుంచి కృష్ణలంక వారధి పైకి వెళ్లేందుకు బయలుదేరాడు. హనుమాన్ పేట పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డులో ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీకవటంతో వాసన గమనించిన డ్రైవర్ కోటేశ్వరరావు రోడ్డు పక్కన ట్యాంకర్‌ను ఆపి వాహనంలోని సేఫ్టీ పరికరాల ద్వారా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు. మంటలు ఎగబాకటంతో భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం తెలిపారు. డీఎఫ్‌వో ఏవీ శంకర్‌రావు తమ సిబ్బందితో పాటు రెండు ఫైర్ వాహనాల్లో వెళ్లి మంటలను ఆర్పివేశారు.



రోడ్డులో కాలిపోతున్న పెట్రోల్, డీజిల్ ట్యాంకర్, (ఇన్‌సెట్లో) మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

అనంతరం సంఘటనా వివరాలను డ్రైవర్ కోటేశ్వరరావు నుంచి అడిగి తెలుసుకున్నారు. మరోపక్క గవర్నర్‌పేట పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి డ్రైవర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. డీఎఫ్‌వో శంకర్‌రావు ఐఓసీ అధికారులు, ట్యాంకర్ ఓనర్ ఫోన్ నెంబర్లు తీసుకుని మాట్లాడారు. డ్రైవర్‌కు స్వల్పంగా కాళ్లకు గాయాలవగా, తల వెంట్రుకలు కొద్ది మొత్తంలో కాలాయి. ట్యాంకర్ రెండు టైర్లు పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది, పోలీసులు హనుమాన్ పేట రోడ్డులో రాకపోకలను నిలిపేశారు. జి.కొండూరుకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ తాతా కోటేశ్వరరావు కొండపల్లికి చెందిన ట్యాంకర్ల వ్యాపారి వద్ద కొన్నేళ్లుగా పనిచేస్తున్నట్టు తెలిసింది.

ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం

అమరావతిలో పర్యటన

కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) బృందం సోమవారం రాజధాని అమరావతి పర్యటనకు విచ్చేసింది. ఏడీబీ - వాటర్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో (సీనియర్ డైరక్టర్), మనోజ్ శర్మ (డైరెక్టర్), సంజయ్ జోషి (ప్రిన్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్ (సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్) తొలుత విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చారు. ఏడీబీ బృందానికి సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు, అదనపు కమిషనర్లు జీ సూర్య సాయి ప్రవీణ్‌చంద్, అమిలినేని భార్గవ్‌తేజ్ స్వాగతం పలికారు. అనంతరం సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)లోని ముఖ్య అధికారులతో బ్యాంకు బృందం సమావేశం కాగా రాజధాని అమరావతి నిర్మాణ పురోగతిని కమిషనర్ వివరించారు. అలాగే సమావేశంలో బ్యాంకు ప్రతినిధులు పలు అంశాలపై అధికారులతో చర్చించారు. అమరావతి నిర్మాణంలో రైతుల సహకారం, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అనుసరించి పనులు జరుగుతున్న క్రమాన్ని బ్యాంకు బృందానికి వివరించారు. రాజధాని అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో అమలు చేస్తున్న పర్యావరణ, సామాజిక సంక్షేమ కార్యకలాపాలు, అమరావతిలో సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ, ఉద్యోగ, ఉపాధి కల్పన గురించి వివరించారు. కార్మికుల సంక్షేమానికి పాటిస్తున్న విధానాలను వివరించారు. అనంతరం బ్యాంకు బృందం మందడంలోని సీఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం, శాఖమూరు రిజర్వాయర్, నిర్మాణం పూర్తి చేసుకొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల సముదాయాలు, గెజిటెడ్ అధికారుల భవనాలు, అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్సు (ఏజీసీ)లో శాసనసభ, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ ప్రాంతాలు, ఎన్-9 రహదారి నిర్మాణ పనులు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యుటీపీ) నిర్మించే ప్రాంతాలను, అలాగే ప్రస్తుత హైకోర్టు భవనాన్ని బ్యాంకు బృందం పరిశీలించింది. ఆయా సైట్లలో సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. మందడంలో అమలుచేస్తున్న గ్రీవెన్స్ రిడ్రస్సల్ మెకానిజం (జీఆర్ఎం) గురించి అధికారులు బ్యాంకు బృందానికి వివరించారు. అర్జీల పరిష్కారంలో అమలవుతున్న జీఆర్ఎం విధానంపై బ్యాంకు బృందంలోని సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శాఖమూరు రిజర్వాయర్ వద్ద ఏడీసీఎల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ (పీఎంసీ), గుత్తేదారులతో బ్యాంకు బృందంలోని సభ్యులు కలిశారు. బ్యాంకు బృందానికి అధికారులు నిర్మాణ పనుల పురోగతిని తెలియజేశారు.

బయో ఉత్పత్తులకు సంబంధించిన

309, 18 జీవోలు రద్దు

అమరావతి: బయో ఉత్పత్తుల తయారీ, అమ్మకం, పంపిణీకి సంబంధించి కేంద్ర ఎరువుల చట్టానికి వైరుధ్యంగా ఉన్న రెండు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 1968 పురుగుమందుల చట్టం, 1985 ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం బయో ఉత్పత్తుల తయారీ, అమ్మకం, పంపిణీని నియంత్రించడానికి నిర్దిష్ట చట్టం లేనందున రైతు ప్రయోజనాల దృష్ట్యా బయో ఉత్పత్తుల క్రమబద్ధీకరణకు 2014, 2017లో మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది.

స్టీల్‌ప్లాంటుకు పూర్తి సహకారం

» పూర్తిస్థాయి ఉత్పత్తే లక్ష్యం.. సమీక్షలో సీఎం

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని, పూర్తి సామర్థ్యంతో ప్లాంటును నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్మాగారం అధికారులకు సోమవారం సూచించారు. అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, స్టీల్ ప్లాంటు సీఎండీ ఏకే సక్సేనా, స్టీల్ జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర తదితరులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చొరవతో కేంద్రం అందించిన రూ.11,440 కోట్ల ఆర్థిక సాయంతో ఏడాది కాలంలోనే ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం 25 శాతం నుంచి 79 శాతానికి తీసుకువచ్చామని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ మూడో త్రైమాసికం ముగిసేలోగా అంటే డిసెంబరు చివరికి 92.5 శాతం ఉత్పత్తి సాధించాలని సూచించారు. దీని కోసం కార్మికులు, ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతా కలసి పనిచేయాలన్నారు. స్టీల్ ప్లాంటుకు పూర్వవైభవం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సహకారమైనా అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్లాంటు పనితీరుపై ప్రతి మూడు నెలలకొకసారి సమీక్షిస్తానని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో స్టీల్ ప్లాంటు డైరెక్టర్ జీవీఎన్ ప్రసాద్ కూడా పాల్గొన్నారు.

ఏపీలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు భేష్!

» పేదరిక నిర్మూలనకు 'పీ4' అద్భుతంగా ఉంది

» రాజస్థాన్ ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి ప్రశంస

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీలో పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమం అద్భుతంగా ఉందని రాజస్థాన్ ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి చేతన్ ప్రకాశ్ ప్రశంసించారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు బాగున్నాయని కొనియాడారు. ఇక్కడ అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించి తమ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇందుకు ఏపీ ప్రభుత్వ సహకారం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాజస్థాన్ ప్రణాళికశాఖ ఉన్నతాధికారుల బృందం సోమవారం అమరావతి సచివాలయంలో 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్‌తో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా దినకర్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చర్యలను రాజస్థాన్ అధికారులకు వివరించామని తెలిపారు. అనంతరం రాజస్థాన్ ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి చేతన్ ప్రకాశ్ మాట్లాడుతూ ఏపీలో అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకున్నామన్నారు. పారదర్శకత కోసం వినియోగిస్తున్న టెక్నాలజీ గురించి తెలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ప్రణాళికశాఖ అధికారులు నిర్మల్ సేఠి, వినేశ్ సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్రాల మధ్య సహకారం ముఖ్యం

మానవత్వానికి సరిహద్దులు ఉండవు.. శ్రీశైలంలో కన్నడ భక్తులకు సౌకర్యాలు



భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



» సుప్రీం మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాలగౌడ పుట్టినరోజు వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

» చింతామణిలో పవర్ స్టార్ కోసం పోటెత్తిన అభిమానులు

బెంగళూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఇరుగు, పొరుగు రాష్ట్రాల మధ్య సహకారం ముఖ్యమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రాల మధ్య సరిహద్దులు కేవలం కొన్ని నియంత్రణలకు మాత్రమేనని తెలిపారు. మానవత్వానికి, మనోభావాలకు సరిహద్దులు ఉండవని వ్యాఖ్యానించారు. చిక్కబళ్లాపుర జిల్లా చింతామణిలో సోమవారం జరిగిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలగౌడ 75వ పుట్టినరోజు వేడుకలకు ఆయన ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలాది మంది అభిమానులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ ప్రసంగించారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన జస్టిస్ గోపాలగౌడ.. పేద వర్గాలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో న్యాయవాద వృత్తిని చేపట్టి, సుప్రీం కోర్టు న్యాయమూర్తి స్థాయికి ఎదిగారని తెలిపారు. ఓ వైద్యుడి నిర్లక్ష్యానికి గురైన బాధితులకు ఏకంగా రూ.6 కోట్ల పరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తొలగించిన సంస్థలోనే కార్మికుడికి ఉద్యోగం కల్పించేలా ఆయన తీర్పు ఇచ్చారని గతాన్ని గుర్తు చేశారు. గోపాలగౌడ అభిప్రాయాలు యువత, మహిళలు, రైతులు, కార్మికులు, పర్యావరణానికి చేరువగా ఉంటాయని, అవే భావాలు కలిగిన తాను ఆయనకు దగ్గరయ్యానని పవన్‌కల్యాణ్ చెప్పారు. "నేను 2019 ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయా. ఆ సమయంలో జస్టిస్ గోపాలగౌడ అండగా ఉన్నారు. ఎంతో ధైర్యం చెప్పారు. సినిమాలలో బిజీగా ఉన్నప్పుడే నా వంతుగా సమాజానికి ఏదైనా చేయాలని రాజకీయాలలోకి వచ్చా. గోపాలగౌడ వంటి ఎంతోమంది ఆదర్శప్రాయుల సలహాలు నాకు కీలకం." అని పవన్ కల్యాణ్ అన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి!

కర్ణాటకలోని చిక్కబళ్లాపుర, కోలార్ జిల్లాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి సోదర భావంతో తాను ప్రయత్నిస్తానన్నారు. "ఒకప్పుడు ఇది సరస్సులు ఉండే ప్రాంతం. కొన్నేళ్ల పాటు కొనసాగిన అనావృష్టి కారణంగా నీటి సమస్య ఏర్పడింది. దీనిని పరిష్కరించేందుకు సోదరభావంతో ప్రయత్నం చేస్తా." అని పవన్ అన్నారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా స్నేహ సంబంధాలు ఉన్నాయని, ఎంతో మంది తెలుగువారు విద్య, ఉద్యోగ, వ్యాపారాల కోసం కర్ణాటకలో నివసిస్తున్నారని చెప్పారు. ఇటీవలే 4 కుంకీ ఏనుగులను ఇచ్చి.. కర్ణాటక ప్రభుత్వం తమకు సహకరించిందన్నారు. శ్రీశైలం మల్లన్న దర్శనానికి వచ్చే కన్నడ భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించే విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబుతో చర్చించానని, ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి సోమణ్ణ, కోలార్ ఎంపీ మల్లేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. సభ ముగిసేదాకా అభిమానులు 'పవర్ స్టార్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. హెలికాప్టర్ వరకు ఆయన వెంట వచ్చి వీడ్కోలు పలికారు.

'ఈశాన్యం'లో మిగులు వర్షాలు?

» 112 శాతం వర్షపాతం నమోదయ్యే చాన్స్

» ఈనెల మూడో వారంలో దక్షిణాదిలోకి రుతుపవనాలు: ఐఎండీ



సోమవారం కురిసిన వర్షానికి గుంటూరు విద్యానగర్ మెయిన్ రోడ్డులో పొంగిపొర్లుతున్న నీరు

విశాఖపట్నం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సోమవారం ఈ విషయాన్ని వెల్లడించింది. అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ ఈశాన్య రుతుపవనాల కాలంగా పరిగణిస్తారు. తమిళనాడు/పుదుచ్చేరి, రాయలసీమ, కోస్తాంధ్ర, కేరళ, దక్షిణ కర్ణాటకకు ఈ రుతుపవనాలు పరిమితమవుతుంటాయి. ఈ మూడు నెలల కాలంలో దీర్ఘకాల సగటులో 112 శాతం, అదే అక్టోబరు నెలలో అయితే 115 శాతం వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నెల 17 నుంచి 21వ తేదీ మధ్యన ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని పలు మోడళ్లు అంచనా వేస్తున్నాయి.

నేడు రాయలసీమలో భారీ వర్షాలు!

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఎండ తీవ్రంగా ఉండటం, మరోవైపు సముద్రం నుంచి తేమగాలులు వీయడంతో వాతావరణ అనిశ్చితి నెలకొని సోమవారం రాష్ట్రంలో ఎక్కువచోట్ల వర్షాలు కురిశాయి. కాగా, చిత్తూరు పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

వచ్చే నెలలో టీచర్లకు ఆటల పోటీలు

» నేడు పాఠశాలల్లో జీఎస్టీ అవగాహన కార్యక్రమాలు

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు నవంబరు 15 నుంచి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. సోమవారం ఆర్జేడీలు, డీఈవోలు, ఇతర అధికారులతో వెబ్‌ఎక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్లకు ఆటల పోటీలు కొత్తగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే మంగళవారం అన్ని పాఠశాలల్లో జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

విద్యార్థులు తగ్గిన ఎయిడెడ్ స్కూళ్లకు నోటీసులు

గత మూడు విద్యా సంవత్సరాల్లో వరుసగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్లకు తుది నోటీసులు జారీచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదేశించారు. 40 మంది విద్యార్థులు కూడా లేని పాఠశాలలకు ఇప్పటికే నోటీసులు జారీచేయగా, తుది నోటీసులు ఇవ్వాలని, అనంతరం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 251 ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40 లోపు ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ గుర్తించింది.

ముగ్గురు తెలుగువారికి ఎన్‌ఎస్‌ఎస్ అవార్డు



రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న పృథ్వీరాజ్, డి.రెడ్డి జిష్ణు, మణి సాయివర్మ

» ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము ప్రదానం

న్యూఢిల్లీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సమాజ సేవకు సంబంధించి విశేష కృషి చేసిన వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురికి ఎన్‌ఎస్‌ఎస్ అవార్డులు లభించాయి. సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వీరికి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. 2022-23కు సంబంధించి మై భారత్-నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్‌ఎస్‌ఎస్) కింద ఏపీలోని నెల్లూరు విక్రమసింహపురి యూనివర్సిటీకి చెందిన ముమ్మల పృథ్వీరాజ్, నెల్లూరు జిల్లాలోని చింతారెడ్డిపాలెంలో ఉన్న నారాయణ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు చెందిన డి.రెడ్డి జిష్ణు, తెలంగాణలోని సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన వంగపల్లి మణి సాయివర్మ వలంటీర్ కేటగిరీలో ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. స్వచ్ఛంద సమాజ సేవకు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వలంటీర్లు చేసిన అత్యుత్తమ సహకారాన్ని గుర్తించి కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారికి ప్రతి ఏటా ఎన్‌ఎస్‌ఎస్ అవార్డులను ప్రకటిస్తుంది. ఈ పురస్కారం కింద గ్రహీతలకు రూ.లక్షతో పాటు వెండి పతకం, సర్టిఫికెట్ లభిస్తాయి.

వెనుకబడిన కులాల అభ్యున్నతికి కులగణన అవసరం: సీపీఐ

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వెనుకబడిన కులాల అభ్యున్నతికి కులగణన అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. త్వరలో చేపట్టే జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కులగణన కోసం క్షేత్రస్థాయి నుంచి ఒత్తిడి తేవాలని, అవసరమైతే 'చలో అమరావతి'కి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

డీఎంహెచ్‌వోపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆగ్రహం

గుంటూరు మెడికల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని తురకపాలెంలో ఆదివారం చల్లా కృష్ణవేణి మృతి ఘటనపై వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బీసీ కాలనీకి చెందిన కృష్ణవేణి గుంటూరు జీజీహెచ్‌లో ఆదివారం మెలియాయిడోసిస్ వ్యాధి లక్షణాలతో మృతి చెందారు. ఈ క్రమంలో వీరపాండియన్ గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మీతో సోమవారం మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పది రోజులుగా రోగి ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నా ఎందుకు ఫాలో అప్‌లో లేరని అయన డీఎంహెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

మట్టి మిద్దె కూలి చిన్నారి మృతి



లలిత

» కర్నూలు జిల్లా మాధవరంలో ఘటన

మంత్రాలయం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు మట్టిమిద్దె కూలి ఓ చిన్నారి మృతి చెందింది. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన నాగలదిన్నె భీమరాయుడు, నాగమ్మ దంపతులు వారి కుమారుడు మల్లికార్జున, కుమార్తె శ్రావణి మనుమరాలు లలిత మట్టి మిద్దె ఇంట్లో ఆదివారం నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో లలిత(5) మట్టిలో కూరుకుపోయింది. చిన్నారిని కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే బాలిక మృతిచెందింది. చిన్నారి తల్లిదండ్రులు రామాంజి, మహేశ్వరి దంపతులు ఆమెను చదువు కోసం అమ్మమ్మ వద్ద ఉంచారు.

జగన్... తస్మాత్ జాగ్రత్త

» గిరిజనులంటే అంత చులకనా..?: మంత్రి సంధ్యారాణి

» మంత్రి అచ్చెన్నతో కలసి ఆసుపత్రిలో విద్యార్థినులకు పరామర్శ



పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో విద్యార్థినిని పరామర్శిస్తున్న మంత్రులు

పార్వతీపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 'గిరిజనులు అంటే అంత చులకనా? తస్మాత్ జాగ్రత్త జగన్.. అసభ్యకరంగా మాట్లాడితే సహించేది లేదు' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పచ్చకామెర్లతో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల విద్యార్థినులను సోమవారం మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడారు. సీఎం చంద్రబాబుతో పాటు తనను ఉద్దేశించి 'గాడిదలు కాస్తున్నారా?' అని మాజీ సీఎం జగన్ ప్రశ్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళలంటే గౌరవం లేదా? అని ప్రశ్నించారు. 'విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాం. ఏ ఒక్కరూ అనారోగ్యంతో ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న విద్యార్థినుల్లో ఒకరు సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్నారు. విశాఖ కేజీహెచ్, పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు కోలుకున్న తర్వాతే డిశ్చార్జి చేస్తాం. ఇద్దరు విద్యార్థినులు మృతి చెందితే 11 మంది చనిపోయారంటూ ప్రచారం చేయడం తగదు' అని మంత్రి సంధ్యారాణి అన్నారు. అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. నిన్నటి వరకు అధికారంలో ఉండి, బాధ్యత గల పదవులు నిర్వహించిన వ్యక్తులు నేడు విద్యార్థినుల అనారోగ్య ఘటనను రాజకీయం చేయాలని చూడటం శోచనీయమని ఈ విషయాన్ని తాము రాజకీయం చేయదలచుకోలేదని తెలిపారు.



సోమవారం అనకాపల్లిలో ఔషధ నియంత్రణ శాఖ అధికారుల తనిఖీలు

రాష్ట్రంలో కల్తీ దగ్గు మందు లేదు

» దుకాణాలకు, ఆస్పత్రులకు సరఫరా కాలేదు

ఆందోళన చెందవద్దు: మంత్రి సత్యకుమార్

అమరావతి/గుంటూరు వైద్యం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 12 మంది చిన్నారుల మృతికి కారణమైన కల్తీ దగ్గు మందు కోల్డ్రిఫ్ జాడ రాష్ట్రంలో లేదని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఔషధ దుకాణాలకు కానీ, ప్రభుత్వాసుపత్రులకు కానీ ఆ దగ్గు మందు సరఫరా చేయలేదని చెప్పారు. అందువల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెండేళ్లలోపు చిన్నారులకు దగ్గు, జలుబుకు సంబంధించి ద్రవరూపంలో మందులు సూచించకుండా వైద్యులకు ఆదేశాలు పంపాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఔషధ దుకాణాల్లో కోల్డ్రిఫ్ మందు ఎక్కడా లేదని ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, డ్రగ్స్ డీజీ గిరీషా మంత్రికి తెలిపారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు జరిపారు.

మరో స్వదేశీ ఉద్యమం రావాలి

» స్వయం సమృద్ధితో బలమైన శక్తిగా దేశం

» స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి

» యువతను ఆకర్షిస్తున్న మోదీ పాలన

» ప్రతి ఇంటా బీజేపీ జెండా ఎగరాలి

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

» పరిశ్రమలతో రాయలసీమ అభివృద్ధి: టీజీ వెంకటేశ్



కర్నూలులో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా నిలవాలంటే మరో స్వదేశీ ఉద్యమం అవసరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. కళాశాల విద్యార్థులకు స్వదేశీ ఉత్పత్తులపై అవగాహన కల్పించాలన్నారు. సోమవారం కర్నూలులో జరిగిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులతో మాట్లాడారు. స్వదేశీతోనే స్వయం సమృద్ధి సాధ్యమని, తద్వారా భారత కీర్తి విశ్వవ్యాప్తం కావటంతో పాటు ప్రపంచాన్ని శాసించే బలీయమైన శక్తిగా దేశం అవతరిస్తుందన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండే చేనేత, హస్తకళలను ఆదరించి, ఎగుమతులను ప్రోత్సాహించాలన్నారు. ప్రధాని మోదీ పాలనా విధానాల పట్ల యువత ఎంతో ఆకర్షితులు అవుతున్నారని, వారిని పార్టీలో భాగస్వాములు అయ్యేలా చైతన్యవంతుల్ని చేయాలని పిలుపునిచ్చారు. 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' అనేది ప్రధాని మోదీ చేపట్టిన గొప్ప సంస్కరణ అని తెలిపారు. ప్రతి మారుమూల గ్రామంలోని ప్రతి ఇంటా బీజేపీ జెండా ఎగరాలని, దేశానికి బీజేపీ ఎంత అవసరమో ప్రజలకు అర్థమయ్యేలా తెలపాలని అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతం ఎంతో వెనకబడి ఉందని, దీనిపై ఎన్నో పోరాటాలు చేశామన్నారు. రాయలసీమ హక్కుల ఐక్యవేదిక ఏర్పాటు చేసి చాలా వరకు సాధించుకున్నామని, దాని ఫలితంగానే పరిశ్రమలు సైతం పెద్ద ఎత్తున వస్తున్నాయని అన్నారు.

తెలుసుకుందాం

మొలకలు ఇలా...

మొలకలు పోషకా భాండాగారాలే! అయితే అవి ఎంత పొడవు పెరిగిన తర్వాత తినడం ప్రయోజనకరం? తెలుసుకుందాం!



మొలకలు ఎంత పొడవు పెరిగితే వాటిలోని పోషకాలు అంతగా తగ్గిపోతాయి. మొలకలు వాటి పోషక శక్తిని మొక్కగా ఎదగడానికి ఖర్చు చేస్తాయి. కాబట్టి వాటిలోని పోషకాలను నష్టపోకుండా ఉండాలంటే మొలకెత్తిన వెంటనే తినేయాలి. అలాగే మొలకలు పొడవు పెరిగేకొద్దీ హానికారక బ్యాక్టీరియాను ఆకట్టుకుంటూ ఉటాయి. అలాగే జీర్ణ సమస్యలను కూడా తెచ్చి పెడతాయి. కాబట్టి మొలకల తోకలు గింజ పొడవు పెరిగిన వెంటనే తినేయాలి. అలాగే మొలకెత్తిన గింజలను ఒకట్రెండు రోజుల్లో తినేయాలి. ఈ మొలకల్లో జీవశక్తి ఉంటుంది. వీటికి పసుపు, నిమ్మరసం జోడించి తింటే, తేలికగా జీర్ణమవడంతో పాటు రోగనిరోధకశక్తి కూడా పెరుగుతుంది

పోషకాలు

పదార్థాలు పసందుగా...

పదార్థాల్లోని పోషకాలను మన శరీరం సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నా, జీర్ణ సమస్యలు వేధించకుండా ఉండాలన్నా కొన్ని నియమాలు పాటించాలి. అవేంటంటే....

పప్పులు: వండుకోడానికి ఒక రాత్రి ముందు కందిపప్పు, పెసరపప్పు మొదలైన పప్పులను నానబెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల వాటిలోని యాంటీ న్యూట్రియంట్లు వదిలిపోవడమే కాకుండా, ప్రొటీన్ శోషణ పెరుగుతుంది. ఇలా వండుకున్న పప్పులతో కడుపుబ్బరం సమస్య వేధించకుండా ఉంటుంది

సుగంధ ద్రవ్యాలు: నూనె లేకుండా వేయించి నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ చేసుకోవడం వల్ల వాటి సామర్థ్యం పెరుగుతుంది. తేలికగా జీర్ణమవుతాయి

సూప్: వీటికి యాపిల్, పైనాపిల్ మొదలైన పండ్లను జోడించకూడదు. వీటితో కడుపుబ్బరం వేధిస్తుంది. జీర్ణాగ్ని చల్లబడకుండా ఉండడం కోసం సూప్స్‌ను వేడిగానే తీసుకోవాలి

పాలు: తాగే ముందు తప్పనిసరిగా మరిగించాలి. పచ్చి పాలు జీర్ణం కావు

పండ్లు: భోజనంతో కలిపి కాకుండా పండ్లను విడిగా తినాలి. ఇతర పదార్థాలతో కలిపి తినడం వల్ల అసిడిటీ, పులిసే సమస్యలు వేధిస్తాయి



వైట్ డిశ్చార్జ్



యుక్త వయసు మొదలుకుని మెనోపాజ్ వరకూ మహిళల్లో కనిపించే అత్యంత సాధారణ లక్షణం... 'తెల్లబట్ట'! అయితే ఈ లక్షణాన్ని ప్రమాదకరంగా పరిగణించే సందర్భాలు కూడా ఉంటాయి. వాటి గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

ఆ తెలుపు సహజమేనా?

మహిళల్లో కనిపించే తెల్లబట్టను వైద్య పరిభాషలో 'లుకోరియా' అంటారు. యుక్తవయసు మొదలు మెనోపాజ్ దశ వరకూ మహిళల్లో ఈ లక్షణం కనిపించవచ్చు. మరీ ముఖ్యంగా టీనేజీ వయసు ఆడపిల్లల్లో ఈ లక్షణం అత్యంత సహజం. ఈ వయసు పిల్లల్లో హార్మోన్ల ఉధృతి ఫలితంగా తెల్లబట్ట కనిపించవచ్చు. ఆరోగ్యకరమైన అలవాట్లను కలిగి ఉండి, లైంగిక క్రీడలో పాల్గొనని యువతులు వైట్ డిశ్చార్జ్ గురించి కంగారుపడవలసిన అవసరం లేదు. ఒకవేళ స్రావం ఎక్కువగా ఉంటే ప్యాంటీ లైనర్స్ వాడుకోవాలి. అయితే ఈ సహజసిద్ధ స్రావానికి భయపడిపోయి వైద్యుల దగ్గరకు పరుగులు పెట్టే మహిళలు కూడా ఉంటారు. అయితే తెల్లబట్టను ఎప్పుడు ప్రమాదకరంగా భావించాలో తెలుసుకుని ఉండడం కూడా అవసరమే!

ఇవి సహజం

ఈ లక్షణాలతో కూడిన తెల్లబట్టతో ప్రమాదం లేదు. అవేంటంటే...

- దుర్వాసన లేకపోవడం
- తెల్లసొనలా పారదర్శకంగా ఉండడం
- జిగటతో సాగే గుణాన్ని కలిగి ఉండడం

ఇవి అసహజం

- పెరుగును పోలి ఉండడం
- పసుపు, ఆకుపచ్చ రంగులను కలిగి ఉండడం
- దుర్వాసన వెలువడడం
- దురద, మంట, అసౌకర్యం

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- జననావయాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- నెలసరి సమయంలో ప్యాడ్స్ పట్ల శుభ్రత పాటించాలి
- సర్జరీల తర్వాత ఇన్‌ఫెక్షన్లు సోకకుండా చూసుకోవాలి
- అసురక్షిత లైంగిక విధానాలకు దూరంగా ఉండాలి
- పోషకాహారంతో రక్తలేమిని తొలగించుకోవాలి
- వ్యాధినిరోధకశక్తి తగ్గకుండా చూసుకోవాలి
- మధుమేహాన్ని మందులతో అదుపులో పెట్టుకోవాలి

కారణాలు ఇవే!

దుర్వాసనతో కూడిన అసహజమైన తెల్లబట్టకు వేర్వేరు కారణాలుంటాయి. పలు రకాల ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు, లైంగిక వ్యాధులు, రక్తలేమితో వ్యాధినిరోధకశక్తి తగ్గడం.. ఈ సందర్భాల్లో దుర్వాసనతో కూడిన వైట్ డిశ్చార్జ్ కనిపిస్తుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే ఫెలోపియన్ ట్యూబ్స్ మూసుకుపోయి గర్భధారణ సమస్యలు తలెత్తవచ్చు. గర్భాశయ ముఖద్వారం దగ్గర పుండు ఏర్పడవచ్చు. ఈ పరిస్థితి దీర్ఘకాలంలో క్యాన్సర్‌గా మారవచ్చు. కాబట్టి తరచూ ఇన్‌ఫెక్షన్లతో కూడిన తెల్లబట్ట వేధిస్తున్నా, దుర్వాసన, రంగుతో కూడిన స్రావాలు కనిపిస్తున్నా, దురద, మంట వేధిస్తున్నా ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. రక్తపరీక్ష, శ్వాబ్ టెస్ట్‌తో ఇన్‌ఫెక్షన్ కారణాలను కనిపెట్టి వైద్యులు తగిన చికిత్సలను సూచిస్తారు. అలాగే క్యాన్సర్‌ను నిర్ధారించే పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవడం కూడా అవసరమే!

చికిత్స ఇలా...

ఇన్‌ఫెక్షన్ సంబంధిత తెల్లబట్టకు వైద్యులు ప్రారంభంలో నోటి మాత్రలు సూచిస్తారు. అవసరాన్ని బట్టి జననావయవం దగ్గర ఉపయోగించే మాత్రలు, జెల్స్‌ను కూడా వైద్యులు సూచిస్తారు. రక్తం తక్కువగా ఉన్నప్పుడు ఐరన్ మాత్రలు సూచిస్తారు. ఒకవేళ ఈ చికిత్సతో సమస్య అదుపులోకి రాకపోతే, గర్భాశయ ముఖద్వారం దగ్గర ఏర్పడిన పుండును మాన్పడం కోసం 'క్రయోథెరపీ'ని ఆశ్రయించాలి. దీంతో పుండు దగ్గరి వ్యాధికారక కణాలు చనిపోయి, కొత్త కణాలు వృద్ధి చెందు



తాయి. వైట్ డిశ్చార్జ్ వల్ల ఫెలోపియన్ ట్యూబులు పూర్తిగా మూసుకుపోయినప్పుడు, దెబ్బతిన్న ట్యూబును కత్తిరించి, కలపవలసి వస్తుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌గా మారితే, ఫెలోపియన్ ట్యూబ్స్‌తో పాటు గర్భాశయాన్ని తొలగించవలసి వస్తుంది. ఒకవేళ క్యాన్సర్ ఇతర అవయవాలకు పాకితే, కీమోథెరపీ, రేడియేషన్ కూడా అవసరమవుతుంది.

డాక్టర్ పి.నీలిమ, హెచ్ఒడి, అబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజీ, రెనోవా హాస్పిటల్స్, సనత్ నగర్, హైదరాబాద్.



అధ్యయనం



చికున్‌గున్యా ముప్పు

దీర్ఘకాలంలో భారతదేశం చికున్‌గున్యా ప్రభావానికి అధికంగా గురి కాక తప్పదనీ, ప్రతి ఏటా 51 లక్షల మంది భారతీయులు దోమల ద్వారా వ్యాపించే ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉందనీ బ్రిటిష్ మెడికల్ జర్నల్, గ్లోబల్ హెల్త్‌లో ప్రచురితమైన గ్లోబల్ మోడలింగ్ అధ్యయనం సూచిస్తోంది. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్‌కు చెందిన పరిశోధకులు చేపట్టిన అధ్యయనంలో దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావాలు ఆందోళన కలిగించేలా ఉంటున్నాయనీ, ఇప్పటికే చికున్‌గున్యా బారిన పడిన వారిలో 50 శాతం మంది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు ఆధారాల ద్వారా వెల్లడైందని వారు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 1.40 కోట్ల మంది ప్రజలు దీర్ఘకాలంలో చికున్ గున్యా బారిన పడే ముప్పును ఎదుర్కోబోతున్నట్టు ఈ అధ్యయనం అంచనా వేసింది. చికున్‌గున్యాకు సంబంధించి ఇప్పటివరకూ అందుబాటులో ఉన్న డాటాను. చికున్‌గున్యా సోకే అవకాశాలను పెంచే అంశాలతో జోడించడం ద్వారా ఈ వ్యాధి భారాన్ని అంచనా వేసిన మొట్టమొదటి అధ్యయనమిది. ఈ అధ్యయనంలో సమర్పించిన అంచనాలు ప్రాంతాల ప్రాధాన్యతకూ, పదేళ్లలోపు పిల్లలు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు లక్ష్యంగా వ్యాక్సీన్ అభివృద్ధికి తోడ్పడతాయని పరిశోధక బృందం భావిస్తోంది.

ఆరోగ్య కషాయాలు

చిన్నపాటి రుగ్మతలకు ఔషధాల మీద ఆధారపడకుండా కషాయాలను ఎంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. వేర్వేరు ఆరోగ్య సమస్యలకు సేవించదగిన వేర్వేరు కషాయాలు ఇవే!

ఆయుర్వేదం



త్రిఫల కషాయం

ఇక టీస్పూను త్రిఫల చూర్ణాన్ని రెండు కప్పుల నీళ్లకు జోడించి, ఆ నీళ్లు ఒక కప్పుకు తగ్గిపోయేవరకూ మరిగించాలి. ఈ కషాయం శరీరంలోని విషాలను హరించి, జీర్ణ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది.

సొంఠి కషాయం

సొంఠి, చిటికెడు బెల్లం, మిరియాల పొడి.. వీటిని గ్లాసు నీళ్లలో కలిపి మరిగించి తాగాలి. దీంతో అజీర్తి, వాంతులు తగ్గుతాయి

ఉసిరి, తేనె

తాజా ఉసిరి రసం, గోరువెచ్చని నీరు, ఒక స్పూను తేనెలను కలిపి తీసుకుంటే జీర్ణశక్తి మెరుగు పడుతుంది. అసిడిటీ అదుపులోకొస్తుంది. ఆకలి పెరుగుతుంది

వాము, ఇంగువ నీరు

వాము, చిటికెడు ఇంగువ గ్లాసు నీళ్లలో కలిపి మరిగించి తాగాలి. ఇలా చేస్తే, కడుపుబ్బరం తగ్గుతుంది. పొట్ట శుభ్రపడుతుంది.

ఐ కేర్



కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల తెరలతో కళ్లకు హాని జరుగుతుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఈ హాని నుంచి కళ్లను కాపాడుకోవడం కోసం ఎలాంటి కళ్లజోళ్లను వాడుకోవాలో తెలుసుకుందాం!

ఈ జోడుతో కళ్లకు రక్ష

తెరలు వెలువరించే నీలి రంగు నేరుగా కళ్లకు సోకడం హానికరం. కాబట్టి దాన్ని వడగట్టే పైపూత కలిగిన కళ్లజోళ్లను ఎంచుకోవాలి. సాధారణంగా ప్రతి కళ్లజోడులో ప్రకాశవంతమైన కాంతిని అడ్డుకునే 'యాంటీ రిఫ్లెక్షన్ కోటింగ్' ఉంటుంది. దీంతో కాంతి అద్దానికి తగిలి ప్రతిఫలించడం మూలంగా కళ్ల మీద ప్రభావం తగ్గుతుంది. దీనికి అదనంగా లెన్స్‌ను శుభ్రంగా ఉంచే 'యాంటీ స్మడ్జ్' పైపూతతో పాటు, 'బ్లూ లైట్ బ్లాకింగ్' పైపూత కూడా వేయించుకోవాలి.

డిజిటల్ లెన్స్‌తో...

కంప్యూటర్, ఫోన్ల వాడకంతో కళ్ల మీద ఒత్తిడి పడకుండా చేసే డిజిటల్ లెన్స్ కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి.
వీటిలో అంతర్గతంగా నిర్మితమయ్యే అకామడేషన్ ఏర్పాటు వల్ల, సాధారణ లెన్స్‌తో పోలిస్తే, ఈ డిజిటల్ లెన్స్ చూపులో మరింత స్పష్టతను అందించగలుగుతాయి. మరీ ముఖ్యంగా డిజిటల్ యాంటీ ఫెటీగ్ లెన్స్‌లు దగ్గరి పరిధికి పరిమితమై ఎక్కువ సమయాల పాటు పని చేసే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

లెన్స్ శుభ్రంగా...

లెన్స్ శుభ్రం చేసేటప్పుడు, ఆ మరకలు అద్దం మొత్తానికీ వ్యాపిస్తూ లెన్స్‌ను మరింత మసకబారుస్తూ ఉంటాయి. ఇలా జరగకుండా ఉండడం కోసం ఒక ప్రయత్నంలోనే లెన్స్‌ను శుభ్రపరచుకోడానికి సహాయపడే 'యాంటీ స్టాటిక్' లేదా 'హైడ్రోఫోబిక్ కోటింగ్' అనే పైపూతలు కూడా అందుబాటులో ఉన్నాయి.

పెరుగుతున్న మయోపియా

పిల్లల్లో మయోపియా పెరుగుతోంది. అందుకు వాళ్లు అనుసరిస్తున్న జీవనశైలే ప్రధాన కారణం. మొబైల్ ఫోన్ల వాడకం పిల్లల్లో పెరుగుతూ ఉండడంతో వాళ్ల కంటి మైనస్ పవర్ కూడా పెరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే 2050 నాటికి 50 శాతం మంది పిల్లలు మయోపియాకు గురవుతారని ఒక అంచనా!
అయితే ఈ సమస్య ఉన్న పిల్లలు కంటికి దగ్గరగా ఉన్నవి స్పష్టంగా కనిపించే మయోపియా కళ్లజోడునే ఇప్పటివరకూ ఉపయోగించుకుంటూ ఉన్నారు. అయితే ఆ సౌలభ్యంతో పాటు, ఉన్న మయోపియా మరింత పెరగకుండా నియంత్రించే కళ్లజోళ్లు కూడా ఇప్పుడు అందబాటులో కొచ్చాయి.

కళ్లు అలసిపోకుండా...

కంప్యూటర్ల ముందు ఏకాగ్రతతో పని చేసే సమయంలో తరచూ కనురెప్ప వేయడం మర్చిపోతూ ఉంటాం. దాంతో కళ్లు పొడిబారిపోవడం, కళ్ల మంటలు, కళ్లు ఎర్రబడడం, నీరు కారడం లాంటి సమస్యలు వేధిస్తాయి. ఇలా జరగకుండా ఉండాలంటే తప్పనిసరిగా 20:20:20 నియమం పాటించాలి. ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలోని వస్తువును చూడాలి.

సందీప్ రెడ్డి పడమటి, ఆప్టొమెట్రిస్ట్, కన్సల్టెంట్, ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.



బిడ్డల రక్షణ

కంగారూ కేర్‌తో మెదడు ఎదుగుదల

ప్రసవం తదనంతరం పసికందుకు తల్లి ఎంత దగ్గరగా ఉంటే అంత మెరుగ్గా బిడ్డ మెదడు ఎదుగుతుందని తాజా పరిశోధనలో తేలింది. కంగారూ కేర్‌లో భాగంగా, తరచూ బిడ్డను శరీరానికి హత్తుకోవడం వల్ల, నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో మెదడు ఎదుగుదల సమస్యలు సర్దుకుంటాయని పరిశోధకులు అంటున్నారు.

32 వారాలకంటే ముందే పుట్టిన పిల్లల్లో ఎదుగుదల లోపాలుంటాయి. ఎదిగే క్రమంలో ఇవి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడతాయి. అయితే ఈ లోపాలను సరిదిద్దే ఒక తాజా ఉపాయాన్ని పరిశోధకులు ఒక ప్రయోగం ద్వారా కనిపెట్టారు.



ఇందుకోసం 88 మంది నెలలు నిండకుండా పుట్టిన పిల్లల విషయంలో స్కిన్ టు స్కిన్ కాంటాక్ట్ లేదా కంగారూ కేర్ పద్ధతిని అనుసరించారు. దీన్లో భాగంగా రెండు నెలల పాటు రోజు మొత్తంలో కనీసం 24 నిమిషాల నుంచి 70 నిమిషాల పాటు పసికందులను తల్లికి చేరువగా ఉంచారు. ఆ తర్వాత పిల్లల మెదళ్లకు ఎమ్మారై స్కాన్ చేసినప్పుడు, ఇలాంటి పద్ధతి ఫలితంగా పిల్లల మెదళ్లలోని... ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, భావోద్వేగ నియంత్రణలకు సంబంధించిన పాత్‌వేస్ మార్పులు జరగడాన్ని పరిశోధకులు గమనించారు.

ఇలా మనసు దిటవు

జీవితంలో ఎన్నో హఠాత్పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. అలాంటి ఊహించని సందర్భాన్ని, ఎదుర్కొని, మనసును కుదుటపరుచుకుని, జీవితంలో ముందుకు సాగే ఆత్మస్థయిర్యం అందరికీ ఉండకపోవచ్చు. అలాంటప్పుడు ఆ విపత్కర పరిస్థితుల్లో ఎలా నడుచుకోవాలో తెలుసుకుందాం!



సమస్యలు చెప్పి రావు. ఒక్కోసారి అందుకు సంసిద్ధమయ్యే సమయం కూడా చిక్కకపోవచ్చు. ఊహించని సమయంలో అకస్మాత్తుగా తలెత్తే జీవిత సమస్యలు ఎంతటివారినైనా అతలాకుతలం చేసేస్తాయి. హఠాత్తుగా రాత్రికి రాత్రే కుటుంబ పెద్ద గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవచ్చు. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధి బయల్పడవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఒక్కసారిగా కుదేలైపోతూ ఉంటాం. కానీ కాలాన్ని వెనక్కి మళ్లించలేకపోయినా, ఆ పరిస్థితితో ఎలా నడుచుకోవాలో, మనసును ఎలా దిటవు చేసుకోవాలో తెలుసుకోవాలి. సమిష్టిగా సమస్యతో పోరాడే ఆత్మస్థైర్యాన్ని కుటుంబం కూడగట్టుకోవాలి.

ధైర్యం నూరిపోస్తూ... ధైర్యంగా ఉంటూ...

కుటుంబంలో ఒకరికి తీవ్ర అనారోగ్యం సోకితే మిగతా కుటుంబ సభ్యులు ఎంతో వేదనకు లోనవుతారు. మరీ ముఖ్యంగా పెద్దలు ఓ పక్క బాధను దిగమింగుకుంటూనే, మిగతా కుటుంబసభ్యులను ఓదార్చవలసి వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో బెంబేలు పడిపోకుండా, అనారోగ్యానికి గురైన వ్యక్తులను భరోసా కల్పించాలి. వ్యాధికి సంబంధించిన లోతైన అవగాహనను ఏర్పరుచుకుంటూ, అందుబాటులోకొచ్చిన విజయవంతమైన చికిత్సల గురించి, కోలుకున్న వ్యక్తుల విజయగాధల గురించి రోగికి వివరిస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి. రోగి పట్ల జాలి కనబరచడం, విషాదకరమైన వృత్తాంతాలను గుర్తు చేసుకోవడం, చికిత్సకయ్యే ఖర్చుల గురించి, ఆర్థిక ఇబ్బందుల గురించి రోగి ముందే చర్చించడం లాంటివి చేయకూడదు. రోగిని తన గదికే పరిమితం చేయకుండా కుటుంబ వ్యవహారాల్లో జోక్యం కల్పిస్తూ ఉండాలి. వారికి నచ్చిన వ్యక్తులను ఇంటికి పిలిపిస్తూ, నచ్చిన పనులు చేయిస్తూ కాలక్షేపాన్ని అందించాలి. కుంగుబాటులోకి కూరుకుపోతున్నారేమోనని గమనిస్తూ ఉండాలి. వారి అభిరుచులకు సంబంధించిన వీడియోలు, సినిమాలు చూపించాలి. అవసరమనుకుంటే కౌన్సెలింగ్ థెరపిస్ట్‌ను ఇంటికి పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించాలి. రోగితో వ్యవహరించవలసిన తీరు గురించి కౌన్సెలర్‌ను అడిగి తెలుసుకోవాలి.

భాగస్వామిని కోల్పోతే...

గుండెపోటుతో అకస్మాత్తుగా భాగస్వామిని కోల్పోయినప్పుడు ఒక్కసారిగా చుట్టూ ఉన్న ప్రపంచమంతా కుప్పకూలిపోతుంది. జీవితంలో శూన్యం ఆవహిస్తుంది. నిజానికి ఈ దుస్థితిని ఎదుర్కొన్న ఎవరికైనా ఈ లోటు పూడ్చలేనిదే! అయినా ఆ పరిస్థితిని అంగీకరించే ఆత్మనిబ్బరాన్ని పెంపొందించుకోవాలి. జరిగిపోయినదాన్ని సరిదిద్దలేమనే విషయాన్ని మొదట అర్థం చేసుకుని, మున్ముందు జరగబోయే పనుల గురించి ఆలోచించాలి. భాగస్వామి లేని లోటును భర్తీ చేసే బాధ్యత తమ మీద ఉందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఈ కష్టం నాకే రావాలా? నాకే ఇలా ఎందుకు జరిగింది? అనుకుంటూ కుంగుబాటుకు లోనవడం సరికాదు. మనకంటే ఎక్కువ కష్టాలను ఎదుర్కొనే వాళ్లు కూడా ఉంటారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. పిల్లలకు మనోధైర్యాన్ని నూరిపోస్తూ, మనోనిబ్బరంతో మసలుకోవడం అలవాటు చేసుకోవాలి. భాగస్వామిని కోల్పోయిన వేదన కొన్ని రోజుల పాటు వేధించవచ్చు. నిద్ర కరవవవచ్చు. నీరసించిపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో వైద్యుల సహాయం తీసుకోవాలి. నెలల తరబడి కుంగుబాటు వేధిస్తే మానసిక వైద్యులను ఆశ్రయించాలి. వీలైనంత త్వరగా జీవితాన్ని తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేయాలి. మనసు దిగులులో కూరుకుపోకుండా పనులు కల్పించుకోవాలి. గతాన్నే గుర్తు చేసుకునే ధోరణికి స్వస్థి చెప్పాలి. పాత జ్ఞాపకాలు పదే పదే వేధిస్తుంటే, స్థల మార్పిడి కొంత మేరకు సహాయపడుతుంది.

డాక్టర్ పి.రాధిక, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, విజయవాడ



అది న్యాయవ్యవస్థ పవిత్రతపై దాడి

» సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించిన సీఎం, డిప్యూటీ సీఎం

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. నాగరిక, ప్రజాస్వామిక సమాజంలో అలాంటి చర్యలకు ఆస్కారం లేదని సీఎం పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేస్తూ... 'సీజేఐపై దాడికి చేసిన ప్రయత్నాన్ని బేషరతుగా ఖండిస్తున్నాం. ఇది ధర్మాన్ని ఉల్లంఘించడమే. హింసకు తావు లేదు' అని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా జస్టిస్ గవాయ్‌పై దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కూడా హిందూ దేవుళ్లపై సీజేఐ చేసిన వ్యాఖ్యలను సహించలేని సనాతనవాది పిచ్చి పరాకాష్ఠకు చేరిందన్నారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖండించిన బార్ కౌన్సిల్, న్యాయవాదుల సంఘం, ఐలు, ఐఏఎల్

జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించడాన్ని ఏపీ బార్ కౌన్సిల్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఖండించింది. ఈ మేరకు ఏపీబార్ కౌన్సిల్ అధ్యక్షుడు నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం సోమవారం వేర్వేరుగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఈ ఘటనను ఖండించాయి. ఈ మేరకు ఐలు ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, అధ్యక్షుడు కె.కుమార్, ఐఏఎల్ జాతీయ కార్యదర్శి, బార్ కౌన్సిల్ సభ్యుడు అజయ్ కుమార్ వేర్వేరుగా పత్రికా పకటనలు విడుదల చేశారు.

డీఎస్సీ అభ్యర్థుల నిరసన

» సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచి ఉద్యోగాలు ఇవ్వలేదని ఆవేదన

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): "డీఎస్సీ-2025 ఉత్తీర్ణులైన మమ్మల్ని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. కానీ, ఉద్యోగాలు మాత్రం ఇవ్వలేదు" అని పలువురు డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి సచివాలయం గేటు బయట సోమవారం వారంతా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఒక ఉద్యోగానికి.. ఒక అభ్యర్థి (1:1) విధానంలో తమను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారని.. ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాల్ లెటర్లు పంపిన తర్వాత సెలక్షన్ లిస్టులో తమ పేర్లు లేవని, రోస్టర్ పాయింట్ల పేరుతో అవకతవకలు జరిగాయని అభ్యర్థులు ఆరోపించారు. మంత్రి లోకేశ్ తమకు న్యాయం చేయాలని కోరుతున్నామని చెప్పారు.

దీపం-ఉజ్వల జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉజ్వల యోజన, 'దీపం-2' పథకాల అమలు తీరును పర్యవేక్షించడానికి ప్రభుత్వం జిల్లాస్థాయి దీపం-ఉజ్వల కమిటీ(డీడీయూసీ)లను ఏర్పాటు చేసింది. కమిటీకి జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) లేదా ఆయన సూచించిన సీనియర్ అధికారి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ఆ జిల్లాకు కేటాయించిన ప్రతినిధి మెంబరు కో-ఆర్డినేటర్‌గా ఉంటారు. ఇతర ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల (ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, మహారత్న ప్రభుత్వ రంగ సంస్థల)కు చెందిన అధికారులు, జిల్లా ఆహార,పౌరసరఫరాల అధికారి, అనధికారులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు పౌరసరఫరాల కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫిషియో సెక్రటరీ సౌరభ్‌గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పరిశ్రమలకు ప్రోత్సాహకాలు విడుదల చేయాలి: ఏపీ చాంబర్స్

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య(ఏపీ చాంబర్స్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముందు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి ఈనెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను విడుదల చేయాలని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

తప్పుడు ప్రచారమే వైసీపీ అజెండా: ఆలపాటి

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు వైద్య కళాశాలల అంశంపై వాస్తవాలను వక్రీకరించి అబద్ధాలతో ప్రజల్ని మభ్యపెడుతున్నారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'వైసీపీ నేతలు 17 వైద్య కళాశాలలు నిర్మించామని, అవన్నీ సజావుగా నడుస్తున్నాయని అంటున్నారు. ఎక్కడ నడుస్తున్నాయో ప్రజలకు ఎందుకు చూపించడం లేదు?' అని ప్రశ్నించారు.

కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ భూమన: బుచ్చిరాం ప్రసాద్

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి అని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'భూమన తన జీవితాన్ని జిరాక్స్ షాపుతో ప్రారంభించారు. నేడు రూ.వేల కోట్లు ఎలా సంపాదించారు? స్వర్ణముఖి నదిలో 11 ఎకరాలు కబ్జా చేశారు. టీడీఆర్ బాండ్ల స్కాంలో భూమన పాత్ర ఉంది' అని అన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్రాలకే నష్టం: రాఘవులు

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 'కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల అన్ని రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఈ నష్టాలను భర్తీ చేయడానికి ఆయా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలి' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల వల్ల కొందరికి లాభం చేకూరితే.. మరికొందరికి నష్టం వాటిల్లిందని అన్నారు.

ఏపీలో పర్యటించనున్న రష్యా మాజీ వ్యోమగామి

రష్యన్ మాజీ వ్యోమగామి (కాస్మోనాట్), ఇంజనీరింగ్ నిపుణుడు, 'హీరో ఆఫ్ ద రష్యన్ ఫెడరేషన్' డెనిస్ మత్వీవ్ త్వరలో ఏపీలో పర్యటించనున్నట్లు సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సీఈవో వెంకటేశ్వర్లు కేశినేని తెలిపారు.



శత్రు సబ్‌మెరైన్లను పసిగట్టే ఆంద్రోత్

విశాఖపట్నం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళంలో మరో అత్యాధునిక యుద్ధ నౌకచేరింది. తీర ప్రాంతానికి సమీపంలోని సముద్ర జలాల్లో మాటువేసిన శత్రుదేశాల జలాంతర్గాముల(సబ్‌మెరైన్)ను పసిగట్టే సామర్థ్యం కలిగిన ఐఎన్ఎస్ ఆంద్రోత్ విశాఖ తీరంలో జలప్రవేశం చేసింది. విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్‌లో సోమవారం తూర్పు నౌకాదళం వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్ ఈ నౌకను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. 'ఆంద్రోత్' చేరికతో నౌకాదళం శక్తి, సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. ఈ నౌక తయారీకి కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్ అండ్ ఇంజనీర్స్(జీఆర్ఎస్ఈ)కు చెందిన ఇంజనీర్లు, డిజైనర్స్ కృషి చేశారని పెందార్కర్ ప్రశంసించారు. నేవీలో చేరిన రెండో యాంటీ సబ్‌మెరైన్ వాటర్‌ఫేర్ షాలో వాటర్‌క్రాఫ్ట్‌గా ఆంద్రోత్ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి జీఆర్ఎస్ఈ చీఫ్ పీఆర్ హరి పాల్గొన్నారు.

నౌకా నిర్మాణంలో టాప్-5కి భారత్: కేంద్ర మంత్రి సర్బానంద

విశాఖపట్నం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నౌకా నిర్మాణ రంగంలో భారత్‌ను టాప్-5 దేశాల్లో ఒకటిగా నిలబెట్టాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌సీఐ).. కొరియా నుంచి కొనుగోలు చేసిన మొట్టమొదటి వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్(వీఎల్‌జీసీ) నౌక శివాలిక్.. అబుదాబీ నుంచి లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ)ను విశాఖపట్నం పోర్టుకు తీసుకువచ్చింది. సోమవారం ఆ నౌకకు సోనోవాల్ జెండా ఊపి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నౌకపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పెట్రోలియం, గ్యాస్ ఆధారిత ఉత్పత్తుల రవాణా కోసం ఇన్నాళ్లు విదేశీ నౌకలపై ఆధారపడుతూ వచ్చామని, ఇకపై సొంతంగానే నిర్మించనున్నామని చెప్పారు. శివాలిక్ వంటి వీఎల్‌జీసీ నౌకలను ఆత్మనిర్భర్ భారత్ కింద దేశీయంగానే తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... ఈ తరహా కార్యక్రమాల ద్వారా దేశంలో ప్రతి ఇంటికీ గ్యాస్ సరఫరా పథకం సాధ్యమవుతుందన్నారు. విశాఖపట్నం పోర్టు ఇన్‌చార్జి చైర్మన్ అంగముత్తు మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వంతో కలిసి విశాఖను ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు.

మల్లోజుల లొంగుబాట!

» మావోయిస్టు పార్టీని వీడేందుకు సిద్ధమైన పొలిట్ బ్యూరో సభ్యుడు?

» పోలీసులతో ఇప్పటికే సంప్రదింపులు?

» తాజాగా మల్లోజుల మరో లేఖ విడుదల

హైదరాబాద్/చర్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోను.. పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన మల్లోజుల.. ఇటీవలి కాలంలో పార్టీ తీరుపై ధిక్కార స్వరం వినిపిస్తుండటం, పార్టీ విధానాలను తప్పుబడుతుండడమే దీనికి నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొద్దిరోజుల క్రితం అభయ్ పేరుతో.. సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు లేఖ విడుదల కావడం తెలిసిందే. ఈ లేఖ సంచలనం సృష్టించింది. తాజాగా మల్లోజుల వేణుగోపాల్ పేరుతో మరో లేఖ విడుదలైంది. పార్టీ తప్పిదమే సాయుధ పోరాటాన్ని దెబ్బతీసిందని పేర్కొంటూ 26 పేజీల లేఖను ఆయన విడుదల చేశారు. కాగా, అభయ్ పేరుతో గతంలో విడుదలైన లేఖపై మావోయిస్టు పార్టీ అప్పుడే స్పందించింది. అభయ్ ప్రకటన ఆయన వ్యక్తిగతమని, దాంతో పార్టీకి సంబంధం లేదని పేర్కొంది. అదే సమయంలో ఇద్దరు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పోలీసుల ఎదురు కాల్పుల్లో మరణించారు. ఈ నేపథ్యంలో అభయ్ లొంగిపోయేందుకు పోలీసులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు పార్టీ అనుమానిస్తోంది. మరోవైపు కీలక నేతలను బయటకు రప్పించేందుకు పోలీసులు ఆడుతున్న నాటకంలో భాగమనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే మల్లోజుల గానీ, మావోయిస్టు పార్టీ ఇతర కీలక నేతలు గానీ ఎవరూ తమ అదుపులో లేరని తెలంగాణ పోలీసులు అంటున్నారు.

కేంద్రం గడువు సమీపిస్తుండడంతో..

వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి మావోయిస్టు పార్టీని తుదముట్టిస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అందుకు తగ్గట్లుగానే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో బలగాలు మోహరించి గాలింపు కొనసాగిస్తున్నాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పుల్లో పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున ప్రాణాలు కోల్పోతున్నారు. కీలక నేతలు సైతం నేలకొరుగుతున్నారు. ఈ నేపథ్యంలో పరిస్థితుల్ని అంచనా వేస్తున్న పార్టీ క్యాడర్, కీలక నేతలు లొంగుబాటు బాట పట్టారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర కమిటీ సభ్యులతోపాటు వందల సంఖ్యలో క్యాడర్ పార్టీని వీడి పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. కేంద్రం విధించిన గడువు సమీపిస్తుండడంతో.. మల్లోజుల సైతం త్వరలోనే లొంగిపోయే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితమే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా మరో కేంద్ర కమిటీ సభ్యుడు వైభవ్‌తోపాటు మరొకరు లొంగిపోయినట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. అయితే ఈ అంశంపై పోలీసులు ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు.

పార్టీ తప్పిదమే సాయుధ పోరాటాన్ని దెబ్బతీసింది: మల్లోజుల

పార్టీ తప్పిదమే సాయుధ పోరాటాన్ని తెబ్బతీసిందని, అందుకే పార్టీ క్యాడర్‌ను కోల్పోయిందని మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజులు వేణుగోపాల్ పేర్కొన్నారు. తాజాగా ఓ లేఖను విడుదల చేశారు. అయితే ఆ లేఖపై ఆగస్టు నెల అని రాసి ఉంది. 26 పేజీలున్న లేఖలో పార్టీ చేసిన తప్పిదాలు, ప్రస్తుత పరిస్థితులను వివరించారు. ఈ లేఖ చదివి కామ్రేడ్‌లతో చర్చిస్తారని ఆశిస్తున్నానన్నారు. సుదీర్ఘ ఉద్యమంలో పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ చేసిన తప్పిదాలే ఉద్యమ పోరాటాన్ని దెబ్బతీశాయన్నారు. కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో 28 ఏళ్లుగా పని చేస్తూ ఇంతటి నష్టాలు, బలిదానాలు కావడానికి తాను కూడా ఓ కారణమేనని, అందుకే తన బాధ్యతల నుంచి తప్పుకొంటున్నానని తెలిపారు. ఉద్యమంలో పార్టీ అనేక విజయాలు సాధించిందని కానీ..నిలబెట్టుకోలేక పోయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయని, శత్రువులు బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పరుచుకున్నారని, ఎక్కడికి వెళ్లినా వెంటనే సమాచారం వెళ్లిపోతోందని, దాడులు కూడా జరుగుతున్నాయని మల్లోజుల వివరించారు. దీనిని బట్టి రహస్య పార్టీ నిర్మాణం, విప్లవ నిర్మాణం, ప్రజల మధ్య ఆర్గనైజేషన్ టీం వల్ల జరగదని అర్థమైపోయిందన్నారు. జరిగిన తప్పిదాలపై మాట్లాడితే కమిటీ ఎద్దేవా చేసిందన్నారు.

రాష్ట్రంలో 30 పత్తి కొనుగోలు కేంద్రాలు

» ఏర్పాటుకు చర్యలు చేపట్టిన సీసీఐ

» సీసీఐ, జిన్నర్ల మధ్య కుదిరిన సయోధ్య

గుంటూరు సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 30 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిన్నర్ల నుంచి తాజాగా మరోమారు టెండర్లు ఆహ్వానించింది. అక్టోబరు 10న టెండర్లు దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించింది. గత రెండు నెలలుగా సీసీఐ, జిన్నర్లకు (పత్తి మిల్లుల యజమానులు) మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోవడంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సూచనతో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత సీసీఐ, జిన్నర్ల మధ్య ఏర్పడిన వివాద పరిష్కారానికి తీవ్రంగా ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాతో ఏపీ కాటన్ టీఎంసీ కన్సార్టియం అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్, కార్యదర్శి హెచ్. వెంకట్రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి మన్నవ హరినాథ్ బాబు మరోసారి వర్చువల్‌గా కూడా చర్చలు జరిపారు. ఆయన హామీతో సంతృప్తి చెందిన జిన్నర్లు టెండర్ల ప్రక్రియలో పాల్గొనాలని నిశ్చయించుకున్నారు. సోమవారం కొందరు టెండర్లు దాఖలు చేసినట్లు సమాచారం.

సీఎం యాప్ ద్వారానే కొనుగోళ్లు చేయాలి

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలో ఇప్పటివరకు సీఎం యాప్ వినియోగిస్తున్నారు. ఈ యాప్ అందుబాటులోకొచ్చిన తర్వాత కొనుగోలు వ్యవహారంలో దళారులు, వ్యాపారులకు అడ్డుకట్ట పడింది. అయితే ఈ ఏడాది నుంచి అన్ని రాష్ట్రాల్లో కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తామని సీసీఐ టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. రైతులు మాత్రం సీఎం యాప్ ద్వారా కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 మధ్య మాత్రమే ఉండాలని సీసీఐ విధించిన నిబంధన కూడా రైతులకు నష్టం కలిగించేదేనని అంటున్నారు.

టమాటా రైతుల్ని ఆదుకుంటాం: అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): టమాటా రైతుల్ని ఆదుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. టమాటా ధర పడిపోయిన నేపథ్యంలో సోమవారం మంత్రి ఒక ప్రకటన చేశారు. 'ఆదివారం రాప్తాడు మార్కెట్‌లో టమాటా కిలో గరిష్ఠంగా రూ.18, కనిష్ఠంగా రూ.9, సగటున రూ.12 పలికింది. ట్రేండింగ్‌ను బట్టి రైతులకు మంచి ధర లభిస్తుంది. పత్తికొండ మార్కెట్‌కు 30-40టన్నుల సరుకు వస్తుంది. దసరా సెలవుల కారణంగా 10 టన్నులు అదనంగా వచ్చింది. రోడ్లపై 2వ రకం టమాటాలు పడేసి, గందరగోళం సృష్టించారు. ఇప్పటివరకు 10 టన్నుల టమాటాలు వివిధ రైతుబజార్లకు పంపాం. సోమవారం పత్తికొండ మార్కెట్ నుంచి 10 టన్నులు చిత్తూరు ప్రాసెసింగ్ యూనిట్లకు, 15 టన్నులు రైతుబజార్లకు పంపించాం. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో టమాటా అమ్మకాలు మందగించాయి. అందువల్ల ఎగుమతులకు ఆటంకం ఏర్పడింది. టమాటా రైతుల్నీ ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ పెండింగ్ నిధులు ఇవ్వండి

» జ్యోతిబా స్కూళ్ల అభివృద్ధికి సహకరించండి

» కేంద్ర మంత్రి అథవాలేకు మంత్రులు డోలా, సవిత విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రావాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ నిధులను విడుదల చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖల సహాయ మంత్రి రాందాస్ అథవాలేను సోమవారం విజయవాడలోని ఓ హోటల్‌లో మంత్రి డోలా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ నిధులు రూ.34 కోట్లు విడుదల చేయాలని, అంబేడ్కర్ విదేశీ విద్యా పథకానికి కేంద్రం 50 శాతం సబ్సిడీ నిధులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థులకు నూరుశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించామని మంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. నెల రోజుల్లో అట్రాసిటీ పెండింగ్ నిధులు విడుదల చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, అన్ని అంశాలకూ సానుకూలత తెలిపారని మంత్రి డోలా తెలిపారు. రాష్ట్రానికి అన్ని విధాలా సహకరిస్తున్న మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి మంత్రి డోలా కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత కూడా కేంద్ర మంత్రి అథవాలేను కలిసి రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మహాత్మా జ్యోతిరావు స్కూళ్ల అభివృద్ధికి రూ.66 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఆమె విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.





కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, అథవాలేను నిధులు కోరుతున్న మంత్రి సవిత

భవిష్యత్తులోనూ ఎన్డీఏతోనే ఆర్పీఐ: రాందాస్

మంగళగిరి సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్పీఐ) భవిష్యత్తులోనూ ఎన్డీఏతో కలిసి పనిచేస్తుందని కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే స్పష్టం చేశారు. మంగళగిరి రాయల్ కన్వెన్షన్‌లో సోమవారం జరిగిన ఉచిత వినికిడి మిషన్ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అథవాలే మాట్లాడుతూ ఏపీలో ఆర్పీఐ బలమైన శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కూటమి విధానాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని, రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం ద్వారా 18 రకాల వృత్తుల వారికి ఆర్థిక, సామాజిక భద్రత ఏర్పడుతుందన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కూటమి ఐక్యత కారణంగా రాష్ట్రంలో అవినీతిపరుడైన జగన్‌ను ఓడించగలిగామని, ఇదే ఐక్యతను కొనసాగించి 2029 ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేద్దామని ఆకాంక్షించారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్

16న కర్నూలులో భారీ బహిరంగ సభ

» జీఎస్టీ-2.0పై దేశంలోనే తొలిసారి నిర్వహణ

» ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు హాజరు: మంత్రి పయ్యావుల వెల్లడి

» కర్నూలులో సభ ఏర్పాట్లు పరిశీలించిన బృందం

కర్నూలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల దేశంలో సామాన్యులపై రూ.2 లక్షల కోట్ల భారం తగ్గిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట జీఎస్టీపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ నెల 16న కర్నూలులో 3 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహా కూటమి పార్టీల జాతీయ, రాష్ట్ర నేతలు హాజరుకానున్నారు. అదేవిధంగా జీఎస్టీ-2.0 ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో దేశంలోనే తొలి భారీ బహిరంగ సభకు కర్నూలు నుంచే శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు.. ఈ సభను దిగ్విజయం చేసేందుకు మంత్రులు టీజీ భరత్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్థన్‌రెడ్డి, ప్రధానమంత్రి కార్యక్రమాల స్పెషల్ కో-ఆర్డినేటర్ వీరపాండియన్‌లతో కూడిన బృందం సోమవారం కర్నూలులో పర్యటించి సభ నిర్వహించే స్థలం, ఏర్పాట్లను పరిశీలించింది. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. "జీఎస్టీ-2.0 సంస్కరణలపై దేశంలోనే తొలిసారిగా కర్నూలులో నిర్వహించే సభకు ప్రధాని హాజరు కానున్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతున్నాయి" అని వివరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ నాగరాజు, ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, బీద రవిచంద్ర పాల్గొన్నారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

యాక్షన్ కార్తీక్



నాగశౌర్య కథానాయకుడిగా రామ్ దేశినా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'. శ్రీనివాసరావు చింతపూడి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, పాటలు ఆకట్టుకున్నాయి. సోమవారం నాగశౌర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో పూర్తిస్థాయి యాక్షన్ అవతార్‌లో కనిపించారు నాగశౌర్య. సంభాషణలు, వినోదం, పోరాట ఘట్టాలు అలరించేలా ఉన్నాయి. త్వరలోనే సినిమా విడుదల కానుంది. ఈ చిత్రంలో సాయికుమార్, నరేశ్ వీకే, సముద్రఖని, వెన్నెలకిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, డీఓపీ: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జయరాజ్.

క్షేమంగా ఉన్నా



తన కారు ప్రమాదంపై విజయ్ దేవరకొండ స్పందించారు. తాను క్షేమంగా ఉన్నానని, ఇంటికి చేరుకున్నానని తెలిపారు. ఆందోళన చెందవద్దని అభిమానులకు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాగా, పుట్టపర్తి సత్యసాయి బాబా సమాధిని దర్శించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన సమయంలో విజయ్ కారుకు ప్రమాదం జరిగింది. జోగులాంబ గద్వాల్ జిల్లా సమీపంలో ఆయన కారును ఒక బొలేరో ఢీకొట్టడంతో కారు దెబ్బతింది. స్నేహితుడి కారులో ఆయన సురక్షితంగా హైదరాబాద్ చేరుకున్నారు.

అలంపూరు చౌరస్తా (ఆంధ్రజ్యోతి)

ఛాంపియన్ సిద్ధం




రోషన్ కథానాయకుడిగా జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న చిత్రం 'ఛాంపియన్'. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాను స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇటీవలె విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్‌కు మంచి ఆదరణ దక్కింది. సోమవారం సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. డిసెంబర్ 25న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది.



అక్కినేని నాగార్జున 100వ చిత్రం సోమవారం ప్రారంభమైంది. 'కింగ్ 100' అనేది వర్కింగ్ టైటిల్. భారీ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రానికి తమిళ దర్శకుడు, 'ఆకాశం' ఫేమ్ రా కార్తీక్ దర్శకుడు. 'లాటరీ కింగ్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

శక్తిమంతమైన లుక్



ధ్రువ సర్జా, ఐశ్వర్య అర్జున్ జంటగా అర్జున్ సర్జా స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'సీతా పయనం'. సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ధ్రువ సర్జా పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. త్వరలోనే సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఆయూబ్ ఖాన్, డీఓపీ: జి బాలమురుగన్, సంగీతం: అనూప్ రూబెన్స్.

సింగారి సిత్రాలు



ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు జంటగా నటిస్తున్న చిత్రం 'డ్యూడ్'. శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ నెల 17న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా చిత్రబృందం 'సింగారి' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా ఈ పాటను సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ స్వరపరిచి పాడారు. 'ప్రేమకథతో పాటు కుటుంబ భావోద్వేగాలు ప్రేక్షకులను అలరిస్తాయి. ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు నటన సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది. దర్శకుడు కథను మలిచిన తీరు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది, లవ్‌స్టోరీల్లో డ్యూడ్ చిత్రం ఒక సరికొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తుంది' అని మేకర్స్ తెలిపారు.

రోగనిరోధక వ్యవస్థపై పరిశోధనలు చేసిన
ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్




» అమెరికాకు చెందిన మేరీ బ్రన్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, జపాన్‌కు చెందిన సకగూచీకి సంయుక్తంగా ప్రకటన

స్టాక్‌హోం, అక్టోబరు 6: మన శరీరంలోకి చొరబడే హానికారక సూక్ష్మజీవులపై యుద్ధం ప్రకటించి, కాపుగాయాల్సిన రోగనిరోధక వ్యవస్థ.. మన అవయవాలపైనే దాడి చేయకుండా చేసే 'పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్'పై కీలక పరిశోధనలు చేసిన మేరీ ఈ బ్రన్‌కో (64), ఫ్రెడ్ రామ్స్‌డెల్ (64), సకగూచి(74)లను ఈ ఏటి వైద్య నోబెల్ వరించింది. వీరిలో బ్రన్‌కో, రామ్స్‌డెల్ అమెరికన్లు కాగా.. సకగూచి జపనీయుడు. బ్రన్‌కో.. సియాటెల్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయాలజీ'లో సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. రామ్స్‌డెల్.. శాన్‌ఫ్రాన్సిస్కోలోని 'సోనోమా బయోథెరప్యూటిక్స్'లో శాస్త్రీయ సలహాదారుగా పనిచేస్తున్నారు. ఇక.. సకగూచీ 'ఒసాకా యూనివర్సిటీ (జపాన్)'లోని ఇమ్యూనాలజీ ఫ్రాంటియర్ రిసెర్చ్ సెంటర్ గౌరవ ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రైజ్‌మనీ కింద ఇచ్చే 10.64 కోట్లను వీరు ముగ్గురూ సమానంగా పంచుకోనున్నారు. మన శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ పని తీరును తెలుసుకోవడానికి వారు చేసిన పరిశోధనలే కీలకమని నోబెల్ కమిటీ చైర్ ఒల్లె కాంపె కొనియాడారు.

ఏమిటీ పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్?

శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ వద్ద ఉన్న యోధులు.. టీ సెల్స్. అయితే, అవి కట్టు తప్పి మన శరీర అవయవాల మీదే దాడి చేయకుండా ఉండేందుకు ప్రాథమికంగా వాటికి మన ఛాతీపైభాగంలో బ్రెస్ట్ బోన్ (పక్కటెముకలను కలిపే మధ్య భాగం-స్టెమ్) కింద ఉండే థైమస్ గ్లాండ్ (శైశవ గ్రంథి)లో ప్రాథమిక శిక్షణ లభిస్తుంది. అయితే, కొన్ని టీ-సెల్స్ అక్కడ విపరీతంగా ప్రవర్తించడం ప్రారంభిస్తాయి. అవి బయటకు వస్తే.. మన అవయవాల మీదే దాడి చేసి రుమటాయిడ్ ఆర్థరైటిస్, సొరియాసిస్, లూపస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులు రావడానికి కారణమవుతాయి. అందుకే థైమస్‌లో 'సెంట్రల్ టోలరెన్స్' అనే వ్యవస్థ వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగించివేస్తుంది. కానీ, దాన్నీ తప్పించుకుని వచ్చిన టి-సెల్స్‌ను అదుపులో పెట్టేందుకు రోగనిరోధక వ్యవస్థలో ఇంకో ఏర్పాటు ఉంటుంది. అదే 'పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్'. ఈ వ్యవస్థ సీడీ4, సీడీ25, ఫాక్స్‌పీ3 వంటి ప్రత్యేక టి-సెల్స్ సాయంతో.. సదరు రోగ్ టి-సెల్స్‌ను అణచివేస్తాయి. అసలు ఇలాంటి వ్యవస్థ ఒకటి ఉందని కనుగొనడానికి ఆధారం ఈ ముగ్గురి పరిశోధనలే. సకగూచి 1995లో ఒక కొత్త టి-సెల్ ఉపవర్గాన్ని గుర్తించడంతో ఈ 'పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్' గురించి ప్రపంచానికి తెలియడం మొదలైంది. అప్పట్లో ఆయన గుర్తించిన టి-సెల్స్ ఉపవర్గాన్ని ఇప్పుడు రెగ్యులేటరీ టి-సెల్స్ లేదా టి-రెగ్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. వీటిని శాంతిదూతలు అనొచ్చు. అవసరానికి మించి పనిచేసే ఇమ్యూన్‌రెస్పాన్స్‌ను ఇవి అదుపులో పెడతాయి. సకగూచి వీటిని గుర్తించిన ఆరేళ్ల తర్వాత.. 2001లో బ్రన్‌కో, రామ్స్‌డెల్ ఫాక్స్‌పి3 జన్యువులో కలిగే ఉత్పరివర్తనాలే మానవుల్లో ఆటో ఇమ్యూన్ వ్యాధులకు కారణమని గుర్తించారు. ఆ తర్వాత రెండేళ్లకు.. 2003లో సకగూచి తన ఆవిష్కరణను, బ్రన్‌కో, రామ్స్‌డెల్ ఆవిష్కరణతో అనుసంధానం చేసి.. తాను గుర్తించిన టి-రెగ్స్ అభివృద్ధిని నియంత్రించే మాస్టర్ స్విచ్ 'ఫాక్స్‌పి3' జన్యువే అని నిరూపించారు. ఇది.. ఇమ్యూనాలజీ అనే కొత్త విధానానికి దారులు తెరిచింది. ఈ వివరాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులందరూ.. ఆటో ఇమ్యూన్ వ్యాధులను, క్యాన్సర్ వంటివాటిపై పోరాటానికి టి-రెగ్స్‌ను ఉపయోగించుకునే దిశగా పరిశోధనలు చేస్తున్నారు. కాగా.. 2025 సంవత్సరానికిగాను నోబెల్ పురస్కారాల ప్రకటన షురూ అయింది. మంగళవారం భౌతిక శాస్త్ర నోబెల్, బుధవారం రసాయన శాస్త్ర నోబెల్, గురువారం సాహిత్య నోబెల్ విజేతలను ప్రకటించనున్నారు. నోబెల్ శాంతి బహుమతి ఎవరికిచ్చేదీ శుక్రవారం, ఆర్థిక నోబెల్ విజేతను అక్టోబరు 13న (వచ్చే సోమవారం) ప్రకటించనున్నారు.

లోకం తీరు



ఎకరానికి 177 కోట్లు!

తెలంగాణ స్థిరాస్తి రంగ చరిత్రలో సరికొత్త రికార్డు

» 7.67 ఎకరాల భూమి రూ.1357 కోట్లు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వేలం బంగారమైంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మరోసారి రికార్డులు తిరగ రాసింది. ఓల్డ్ బాంబే హైవేకు, దుర్గం చెరువుకు మధ్య రాయదుర్గం ఐటీపార్క్‌లో భాగంగా ఉన్న కొండపై ఏడున్నర ఎకరాల భూమి రాష్ట్ర చరిత్రలోనే ఎరుగనంత రికార్డు స్థాయి ధరకు అమ్ముడు పోయింది.. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) నిర్వహించిన వేలంలో ఈ భూమి ఏకంగా ఎకరానికి రూ.177 కోట్లు పలికింది. మొత్తం 7.67 ఎకరాలకు రూ.1,357 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ వేలంతో తెలంగాణ భూమి విలువ కొత్త మైలురాయి నమోదుచేసింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2022లో నిర్వహించిన కోకాపేట్‌లోని నియోపోలిస్ వేలంలో ఎకరానికి రూ.100.75 కోట్ల ధర పలికింది. అప్పట్లో గండిపేట వ్యూతో ఆ భూమికి అంతధర పలికింది. ఇప్పుడు దుర్గంచెరువు వ్యూతో ఉండే ఈ భూమి ఆ రికార్డును చెరిపేసింది. 2017లో ఇదే రాయదుర్గం ప్రాంతంలో ఎకరానికి రూ.42.59 కోట్లకు పలకగా, ఎనిమిదేళ్లలో నాలుగు రెట్లు పెరగడం గమనార్హం. టీజీఐఐసీ సోమవారం నిర్వహించిన వేలంలో ప్రముఖ జాతీయ, ప్రాంతీయ రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొన్నాయి. ఐటీ కారిడార్ ప్రాంతం కావడం రవాణాపరంగా అత్యంత సమీపంలోనే మెట్రో సదుపాయం ఉండటంతో 7.67 ఎకరాల ప్రభుత్వ భూమిని దక్కించుకునేందుకు స్థిరాస్తి సంస్థలు పోటీ పడ్డాయి. చివరకు ఎంఎస్ఎన్ రియాల్టీ సంస్థ అత్యధిక ధరకు మొత్తం భూమిని దక్కించుకుంది. 2022లో కోకాపేటలోని నియోపోలిస్‌లో హెచ్ఎండీఏ నిర్వహించిన వేలంలో ఎకరం ధర రూ.100.75 పలికినపుడు ఆ విషయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అప్పట్లో రాజపుష్ప ఈ భూమిని కొనుగోలు చేసింది.

ఐవీఎఫ్ పద్ధతిలో కోడెదూడ జననం

» ప్రయోగశాలలో ఫలదీకరణం



మచిలీపట్నం/కూచిపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) పద్ధతిలో పశుసంవర్ధక శాఖ అధికారులు కృష్ణా జిల్లాలో తొలిసారిగా చేసిన ప్రయోగం ఫలించింది. ప్రయోగశాలలో ఫలదీకరణం చేయించిన పిండాన్ని దేశీయ ఆవు గర్భంలో ప్రవేశపెట్టగా.. ఆ పిండం పెద్దదై తొమ్మిది నెలల ఐదు రోజులకు కోడెదూడ రూపంలో జన్మించింది. గుంటూరు లాంఫాం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ముత్తారావు, పశుగణాభివృద్ధి విభాగ వైద్యుడు శ్రీమన్నారాయణ, ఎన్ఆర్ శ్రీకాంత్, పశుసంవర్ధక శాఖ ఏడీ నాగభూషణం, మొవ్వ మండలం భట్లపెనుమర్రు పశువైద్యాధికారి బి.విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ ఐవీఎఫ్ పద్ధతికి శ్రీకారం చుట్టారు. గుంటూరు లాంఫాంలో మేలురకానికి చెందిన గిర్ జాతి ఆవు నుంచి అండాలు, ఒంగోలు జాతి ఆబోతు నుంచి వీర్యాన్ని సేకరించి ఫలదీకరణం చెందించారు. ఈ పిండాన్ని కృష్ణా జిల్లా మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలోని జొన్నలగడ్డ హనుమకుమార్‌కు చెందిన ఆవు ఎదకు వచ్చిన ఏడో రోజున గర్భంలో ప్రవేశపెట్టారు. ఈ పిండం పెరిగి పెద్దదవడంతో ఈ ఆవు సోమవారం కోడెదూడకు జన్మనిచ్చింది. మామూలు పద్ధతిలో ఒక ఆవు తన జీవితకాలంలో 8 నుంచి 10 పిల్లలకు జన్మనిస్తుందని, అయితే జన్యుపరమైన పద్ధతి ద్వారా ఒక ఆవు నుంచి సేకరించిన అండాలను 150 పిండాలుగా జన్యుమార్పిడి చేసి, వాటిని ఇతర ఆవుల గర్భంలో ప్రవేశపెట్టి 50 నుంచి 60 దూడలను పొందవచ్చని పశుసంవర్ధకశాఖ ఏడీ నాగభూషణం, భట్లపెనుమర్రు పశువైద్యాధికారి విజయకుమార్ తెలిపారు. ఇలా పుట్టిన ఆవుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఐవీఎఫ్ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా దేశీయ ఆవు జాతులను మరింతగా ఉత్పత్తి చేసేందుకు ఈ ప్రయోగం చేసి సఫలీకృతులమైనట్లు పేర్కొన్నారు. ఐవీఎఫ్ పద్ధతిలో ఆవు దూడలు మాత్రమే పుట్టేలా చేస్తున్న ప్రయోగాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కృష్ణా జిల్లాలో తొలిసారిగా చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో కలెక్టర్ బాలాజీ అధికారులను అభినందించారు.

బెంగాల్ బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలపై దాడి

» మాల్డా ఎంపీ ఖగెన్ ముర్ము తలకు గాయం

నగ్రకట, అక్టోబరు 6: వరదలతోపాటు కొండ చరియలు విరిగి పడటంతో అతలాకుతలమైన ప్రాంతాన్ని సందర్శించి బాధితులకు సాయం చేయడానికెళ్లిన బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము (మాల్డా), ఎమ్మెల్యే శంకర్ ఘోష్ (సిలిగురి)లపై సోమవారం దాడి జరిగింది. ఈ ఘటనతో అధికార తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ మధ్య ఆరోపణలూ ప్రత్యారోపణలు సాగాయి. ఇది అధికార తృణమూల్ కాంగ్రెస్ పనేనని, పశ్చిమ బెంగాల్‌లో అటవిక రాజ్యం నడుస్తోందనడానికి ఈ ఘటన నిదర్శనమని బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు. తమను 500 మంది వ్యక్తుల బృందం అడ్డుకున్నదని.. 'దీదీ దీదీ' అని నినదిస్తూ రాళ్లు విసిరారని, కర్రలతో దాడి చేశారని బీజేపీ నేతలు విమర్శించారు. ఈ దాడిలో ఎంపీ ఖగెన్ ముర్ము తలకు తీవ్ర గాయం, ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌కు స్వల్ప గాయం కావడంతో తొలుత స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేసి.. సిలిగురికి తరలించారు. ఈ దాడిలో ఎంపీ ఖగెన్ ముర్ము ప్రయాణిస్తున్న కారు ధ్వంసమైంది. మానవీయ సంక్షోభం నెలకొన్న వేళ విపక్షంపై అధికార తృణమూల్ గూండాలు దాడి చేశారని బీజేపీ ఆరోపించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. బాధల్లో ఉన్న ప్రజల వద్ద కేవలం ఫొటోలకు ఫోజులివ్వడానికి వెళ్లిన బీజేపీ నేతలు స్థానికులను రెచ్చగొట్టారని, ఇది వారి స్వయంకృతమని ఉత్తర బెంగాల్ మంత్రి ఉదయన్ ఆరోపించారు. ఈ దాడిని ఖండించిన ప్రధాని మోదీ.. బెంగాల్‌లో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు.

శ్రీశైలం చరిత్రలోనే అత్యధిక వరద

» జూన్ నుంచి 2105 టీఎంసీల ఇన్‌ఫ్లో.. మరో 100 టీఎంసీలు వచ్చే చాన్స్

హైదరాబాద్, గద్వాల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక వరద నమోదైంది. ఈ సీజన్‌లో అంటే జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటిదాకా 2105 టీఎంసీల వరద వచ్చింది. ఇది ప్రాజెక్టు చరిత్రలోనే అత్యధిక వరద. 1994-95లో 2039.23 టీఎంసీల వరద రాగా ఆ తర్వాత 2022-23లో 2039.87 టీఎంసీల వరద వచ్చింది. ఈ వాటర్ ఇయర్ (2025 జూన్ 1-2026 మే 31) పూర్తయ్యేనాటికి మరో 100 టీఎంసీల వరద రావొచ్చని అంచనా వేస్తున్నారు. కాగా ఈ సీజన్‌లో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 1578 టీఎంసీల వరద వచ్చింది. జూరాలకు 1480 టీఎంసీల వరద, పులిచింతలకు 1293 టీఎంసీల వరద రికార్డయింది. ఎగువన ఆల్మట్టికి 747 టీఎంసీలు, నారాయణపూర్ ప్రాజెక్టుకు 745 టీఎంసీల వరద వచ్చింది. కృష్ణా బేసిన్‌లో ఇప్పటిదాకా 1382 టీఎంసీల జలాలు సముద్రంలో కలిశాయి. ఈ వాటర్ ఇయర్‌లో ఇప్పటిదాకా గోదావరి జలాలు 3,905 టీఎంసీలు సముద్రంలో కలిశాయి.

కూటములు, కులాల కుంపట్లో..
అన్ని పక్షాలకూ అగ్ని పరీక్షే!

ప్రతిష్ఠాత్మకంగా మారిన బిహార్ ఎన్నికలు... మసకబారిన నితీశ్ ప్రతిష్ఠ.. మోదీపైనే ఎన్డీయే ఆశలు

» రాహుల్, తేజస్వి ఆధ్వర్యంలో మహా 'గట్టి' బంధన్ ప్రయత్నాలు

» ప్రశాంత్ కిషోర్ ప్రభావమెంత?



న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆటవిక పాలనతో 'జంగిల్ రాజ్'గా పేరు పొందిన బిహార్‌లో దంగల్ మొదలైంది. కూటములు, కులాల కుంపట్లతో సతమవుతున్న ఆ రాష్ట్రంలో ఎన్నికల యుద్ధానికి తెరలేచింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో రాజకీయం వేడెక్కింది. బిహార్‌కు వరాల జల్లు కురిపించడంతో పాటు ఆ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తున్న ప్రధాని మోదీకి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కూడా జాతీయ స్థాయిలో ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. స్థానికంగా జేడీయూ నేత, సీఎం నితీశ్‌కుమార్, ఆర్జేడీ నేత, లాలూ కుమారుడు తేజస్వియాదవ్‌తోపాటు కొత్తగా రంగంలోకి దిగిన జనసురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌ల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

ముక్కోణపు పోటీ.. మధ్యలో ఆప్!

ప్రస్తుతం బిహార్‌లో బీజేపీ, జేడీయూ, ఎల్‌జేపీ, పలు చిన్న పార్టీలతో కూడిన ఎన్డీయే కూటమి ఓ వైపు.. కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాల కూటమి మరో వైపు తలపడుతున్నాయి. కొత్తగా జనసురాజ్ పార్టీతో తెరపైకి వచ్చిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూటమి రాజకీయాలకు తానే ప్రత్యామ్నాయం అంటూ జనంలోకి వెళుతున్నారు. దీనికితోడు కొత్తగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా బిహార్‌లో అడుగుపెట్టింది. అన్ని స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పడమే కాదు.. 11 చోట్ల అభ్యర్థులను కూడా ప్రకటించింది. తాము పోటీ చేస్తామని బీఎస్పీ అధినేత్రి మాయావతి సోమవారం ప్రకటించారు.

ఎన్డీయే సత్తా చాటేనా..

ఒకప్పుడు జంగిల్ రాజ్‌గా పేరుపొందిన బిహార్.. నితీశ్ పాలనలో అభివృద్ధి వైపు మళ్లిందన్న అభిప్రాయం ఉంది. రెండు దశాబ్దాలుగా ఆయనకు 'సుశాసన్‌బాబు (మంచి పరిపాలకుడు)'గా పేరుంది. బిహార్‌లో వెనుకబడిన కులాల్లో ఒకటైన కుర్మి వర్గం జనాభా గణనీయంగా ఉంటుంది. అదే వర్గానికి చెందిన నితీశ్ కుమార్‌కు వారంతా మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు. అయితే ఈ విజయపరంపరను నితీశ్ కొనసాగించగలరా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. 2020లో బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నితీశ్.. మధ్యలో ఆ కూటమిని వదిలి, ఆర్జేడీ-కాంగ్రెస్‌తో చేరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, 2024లో మళ్లీ రాజీనామా చేసి ఎన్డీయే కూటమిలో చేరడంపై విమర్శలు వచ్చాయి. దానికితోడు ఇటీవల నితీశ్ ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం, పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మారవచ్చనే అభిప్రాయాలూ ఉన్నాయి. ఒకవేళ ఎన్డీయే గెలిచినా నితీశ్ సీఎం కాకపోవచ్చని, ఆయన శకం ముగిసినట్టేననే వాదనలూ ఉన్నాయి. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే ప్రధాని మోదీ కరిష్మాపైనే ఆశలు పెట్టుకుంది. దీనికి తగ్గట్టుగానే బిహార్‌లో వరుస పర్యటనలు చేస్తున్న ప్రధాని మోదీ.. పెద్ద సంఖ్యలో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్నారు.

రాహుల్ మహా 'గట్టి' బంధన్ ప్రయత్నాలు..

ఎన్డీయేకు దీటుగా నిలిచేందుకు ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమి గట్టి ప్రయత్నాలే చేస్తోంది. కూటమి తమ తరఫున తేజస్వి యాదవ్ సీఎం అభ్యర్థిగా ముందుపెట్టి ప్రచారం చేస్తోంది. బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ కలకలం రేపిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ఇటీవలే బిహార్‌లో రెండు వారాలపాటు 'ఓటర్ అధికార యాత్ర' నిర్వహించారు. ప్రచారంలోనూ ఆయన దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉంది. అయితే బిహార్‌లో కాంగ్రెస్‌కు పెద్దగా పట్టులేదు. ఆర్జేడీ వెనకే నడుస్తోంది. రాహుల్ పర్యటనలతో బిహార్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నా.. కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు దక్కుతాయి, అందులో ఎన్ని గెలుస్తుందన్నది తేలాల్సి ఉంది.

తేలనున్న తేజస్వి యాదవ్ భవిష్యత్తు

కొన్నేళ్లుగా బిహార్ రాజకీయాల్లో బాగా ఫోకస్ ఉన్న నాయకుడు 35 ఏళ్ల తేజస్వి యాదవ్. మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ కుమారుడిగా తెరపైకి వచ్చిన ఆయన... తమ పార్టీ ఆర్జేడీపై పూర్తి పట్టు సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో గణనీయమైన ప్రభావం చూపారు. మహాఘట్‌బంధన్ కూటమి అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఆయనకే ఎక్కువ. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన భవితవ్యం ఏమిటన్నది తేలిపోనుంది. బిహార్‌లో గట్టి పట్టున్న యాదవులు ఆర్జేడీ వెంట ఉండటంతో ఆ పార్టీ పట్టునిలుపుకొంటూ వస్తోంది. ఇటీవలి రాహుల్ ఓటర్ అధికార యాత్ర, తాను చేసిన బిహార్ అధికార యాత్రల జనంలో మంచి స్పందన రావడంతో తమ కూటమి గెలుపుపై తేజస్వి ఆశలు పెట్టుకున్నారు. ఎప్పటి మాదిరిగా ముస్లింలు, యాదవులు ఆర్జేడీ వైపు నిలుస్తారని భావిస్తున్నారు.

ప్రశాంత్ కిషోర్ ప్రభావం ఉంటుందా?

జన సురాజ్ పార్టీతో రంగంలోకి దిగిన ప్రశాంత్ కిషోర్ బిహార్‌లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కుల, మత, రాజకీయ కొలమానాలకు అతీతంగా ప్రజలను తమ పార్టీని ఆదరించాలని కోరుతున్నారు. సోషల్ మీడియాలో, యువతలో ఆయన వైపు సానుకూల స్పందన కనిపిస్తోంది. కానీ ఎన్నికల్లో ఎంత వరకు ప్రభావం చూపగలరన్నది తేలాల్సి ఉంది.

మోగింది బిహార్ భేరి

(మొదటి పేజీ తరువాయి)

చివరి రెండు రౌండ్లు మిగిలేసరికల్లా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కచ్చితంగా పూర్తి చేయనున్నట్టు వెల్లడించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ.. శుద్ధీకరణ!

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ను శుద్ధీకరణగా జ్ఞానేశ్‌కుమార్ అభివర్ణించారు. దానితో 69 లక్షల ఓట్లను తొలగించినట్టు చెప్పారు. అయితే అందులో విదేశీయులుగా గుర్తించిన ఎంత మంది ఓట్లు తొలగించారని మీడియా ప్రశ్నించగా.. సమాధానం చెప్పలేదు. బిహార్‌లో జరగనున్న ఎన్నికలు దేశంలోనే అత్యంత పారదర్శకమైన ఎన్నికల్లో ఒకటి కాబోతున్నాయని.. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల శుద్ధీకరణకు మార్గం చూపుతాయని వ్యాఖ్యానించారు. అన్ని పోలింగ్ బూత్‌లలో అంగన్‌వాడీ వర్కర్లు ఉంటారని, బురఖాలలో వచ్చే మహిళల గుర్తింపు ధ్రువీకరణకు సాయపడతారని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ ఇలా..

బిహార్ ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం 2025 నవంబర్ 22న పూర్తవుతోంది. దీనితో అంతకన్నా ముందే నవంబర్ 16 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేలా షెడ్యూల్ రూపొందించినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. తొలి విడతలో 121 స్థానాల ఎన్నికలకు అక్టోబర్ 10న నోటిఫికేషన్ విడుదలవుతుంది. 20వ తేదీ నాటికి నామినేషన్ల ప్రక్రియ పూర్తయి అభ్యర్థులు ఖరారవుతారు. నవంబర్ 6న పోలింగ్ జరుగుతుంది. రెండో విడతలో 122 స్థానాలకు అక్టోబర్ 13న నోటిఫికేషన్ ఇస్తారు. 23వ తేదీ నాటికి అభ్యర్థులు ఖరారవుతారు. నవంబర్ 11న పోలింగ్ జరుగుతుంది. మొత్తం అన్ని స్థానాలకు 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలు విడుదల చేస్తారు. బిహార్‌లో మొత్తం ఓటర్లు 7.43 కోట్ల మందికాగా, అందులో పురుషులు 3.92 కోట్లు, మహిళలు 3.5 కోట్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటేస్తున్న యువత 14 లక్షల మందికిపైగా ఉన్నారు. కాగా, బిహార్‌లో సాధారణంగా సుదీర్ఘంగా ఎన్నికలు జరుగుతుంటాయి. గత మూడు అసెంబ్లీ ఎన్నికలను చూస్తే.. 2010లో ఆరు దశల్లో, 2015లో ఐదు దశల్లో, 2020లో మూడు దశల్లో జరిగాయి. ఈసారి కేవలం రెండు దశల్లోనే ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ఇక, తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం సహా దేశవ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్ల ఉప ఎన్నికలకు కూడా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. జమ్మూకశ్మీర్‌లోని బుడ్గామ్, నగ్రోటా, రాజస్థాన్‌లోని అంతా, జార్ఖండ్‌లోని ఘట్‌సిలా, పంజాబ్‌లోని తరన్ తరన్, మిజోరంలోని డంపా, ఒడిశాలోని నౌపాడ నియోజకవర్గాలకు నవంబర్ 11న పోలింగ్ జరగనుంది

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చేనెల 11న

» 13 నుంచి నామినేషన్లు

» నవంబర్ 11న పోలింగ్.. 14న లెక్కింపు

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. నవంబరు 11న ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. 14న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచే నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 21 తుది గడువు కాగా, 22న పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 24 వరకు అవకాశం ఉంటుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో హైదరాబాద్ జిల్లా పరిధిలోని ప్రాంతాలకు ఎన్నికల కోడ్ వర్తిస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రకటించారు.

సీజేఐపై బూటు విసరబోయిన లాయర్!

(మొదటి పేజీ తరువాయి)

విహార్‌కు చెందిన న్యాయవాది రాకేశ్ కిశోర్ సుప్రీంకోర్టు బార్‌లో సభ్యుడు. ప్రధాన న్యాయమూర్తి విచారణ జరుపుతున్న ఒకటో నంబరు కోర్టు హాలులో న్యాయవాద దుస్తుల్లో వచ్చారు. నేరుగా ఎడమ వైపు నుంచి ప్రధాన న్యాయమూర్తి వేదిక దగ్గరకు వచ్చారు. కిందకు వంగి తన బూటు తీశారు. దాంతోపాటు కొన్ని కాగితాలను రోల్ లాగా చుట్టి గవాయ్ బెంచ్ దిశగా విసిరేశారు. ఆ సమయంలో ఇద్దరు జడ్జిలు కుడివైపు తిరిగి న్యాయవాదులతో మాట్లాడుతున్నారు. అతను బూటు విసురుతుండగానే భద్రతా సిబ్బంది స్పందించి, అడ్డుకున్నారు. వెంటనే అతన్ని బయటకు తీసుకెళ్లారు. "సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు" అంటూ వృద్ధ న్యాయవాది నినాదాలు చేశారు. బూటుతో పాటు రోల్ చేసిన కాగితాలు కూడా విసరడంతో ఏం విసిరాడో కూడా అక్కడున్న వాళ్లకు కాసేపటి వరకు అర్థం కాలేదు. పోలీసులు సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సహకారంతో వివరాలు సేకరిస్తున్నారు. న్యాయవాది చర్య వెనుక అసలు ఉద్దేశం ఏమిటో తెలుసుకోవాల్సి ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, సదరు న్యాయవాదిపై ఎలాంటి కేసు పెట్టడానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్ అంగీకరించక పోవడంతో 3గంటల విచారణ తర్వాత పోలీసులు అతన్ని వదిలేశారు. ఆయన బూటును, ఆయన దగ్గర స్వాధీనం చేసుకున్న పత్రాలను కూడా తిరిగి ఇచ్చేశారు. రాకేశ్ కిశోర్ తెల్ల కాగితం మీద "ప్రతీ సనాతన వాదికి నా సందేశం. సనాతన ధర్మానికి అవమానం జరిగితే హిందుస్థాన్ సహించదు" అని రాసుకున్నారు.

జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలపై కోపంతోనే..

మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలోని జవారీ ఆలయంలో మొఘలుల కాలంలో ధ్వంసం చేసిన విష్ణుమూర్తి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలన్న పిటిషన్‌పై ఇటీవల జస్టిస్ గవాయ్ చేసిన వ్యాఖ్యల మీద సదరు న్యాయవాది ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. అది వారసత్వ కట్టడం కావడంతో దానికి మార్పులు చేయడానికి అవకాశం లేదు. ఆ కేసు విచారణ సమయంలో పిటిషనర్ తరఫు న్యాయవాది పదేపదే పట్టుబట్టడంతో మీరు పరమ భక్తులంటున్నారు కదా, మీరే విష్ణుమూర్తిని వేడుకోండి అని ఆగ్రహంతో జస్టిస్ గవాయ్ స్పందించారు. అది ప్రజాహిత వ్యాజ్యం కాదు పబ్లిసిటీ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అన్నారు. మర్నాడు సీజేఐ తన వ్యాఖ్యల మీద వివరణ ఇచ్చుకున్నారు. తన వ్యాఖ్యలను సోషల్ మీడియా వక్రీకరించిందని, తాను అన్ని మతాలను గౌరవిస్తానని చెప్పారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సంఘటనపై మాట్లాడుతూ, "ప్రధాన న్యాయమూర్తి తనపై దాడి యత్నం మీద మానవత్వంతో స్పందించారు. దీన్ని న్యాయవ్యవస్థ బలహీనతగా భావించరాదు" అన్నారు. ఒక వ్యక్తి తుచ్ఛమైన ప్రచారం కోసం ఇలాంటి చర్యకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సీజేఐకి జెడ్ ప్లస్ భద్రత ఉంది. ప్రధాన న్యాయమూర్తి మీద చెప్పు విసరబోయిన న్యాయవాదిని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యత్వం నుంచి తాత్కాలికంగా తొలగించింది. తదుపరి నిర్ణయం తీసుకొనే వరకు ఆయన దేశంలో ఏ కోర్టులోనూ వాదనలు వినిపించే అవకాశం లేదు. గవాయ్‌పై దాడి యత్నాన్ని సుప్రీంకోర్టు అడ్వకేట్ ఆన్ రికార్డ్స్ సంఘం ఖండించింది. ఆయనపై సుప్రీంకోర్టు సుమోటో చర్యలు తీసుకోవాలని కోరింది. ఇది న్యాయవ్యవస్థపై, చట్టబద్ధ పాలనపై జరిగిన దాడిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. జస్టిస్ గవాయ్‌పై దాడియత్నాన్ని ఖండించడానికి ఏ మాటలూ చాలవని కాంగ్రెస్ ముఖ్యనేత సోనియాగాంధీ అన్నారు. దేశ చరిత్రలో ఇది చీకటి రోజని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఘటనకు బీజేపీ బాధ్యత వహించాలని కేసీవేణుగోపాల్ అన్నారు. ఆటగాడికి ఒంటిమీద గీతపడ్డా ట్విట్టర్‌లో స్పందించే ప్రధానికి జస్టిస్ గవాయ్ మీద దాడి కనబడలేదా? అని పవన్ ఖేరా అడిగారు. మరోపక్క ప్రధాని నరేంద్ర మోదీ జస్టిస్ గవాయ్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. జస్టిస్ గవాయ్‌పై దాడి దేశంలోని ప్రతీ పౌరుడిని ఆగ్రహానికి గురి చేసిందన్నారు.

ఐసీయూలో ఆరుగురు ఆహుతి

జైపూర్‌లోని ప్రభుత్వాస్పత్రిలో షార్ట్ సర్క్యూట్!

జైపూర్, అక్టోబరు 6 : రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీయూ విభాగంలో ఆరుగురు అగ్నికి ఆహుతయ్యారు. సహాయక సిబ్బంది ఐదుగురిని మాత్రం ఎట్టకేలకు కాపాడగలిగారు. ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ట్రామా సెంటర్ భవనంలోని న్యూరో ఐసీయూలో ఆదివారం అర్ధరాత్రి దాటాక ఈ ప్రమాదం జరిగింది. అందరూ గాఢనిద్రలో ఉన్న వేళ ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం అధికంగా ఉంది. ఈ సమయంలో అక్కడ క్రిటికల్ కేర్ సపోర్టు మీద 11మంది చికిత్స పొందుతున్నారు. స్టోర్‌రూమ్‌లో సంభవించిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మృతుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన ఐదుగురికి చికిత్స కొనసాగుతోందని, తక్కిన ఐసీయూ విభాగాల్లోని వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించామని ట్రామా సెంటరు ఇన్‌చార్జి అనురాగ్ దాకడ్ సోమవారం తెలిపారు. ఒక్కసారిగా అలుముకున్న మంటలు, పొగలతో న్యూరో ఐసీయూలోని గది గోడలు నల్లబారిపోగా, అత్యవసర వైద్య పరికరాలు పనికిరాని విధంగా వంగిపోయాయి. ఆ ప్రదేశమంతా పొగ చూరిపోవడంతో పోలీసులు చాలాసేపటివరకు ఆస్పత్రిలోకి వెళ్లలేకపోయారు. అగ్నిమాపక సిబ్బంది గది కిటికీలు బద్దలుకొట్టి లోపలకు ప్రవేశించాల్సి వచ్చింది. కాగా, మృతులు ఎనిమిది దాకా ఉంటారని మరో కథనం వినిపిస్తుండగా, ఈ వాదనను ఆస్పత్రి నిర్వాహకులు ఖండించారు. ప్రమాద ఘటనపై ప్రధాన మంత్రి మోదీ విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై రాజస్థాన్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ కమిటీని నియమించింది.

హెచ్చరించినా పట్టించుకోలేదు

మృతుల కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి నిర్వాహకులకు వ్యతిరేకంగా ప్రాంగణంలో నిరసన తెలిపారు. తమవారిని రక్షించాల్సిన సిబ్బంది, నిర్వాహకులు అక్కడి నుంచి పారిపోయారని పలువురు బాధితులు వాపోయారు. ఆహారం తీసుకురావడానికి బయటకు వచ్చి, తిరిగి వెళ్లేసరికే మంటల్లో తన తల్లి కాలిపోయిందని ఒకరు కన్నీరుపెట్టుకోగా, తన సోదరుడిని కోల్పోయానని మరో బాధితుడు వాపోయారు. విద్యుతాఘాతం గురించి వార్డుబోయ్, డాక్టర్‌కు తెలిపినా పట్టించుకోలేదని కొందరు ఆగ్రహంవ్యక్తం చేశారు.

శబరిమలలో బంగారం మాయంపై 'సిట్'

» కేరళ హైకోర్టు ఆదేశం

» నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచన

తిరువనంతపురం, అక్టోబరు 6: శబరిమల అయ్యప్ప దేవాలయంలో బంగారం మాయమయినట్టు ప్రాథమిక విచారణలో తేలడంతో దీనిపై లోతుగా దర్యాప్తు చేయించాలని సోమవారం కేరళ హైకోర్టు నిర్ణయించింది. పోలీసు ఏడీజీ హెచ్.వెంకటేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. బంగారు తాపడం ఉన్న రాగి రేకుల మరమ్మతు పనుల్లో అక్రమాలు జరిగినట్టు కనిపిస్తోందని జస్టిస్ రాజా విజయ రాఘవన్, జస్టిస్ కె.వి.జయకుమార్‌ల ధర్మాసనం తెలిపింది. ఈ కుట్రలో బెంగుళూరులో నివసిస్తున్న మలయాళీ ఉన్నికృష్ణన్ పొట్టితో పాటు ట్రావెంకోర్ దేవస్వోం బోర్డు అధికారులకు సంబంధం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం చేసింది. సంపూర్ణంగా విచారణ జరిపి నెల రోజుల్లో నివేదిక అందజేయాలని 'సిట్'ను ఆదేశించింది. ఉన్ని కృష్ణన్ 2019లో అప్పటి దేవస్వోం బోర్డు చైర్మన్ ఎ.పద్మకుమార్‌కు పంపిన ఈ-మెయిల్ అక్రమాలకు కీలక ఆధారంగా ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. 'ద్వారపాలక విగ్రహాలకు బంగారు తాపడం రేకులను అమర్చిన తరువాత ఇంకా కొన్ని రేకులు నా వద్ద ఉన్నాయి. వాటిని ఓ బాలిక వివాహానికి వాడుకోవచ్చా?' అని ఆ మెయిల్‌లో ఉందని, దానిపై చర్యలు తీసుకున్నట్టు కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడింది.



భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో వాహనాల రద్దీ

అడుగుకో వాహనం..

» చౌటుప్పల్ వద్ద ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ జామ్

» 27 కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటలు

చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు ఊళ్లకు వెళ్లిన వారందరూ తిరిగి హైదరాబాద్‌కు పయనం కావడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65) కిక్కిరిసిపోయింది. అటు ఎండ తాపం, ఇటు వాహనాల వేడికి వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సోమవారం తెల్లవారుజామున సాధారణంగా కన్పించిన ట్రాఫిక్.. ఉదయం ఏడు గంటల తర్వాత భారీగా పెరిగిపోయింది. నిమిష.. నిమిషానికి వాహనాల సంఖ్య పెరగడంతో రద్దీ తీవ్రమైంది. చౌటుప్పల్ మండల పరిధిలోని రెడ్డిబావి నుంచి తూప్రాన్‌పేట వరకు వేలాది వాహనాలు హైవేపై బారులుతీరాయి. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ నెలకొనడంతో చౌటుప్పల్ పట్టణమంతా వాహనాలతో నిండిపోయింది. పట్టణంలో నాలుగు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారితోపాటు సర్వీసు రోడ్డుపైనా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంతంగి టోల్ ప్లాజాను దాటడానికి వాహనదారులకు అరగంటపైగా సమయం పట్టింది. టోల్ ప్లాజా వద్ద 16గేట్లు ఉండగా, అందులో 10 గేట్లను హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకే కేటాయించారు. సాధారణ రోజుల్లో ఇక్కడి నుంచి 35వేల వాహనాల రాకపోకలు సాగిస్తుండగా.. సోమవారం అదనంగా మరో 25వేల వాహనాలు ప్రయాణించాయి. కాగా, నల్లగొండ నుంచి క్షతగాత్రులతో హైదరాబాద్ వెళ్తున్న రెండు అంబులెన్స్‌లు పంతంగి వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. అతికష్టమ్మీద అంబులెన్స్‌లను టోల్ గేట్ దాటించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద సోమవారం సాయంత్రానికి వాహనాల రద్దీ తగ్గింది.

విపత్తుల శాఖకు దన్నుగా..!

» కొత్త ఫైర్ స్టేషన్లు, ఫైరింజన్లు, పరికరాలు, బోట్లతో అగ్నిమాపక శాఖ బలోపేతం

» రూ.253 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో ప్రజలను రక్షించి, వారి ఆస్తులను కాపాడే విపత్తుల నిర్వహణ శాఖను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త అగ్నిమాపక కేంద్రాల నిర్మాణం, ఫైరింజన్ల కొనుగోలు, సిబ్బందికి శిక్షణ, అధునాతన పరికరాల కల్పనతో ఈ శాఖను బలోపేతం చేయనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు తదితర ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రమాదాలు సంభవించి పదుల సంఖ్యలో ప్రజలు, కార్మికుల ప్రాణాలు పోయినా విపత్తుల శాఖ అభివృద్ధిని నాటి సీఎం జగన్ పట్టించుకోలేదు. కనీసం కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకుండా అన్యాయం చేసింది. 2024లో జరిగిన ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఏర్పడటంతో కేంద్ర ప్రభుత్వం రూ.189.65 కోట్లు(75శాతం), రాష్ట్ర ప్రభుత్వం రూ.63.22 కోట్లు(25శాతం) కలిపి మొత్తం రూ.252.87కోట్ల నిధుల విడుదలకు అనుమతి ఇస్తూ సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. మొదటి విడతలో రూ.62.92కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం మిగతా మూడు విడతల నిధులకు పాలనాపరమైన అనుమతులు ఇవ్వడంతో అగ్నిమాపక శాఖలో అభివృద్ధి పరుగులు తీయనుంది. ఈ నిధులతో తొలుత కొత్తగా 17ఫైర్‌స్టేషన్లు నిర్మించనున్నారు. ఇప్పటికే ఉన్న 36 స్టేషన్లకు మరమ్మతులు చేస్తారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయి. ఇంకా కొత్త కేంద్రాల నిర్మాణం, అమరావతిలో అంతర్జాతీయ స్థాయి శిక్షణ కేంద్రం ఏర్పాటు, కొత్త ఫైరింజన్ల కొనుగోలు, సిబ్బందికి అవసరమైన పరకరాలు కొనుగోలుకు టెండర్లు పిలవనున్నారు.

డిజిటల్ సేవలకు జాతీయ అవార్డులు

» ప్రభుత్వశాఖలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లోనూ, స్థానిక సంస్థల్లోనూ డిజిటల్ సేవలందిస్తున్న కార్యాలయాలకు జాతీయ స్థాయి అవార్డులను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం అన్ని రాష్ట్రాల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆయా శాఖలు అందిస్తున్న డిజిటల్ సేవలను వివరిస్తూ ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను పంపాల్సి ఉంటుంది. ఈ మేరకు సోమవారం ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అత్యుత్తమ డిజిటల్ సేవలందించే సంస్థలకు గోల్డ్, సిల్వర్ అవార్డులు అందిస్తారు. గోల్డ్ విన్నర్‌కు రూ. 10 లక్షలు, సిల్వర్ విన్నర్‌కు రూ. 5 లక్షల చొప్పున బహుమతిగా ఇస్తారు. 2023 అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు అందించిన డిజిటల్ సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేస్తారు.

అమెరికా గ్రీన్‌కార్డుకు అత్యుత్తమ మార్గం ఈబీ-5

» ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఇల్యా ఫిష్కిన్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా గ్రీన్ కార్డు పొందడానికి అత్యుత్తమ మార్గం.. ఈబీ-5 (ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ ఫిఫ్త్ ప్రిఫరెన్స్) వీసాయేనని ఆ దేశానికి చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఇల్యా ఫిష్కిన్ అన్నారు. అమెరికాలో పెట్టుబడులకు సంబంధించిన వీసా ప్రోగ్రామ్ ఈబీ-5 గురించి వివరించేందుకు తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆవరణలో.. న్యూయార్క్ ఇమ్మిగ్రేషన్ ఫండ్ ఒక సమావేశాన్ని నిర్వహించింది. ఈబీ-5 ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ భాగస్వాములు సుబ్బరాజు పేరిచెర్ల, సంపన్ మల్హోత్రాలతో పాటు ఇల్యా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డొనాల్డ్ ట్రంప్ వీసా నిబంధనలను కఠినతరం చేసిన తరువాత చాలామంది భారతీయులు ఈబీ-5 పథకం వైపు చూస్తున్నారని తెలిపారు.

హైకోర్టులోనే తేల్చుకోండి!

» తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్ల జీవోపై సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. విచారణ పరిధి మేరకు హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్‌కు స్పష్టంచేసింది. వంగా గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. రాష్ట్ర సర్కారు తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వి, సిద్ధార్థ్ దవే, ఏడీఎన్ రావు హాజరయ్యారు.



స్వచ్ఛ అవార్డులు అందుకున్న వారితో సీఎం చంద్రబాబు, మంత్రులు నారాయణ, పార్థసారథి తదితరులు

మీరూ 'సిందూర్' వీరుల్లాంటివారే!

దేశాన్ని శుభ్రపరుస్తున్న దేశభక్తులు మీరు

స్వచ్ఛ విజేతలకు పాదాభివందనాలు: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డులకు ఎంపికైన విజేతలంతా ఆపరేషన్ సిందూర్ వీరుల్లా కనిపిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. దేశాన్ని శుభ్రపరుస్తున్న పారిశుధ్య కార్మికులంతా దేశభక్తులేనని స్పష్టంచేశారు. స్వచ్ఛాంధ్ర సాధ్యం కాకుండా స్వర్ణాంధ్ర సాధన వీలు కాదని వ్యాఖ్యానించారు. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. జై స్వచ్ఛ సేవక్...అంటూ నినదిస్తూ..సభలోని వారందరితో జై కొట్టించారు. "ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనికవీరులు ఉగ్రవాదులను ఏరివేశారు. ఆరోగ్యాన్ని పణం పెట్టి పనిచేసే పారిశుధ్య కార్మికులు కూడా అలాంటి వీరులే. స్వచ్ఛ కార్మికులందరికీ ఈ వేదికనుంచి పాదాభివందనం చేస్తున్నాను. మహాత్ముడు స్వచ్ఛతను దైవత్వంతో పోల్చారు. మన ప్రాంతాలు, పరిసరాలు ఇంత స్వచ్ఛంగా ఉన్నాయంటే అందుకు పారిశుధ్య కార్మికులే కారణం. వారు లేకపోతే స్వచ్ఛ ఉద్యమమే లేదు. సూర్యుడు ప్రతి రోజు కాస్త అటు ఇటుగా అయినా ఉదయిస్తాడేమో గానీ, తెల్లవారుజాము 4 గంటలకల్లా వీరు పని మొదలుపెడతారు. వారి రుణం తీర్చుకోలేం" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక ఏటా స్వచ్ఛ అవార్డులను ప్రదానం చేస్తామని తెలిపారు. మన స్వచ్ఛ సంకల్పానికి మెచ్చి కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులు ఇస్తోందని, ఈ ఏడాది ఏపీకి 5 అవార్డులు దక్కాయన్నారు. విజయవాడ, తిరుపతి, గుంటూరు, గ్రేటర్‌విశాఖ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్లు పరిశుభ్రతలో రాష్ట్రం పేరు నిలబెట్టాయని వివరించారు. హోం కంపోస్టింగ్, సోర్స్ సెగ్రిగేషన్, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్, బీట్ ద హీట్, గ్రీన్ ఆంధ్రప్రదేశ్ ...ఇలా ఒక్కో నెల ఒక్కో థీమ్‌తో ఫలితాలు సాధించామన్నారు. ప్రజల నుంచి పొడి చెత్త సేకరించి వారికి నిత్యావసరాలు తిరిగిచ్చేలా స్వచ్ఛరథం తెచ్చామని, త్వరలో మరో 100 మండలాలకు రథాలు రానున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన స్వచ్ఛ భారత్ నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసిపోయిందని విమర్శించారు. తిరుమలను కూడా అపరిశుభ్రంగా మార్చారని, చెత్త పన్ను వేసి చెత్తను మాత్రం వదిలేశారని దుయ్యబట్టారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి ఏపీని చెత్తరహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని సీఎం తెలిపారు. స్వచ్ఛమైన, పచ్చనైన, ఆరోగ్యకవంతమైన రాష్ట్రం కోసం అందరం పని చేద్దామని పిలుపునిచ్చారు. యూజ్ అంట్ త్రో పాలసీ కాదు.. యూజ్-రికవరీ-రీయూజ్ పాలసీ అమలు చేస్తున్నామని తెలిపారు. సంజీవని పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. కోటి బీమా అందించేలా యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకున్నామన్నారు. కాగా, ప్రతి నెల మూడో శనివారం సీఎం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' అవగాహన కార్యక్రమంలో పాల్గొంటున్నారని పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి ఉన్న 85 లక్షల టన్నుల చెత్తను ఏడాదిలోగా తొలగించాలని సీఎం ఆదేశించారు. ఆయన చెప్పిన దానికంటే 15 రోజుల ముందే చెత్తను తొలగించేశాం" అని తెలిపారు. అనంతరం 75 మందికి అవార్డులను ప్రదానం చేశారు.

శుభ్రతలో ఇలా భాగమయ్యాం: విజేతలు

"నాకు 350 ఇళ్లు కేటాయించారు. తడిచెత్త, పొడి చెత్త వేరుచేసే విషయంపై ఉదయం 11 గంటల వరకు ఆ ఇళ్లలోని వారికి అవగాహన కల్పిస్తున్నాం. మధ్యాహ్నం నుంచి కాలువలను శుభ్రపరుస్తున్నాం" అని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన విజేత తౌడురాజు సభలో వివరించారు. వంట చేయడం వల్ల వచ్చే చెత్తను కంపోస్టుగా తయారుచేసి కూరగాయాలు పండిస్తున్నవైనాన్ని గుంటూరుజిల్లా పొన్నూరు మండలానికి చెందిన విజేత అనే మహిళ తెలిపారు. ఈ సభలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సిటీకి ప్రధానితో శంకుస్థాపన

16 నాటికి తగిన ఏర్పాట్లు చేయాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతో డ్రోన్ సిటీకి శంకుస్థాపన చేయించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. డిసెంబరులో డ్రోన్ షోను నిర్వహించాలని సూచించారు. సోమవారం రియల్‌టైమ్ గవర్నెన్స్, పౌరసేవలపై సీఎం సమీక్ష నిర్వహించారు. కర్నూలు, శ్రీశైలం పర్యటనకు ఈనెల 16న ప్రధాని మోదీ వస్తున్నందున, ఆ సందర్భంగా డ్రోన్ సిటీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

నేడు స్వగ్రామానికి ముఖ్యమంత్రి

తమ్ముడు రామ్మూర్తి సంవత్సరీకానికి హాజరు

తిరుపతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం స్వగ్రామమైన తిరుపతిజిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెకు రానున్నారు. గతేడాది ఆయన సోదరుడు నారా రామ్మూర్తినాయుడు అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన సంవత్సరీకం సందర్భంగా స్వగ్రామంలో జరిగే కార్యక్రమానికి బాబు హాజరుకానున్నారు. కాగా, మంత్రి లోకేశ్ సహా చంద్రబాబు కుటుంబసభ్యులు సోమవారం రాత్రికే నారావారిపల్లి చేరుకున్నారు.

విదేశీ విద్యకు సర్కారు ఊతం

(మొదటి పేజీ తరువాయి)

మెయింటినెన్స్ ఫండ్‌కు నిధులిస్తామని వెల్లడించారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్ల హాస్టళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.1,700 కోట్లు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులే రూ.900 కోట్లు కాలేజీలకు చెల్లించాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. ఇంకా యాజమాన్యాలకు రూ.800 కోట్ల బకాయి ఉన్నట్లు వివరించారు.

ఖర్చుపెడుతున్న స్థాయిలో ఫలితాలు లేవు : సీఎం అసంతృప్తి

సంక్షేమశాఖలు 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' విధాన అమలు బాధ్యత తీసుకోవాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. ఈలక్ష్యం నెరవేరితే ఆయావర్గాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. ఇమామ్‌లకు, పాస్టర్లకు బకాయిలు ఏమైనాఉంటే వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. హజ్ యాత్రకు దరఖాస్తుల గడువును పెంచాలని సూచించారు. ఆదరణ-3 కింద ఇచ్చే పనిముట్లు ఆధునికంగా ఆయా కుల వృత్తులకు ఉపయుక్తంగా ఉండాలని స్పష్టంచేశారు. రజకులకు గ్యాస్‌తో పని చేసే ఇస్త్రీ పెట్టెలు, రాయితీపై సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మత్స్యకారులు సీవీడ్ లాంటి సరికొత్త ప్రత్యామ్నాయాలను ఎంచుకునేలా చైతన్య పరచాలని సూచించారు. "వెనుకబడిన వర్గాల ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలి. ఉన్నత స్థానానికి ఈ వర్గాలను తీసుకువెళ్లడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనబడడం లేదు. ఈ వర్గాల్లో పథకాల పట్ల సంతృప్తిస్థాయిని పెంచాల్సిన బాధ్యత అధికారులదే. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పన విషయంలో న్యాయపరమైన ఆటంకాలు తలెత్తకుండాచూడాలి. పురోగతిలో ఉన్న నెల్లూరు, ఏలూరు, కర్నూలులోని బీసీ భవనాలను పూర్తి చేయండి. కార్పొరేషన్లలో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల అధ్యయనం కోసం వర్క్‌షాపులు నిర్వహించాలి" అని సీఎం సూచించారు. కాగా, ట్రిపుల్ ఐటీకి ఎంపికైన బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లకు చెందిన కొందరు విద్యార్థులు సీఎం చంద్రబాబు కలిశారు. ఉన్నత విద్యలో మరింతగా రాణించాలంటూ వారిని ఆయన అభినందించారు.



బ్లూ స్టార్ చైర్మన్ వీర్ అద్వానీకి అరకు కాఫీ అందజేస్తున్న మంత్రి లోకేశ్

తరలిరండి

పారిశ్రామికవేత్తలతో లోకేశ్ వరుస సమావేశాలు

» వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం

» పోర్టు ఆధారిత వసతుల కల్పనపై దృష్టి

» ముంబైలో ట్రాఫిగురా, ఈఎస్ఆర్, రుస్తోంజీ, హెచ్‌పీ, బ్లూస్టార్, రహేజా అధినేతలతో వేర్వేరు భేటీలు

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ సోమవారం ముంబైలో వివిధ పారిశ్రామికవేత్తలతో విడివిడిగా భేటీ అయ్యారు. ప్రధానంగా పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టాలని ట్రాఫిగురా సీఈవో సచిన్ గుప్తాను కోరారు. లాజిస్టిక్స్, చమురు, ఖనిజాలు, ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో ఈ సంస్థ ముందంజలో ఉంది. విశాఖ పోర్టు నుంచి బొగ్గు, జింక్, అల్యూమినియం వంటి వస్తువులను ఎగుమతి చేస్తోంది. రాష్ట్రంలో కోల్డ్ స్టోరేజీ, ఎగుమతి మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని గుప్తాకు లోకేశ్ విజ్ఞప్తి చేశారు. విశాఖ, కాకినాడ రేవుల్లో సరుకు నిల్వలకు అధునాతన వేర్ హౌసింగ్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. పునరుత్పాదక ఇంధన రంగంలో దూసుకుపోతున్న ఏపీతో కలిసి విద్యుత్ వాణిజ్యంలో భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. కాకినాడ లేదా విశాఖలో ఎల్ఎన్‌జీ రీగ్యాసిఫికేషన్ టెర్మినల్‌ను ఏర్పాటు చేసి గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తికి సహకరించాలని కోరారు. విశాఖ పోర్టు నుంచి ఈ ఏడాది 82.62 మిలియన్ టన్నుల సరుకు రవాణా నమోదైన నేపథ్యంలో విశాఖలో కమోడిటీ ట్రేడింగ్ డెస్క్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అభ్యర్థించారు.



రహేజా గ్రూప్ చైర్మన్ నీల్ రహేజాతో భేటీ అయిన మంత్రి లోకేశ్

పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో భాగస్వామ్యం వహించండి

గ్లోబల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫాం ఈఎస్ఆర్ గ్రూప్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ సాదత్ షా, డైరెక్టర్ ప్రకృత్ మెహతాతో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీ ఇండస్ట్రియల్ పాలసీ 4.0.. పెట్టుబడులకు అనుకూలంగా ఉందని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి మార్గాల్లో 1000 ఎకరాలకు పైగా మెగా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నామని.. ఇందులో ఏపీఐఐసీతో భాగస్వామి కావాలని కోరారు. పోర్టుల సమీపంలో 1.5 పెద్ద లాజిస్టిక్స్ పార్కులనూ అభివృద్ధి చేయబోతున్నట్లు వెల్లడించారు. విశాఖ, కాకినాడ పోర్టుల వద్ద మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేయాలని ఈఎస్ఆర్ సంస్థను ఆహ్వానించారు.

వచ్చే నెలలో ఆర్సెలర్ స్టీల్ ప్లాంటు పనులు

వచ్చేనెల 14-15 తేదీల్లో విశాఖలో జరగనున్న రెండు రోజుల పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా సోమవారం ముంబైలో ఆయన బిజినెస్ రోడ్‌షో చేపట్టారు. వచ్చేనెలలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంటు పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ నెల 14న గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం జరుగుతుందని చెప్పారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు త్వరలోనే తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

(మొదటి పేజీ తరువాయి)

మనోజ్ కోహ్లత్కర్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సీఈవో సుకరన్ సింగ్, టాటా ఎలక్ట్రానిక్స్ ఎండీ రణధీర్ ఠాకూర్, టాటా కెమికల్స్ ఎండీ ఆర్.ముకుందన్, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సీఈవో వినాయక్ పాయ్, టెలిమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ సీఈవో బిమల్ ఖండేల్వాల్ తదితరులు కూడా పాల్గొన్నారు. విశాఖపట్నంలో ఈ నెలలో రాష్ట్ర అగ్ర నేతల సమక్షంలో నిర్వహించే టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని చంద్రశేఖరన్‌ను లోకేశ్ ఆహ్వానించారు. టాటా పవర్ రెన్యూవబుల్స్ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ ఇన్‌ఫ్రా అభివృద్ధిలో.. రాష్ట్ర ప్రజలకు సౌకర్యంగా ఉండేలా రూఫ్‌టాప్ సోలార్ అభివృద్ధి చేసే ప్రక్రియలో కూడా ప్రభుత్వంతో భాగస్వామి కావాలని కోరారు. 'రాష్ట్రంలో సెల్ మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ స్థాపనకు అవకాశాలను పరిశీలించండి. విశాఖలో టాటాఎలెక్సీ ప్రాంతీయ కార్యాలయం, ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయండి. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికల్స్ అటానమస్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ టెక్నాలజీస్ ఆధారిత మొబిలిటీ/ఇన్నోవేషన్ వంటి రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయండి. శ్రీసిటీలో ఎలక్ట్రానిక్ వాహన విడిభాగాలు, యూనిట్ల స్థాపనను పరిశీలించండి. ఇందుకు అవసరమైన భూమి ఇతర సదుపాయాలు కల్పిస్తాం. మచిలీపట్నం లేదా మూలపేట పోర్టులకు సమీపంలో సోడా యాష్ ఉత్పత్తి యూనిట్‌ను స్థాపించండి. విశాఖలో డేటా సిటీ ప్రాంతంలో ఏ-1 రెడీ డేటా సెంటర్ క్యాంపస్ స్థాపనకు గల అవకాశాలను పరిశీలించండి' అని లోకేశ్ అభ్యర్థించారు.

త్రీడీ ప్రింటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపించండి

రాష్ట్రంలో త్రీడీ ప్రింటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని హెచ్‌పీ ఇండియా మార్కెట్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్-ఎండీ ఇప్సితా దాస్ గుప్తాను లోకేశ్ కోరారు. 2019లోనే ఈ సంస్థ రాష్ట్రంలో ప్రభుత్వ భాగస్వామ్యంతో త్రీడీ ప్రింటింగ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినా.. ఆ ప్రతిపాదనలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక పారిశ్రామిక పెట్టబడుల విధానంలో సమూల మార్పులు వచ్చాయని.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని హెచ్‌పీ గతంలో చేసిన ఆలోచనలను ఇప్పుడు అమలు చేయాలని లోకేశ్ విజ్ఞప్తిచేశారు.

విశాఖలో లగ్జరీ టౌన్‌షిప్ ఏర్పాటు చేయండి

విశాఖలో లగ్జరీ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయాలని రుస్తోంజీ చైర్మన్ బోమన్ ఇరానీతో భేటీలో లోకేశ్ కోరారు. ఐటీ కంపెనీలు, డేటా సెంటర్ల రాకతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ మహానగరంలో లగ్జరీ టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖలో మైండ్ స్పేస్ బిజినెస్ పార్కు

విశాఖలో మైండ్ స్పేస్ బిజినెస్ పార్కు ఏర్పాటు చేయాలని రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజాను లోకేశ్ కోరారు. దక్షిణ భారతదేశంలోనే అదిపెద్ద డేటా సెంటర్ హబ్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో బ్లూస్టార్ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ సంస్థ ఎండీ వీర్ ఎస్.అద్వాణీని లోకేశ్ కోరారు.

2027కల్లా పూర్తిచేయాల్సిందే

పోలవరంపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును తాజా ప్రణాళికల మేరకు 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాల్సిందేనని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టంచేశారు. ఆలోపే సహాయ పునరావాస పనులూ పూర్తి కావాలన్నారు. పోలవరం పురోగతిపై సోమవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సమీక్ష జరిపారు. కేంద్ర ఆర్థిక, జలశక్తి శాఖల సంయుక్త కార్యదర్శులు, రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), ఇతర కేంద్ర ఏజెన్సీల అధికారులు, నిపుణులు పాల్గొన్నారు. కీలకమైన డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-1, గ్యాప్-2 పనుల్లో వేగం కనిపిస్తున్నా, పునరావాసం మాత్రం చాలా వెనుకబడిందని పాటిల్ అన్నారు. సరిపడా నిధులున్నా ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు. సకాలంలో వాటిని ఖర్చు చేయకపోతే సాంకేతిక, న్యాయపరమైన వివాదాలు వస్తాయన్నారు. నిర్వాసితులకు ఏకమొత్తంలో ఒకే దఫా నిధులిస్తే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సానుకూలత ఏర్పడుతుందన్నారు. ప్రాజెక్టు పనులు పరిశీలించేందుకు రాష్ట్రానికి రావాలని పాటిల్‌ను నిమ్మల కోరారు. అయితే, బిహార్ ఎన్నికలయ్యాక వస్తానన్నారు. టీడీపీ 2019లో మళ్లీ అధికారంలోకి వచ్చిఉంటే.. 2021కే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని పాటిల్‌కు నిమ్మల తెలిపారు. నాటి సీఎం జగన్ కేంద్రం మాటలను కూడా లెక్కచేయకుండా.. రివర్స్ టెండర్ పేరిట నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.



కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను సత్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి

2027లో ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం: నిమ్మల

న్యూఢిల్లీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును 2027లో గోదావరి పుష్కరాలకు ముందే.. అంటే ఆ ఏడాది జూన్‌లోనే పూర్తి చేసి.. ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,157 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పటికే రూ.5,052 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. నిధుల సమస్య లేనే లేదని, తొలి దశలో సహాయ పునరావాస పనులను వచ్చే మేనాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రెండో దశ నిర్వాసితులకు 2027 మార్చికల్లా కాలనీలు నిర్మించి, సదుపాయాలు సమకూర్చనున్నట్లు తెలిపారు. 2019-24 మధ్య ఐదేళ్లలో జరిగిన పోలవరం విధ్వంసాన్ని, కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాత గాడిలో పెట్టి.. పనులను పరుగులు పెట్టిస్తున్న నేటి స్థితి వరకు సమీక్షలో చర్చించామన్నారు.





మళ్లీ.. విషపు ఈగలు

రెండేళ్ల తర్వాత చెట్లపై గూళ్లు కడుతున్న వైనం

- గతంలో ఈగలు కుట్టి ఇద్దరు మృతి
- బెంబేలెత్తిపోతున్న తీర గ్రామాలు



విషపు ఈగల గూడు

నరసాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): చూడ్డానికి తేనెటీగలానే ఉంటుంది. తేనెటీగలానే ఈ.. ఈగ కుడితే కూడా భరించలేని నొప్పితో విలవిల్లాడిపోవడం ఖాయం. కొద్దిసేపటికి కళ్లు తిరగడం, సొమ్మసిల్లిపడిపోవడం వంటివి చకచకా జరిగిపోతాయి. సకాలంలో వైద్యం అందకపోతే ప్రాణాలు కూడా పోతాయి. ఇంతటి ప్రమాదకరమైన విషపు ఈగలు మళ్లీ తీర ప్రాంతానికి వచ్చేశాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లోని తాటి, కొబ్బరి చెట్లు, కొన్ని తోటల్లోని మామిడిచెట్లపై ఇలాంటి ఈగల పుట్ట(గూళ్ల)లు దర్శనమిస్తున్నాయి. వీటిని చూసిన ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఒంటరిగా తోటలు, సముద్ర ఒడ్డుకు వెళ్లేందుకు సాహసించడం లేదు. ప్రస్తుతం ఈ రెండు మండలాల్లో రెండు చోట్ల గూళ్లను గుర్తించారు. రెండేళ్ల క్రితం నరసాపురం మండలం గొంది గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న ఇద్దరు కార్మికుల్ని విషపు ఈగలు కుట్టాయి. వారిలో ఒకరు చికిత్స పొందుతూ పాలకొల్లు ఆస్పత్రిలో మృతి చెందగా మరొకరు భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. గతంలో వేములదీవి గ్రామంలోనూ ఇలాగే వీటిబారినపడి ఓవ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కేపీపాలెం గ్రామంలో మరో వ్యక్తికి సకాలంలో వైద్యం పొంది ప్రాణాలతో బయటపడ్డాడు.

ఒక పుట్టతో.. నెలలో రెండు మూడు!

ఏదో ఒకటి రెండు చోట్ల ఈగల గూళ్లు ఉన్నాయని వదిలేస్తే.. వీటి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుంది. గూళ్లు కట్టి వాటిల్లో పిల్లల్ని పెట్టడం సర్వసాధారణం. అలా విస్తరించుకుంటూ వెళతాయి. ఎక్కువగా తోటలు, సముద్ర తీర ప్రాంతంలోని తాటి, ఈత చెట్లపైనే గూళ్లు కడతాయి. పదేళ్ల క్రితం ఓఎన్‌జీసీ సహకారంలో అప్పటి అధికారులు వీటిని సామూహికంగా నిర్మూలించారు. శాస్త్రవేత్తలు, వైద్యుల సూచనలు పాటించి ముందుగా చెట్లపై ఉన్న గూళ్లపై మత్తుతో కూడిన మందులు చల్లారు. ఆ తరువాత మంటలు పెట్టి దహనం చేశారు. కొంత కాలం వరకు వీటి జాడ లేదు. మళ్లీ రెండేళ్ల క్రితం దర్శనమిచ్చాయి. కొన్ని చోట్ల ఇదే పద్ధతిలో నిర్మూలించారు. మళ్లీ ఇవి కనిపించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సకాలంలో వైద్యం చేయించుకోవాలి...

ఈగలు కుడితే అశ్రద్ధ తగదు. సకాలంలో వైద్యుల్ని సంప్రదించాలి. లేకపోతే ప్రాణాలకే ముప్పు. అదే రెండు మూడు ఈగలు కుడితే ప్రమాదం ఇంకా తీవ్రంగా ఉంటుంది. పాము కరిస్తే... విషం పైకి పాకకుండా బలంగా తాడు కట్టి నివారించవచ్చు. కానీ ఈగ కుడితే అలా అరికట్టలేం. విషం క్షణాల్లో శరీరమంతా పాకేస్తుంది. అందుకే ప్రాణాలు పోవడం, లేదంటే పల్స్ పడిపోయి ప్రాణపాయస్థితి వంటి ప్రమాదం జరగొచ్చు.

-డాక్టర్ మురళీ, ఎండీ, నరసాపురం

ఏసీబీ కోర్టు ఉత్తర్వులతో.. మద్యం దర్యాప్తునకు దెబ్బ!

మిథున్‌రెడ్డి నిర్దోషి అనేలా న్యాయాధికారి బెయిల్ ఆదేశాలు

హైకోర్టుకు సీఐడీ నివేదన.. మిథున్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

అమరావతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులకు బెయిల్ మంజూరు చేసే విషయంలో ఏసీబీ కోర్టు న్యాయాధికారి చట్టంలో లేని విధానాలు అనుసరిస్తున్నారని సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు నివేదించారు. కేసు దర్యాప్తు దశలో ఉండగానే వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (ఏ-4) నిర్దోషి, నిజాయితీపరుడు అనేలా బెయిల్ ఉత్తర్వుల్లో ఏసీబీ కోర్టు పలు అంశాలను ప్రస్తావించిందన్నారు. మద్యం కుంభకోణం వ్యవహారంలో మిథున్‌రెడ్డి కీలక సూత్రధారి అని చెప్పేందుకు చూపిన ఆధారాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఈ తీర్పులోని అంశాల ఆధారంగా ఇతర నిందితులు కూడా బెయిల్ మంజూరు చేయాలని కోరే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బెయిల్ ఉత్తర్వుల్లో ఏసీబీ కోర్టు ప్రస్తావించిన పలు అంశాల అమలును నిలుపుదల చేయాలని కోరారు. మిథున్‌రెడ్డి ఇప్పటికే బెయిల్‌పై విడుదలయ్యారని, నోటీసులు జారీ చేసి ఆయన వాదన కూడా వినాల్సిన అవసరం ఉందని హైకోర్టు గుర్తుచేసింది. ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులు ధనుంజయరెడ్డి (ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి(ఏ-32), బాలాజీ గోవిందప్ప(ఏ-33)లకు డీఫాల్ట్ బెయిల్, మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు విషయంలో ఏసీబీ కోర్టు న్యాయాధికారి తీసుకున్న నిర్ణయాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని చెబుతున్న నేపథ్యంలో.. లోతుగా విచారణ జరిపి నిర్ణయం వెల్లడిస్తామని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

మొదట అలా.. తర్వాత వేరేలా..

మద్యం కేసులో మిథున్‌రెడ్డికి బెయిలిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు గత నెల 29న ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా దర్యాప్తు సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది లూథ్రా వాదనలు వినిపించారు. 'మిథున్‌రెడ్డి మొదట వేసిన బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు ఆగస్టు 18న కొట్టివేసింది. పదిరోజులు కూడా గడవక ముందే ఆయన రెండో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. మొదట వేసిన బెయిల్ పిటిషన్ కొట్టివేసిన అనంతరం పరిస్థితుల్లో ఎలాంటి మార్పూ లేదు. పరిస్థితుల్లో మార్పు లేకుండా బెయిలివ్వకూడదనేది న్యాయసూత్రం. దీనిని పాటించకుండా ఏసీబీ కోర్టు మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి పాత్రకు సంబంధించిన ఆధారాలను మొదటి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ముందుంచాం. సీఆర్‌పీసీ సెక్షన్లు 161, 164 కింద రికార్డు చేసిన వాంగ్మూలాలను, గూగుల్ టేకౌట్, ఇతర సాంకేతిక ఆధారాలను పరిగణనలోకి తీసుకుని మొదటి బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టివేసింది. 10 రోజులు కూడా గడవకముందే వేసిన రెండో బెయిల్ పిటిషన్‌లో సెక్షన్ 161 కింద రికార్డు చేసిన వాంగ్మూలాలను.. మిథున్‌రెడ్డి పాత్రను నిర్ధారించే ఆధారాలుగా పరిగణించలేమని కోర్టు ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. మిథున్‌రెడ్డి కింగ్‌పిన్ అంటూ సెక్షన్ 164 కింద రికార్డు చేసిన వాంగ్మూలాలను పరిశీలించలేదు' అని తెలిపారు.

'నకిలీ' మకిలిలో వైసీపీ!

(మొదటి పేజీ తరువాయి)



విజయవాడలో సీజ్ చేసిన కల్తీ మద్యాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మొదలైందని, తీగలాగితే తమ డొంకా కదులుతుందని పలువురు వైసీపీ నేతలు భయపడుతున్నారు. ఈ కేసులో ఏ-12 నిందితుడిగా ఉన్న తెనాలికి చెందిన వైసీపీ నాయకుడు కొడాలి శ్రీనివాసరావుకు ఆ పార్టీ నేతలు అండగా నిలబడ్డారు. ఆయన పట్టుబడితే నకిలీ మద్యం రాకెట్ వెనకున్న వైసీపీ నేతల పాత్ర బయటకు వచ్చే అవకాశం ఉంది. దీంతో శ్రీనివాసరావు అరెస్ట్ కీలకంగా మారింది. సోమవారం గుంటూరు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, డీసీ శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ మారయ్యబాబులు మూడు బృందాలుగా ఏర్పడి తెనాలి, గుంటూరు, విజయవాడ కేంద్రాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. విజయవాడ శివారులోని ఇబ్రహీంపట్నంలో ఉన్న జనార్దన్‌రావుకు చెందిన ఏఎన్‌ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌ను ఎక్సైజ్ ఉన్నతాధికారులు సీజ్ చేశారు. ఏ-2 కట్టా రాజును అదుపులోకి తీసుకుని ములకలచెరువుకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

కొడాలి పేరిటే లీజు...

శుక్రవారం తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో నకిలీ మద్యం వ్యవహారం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం దీని వెనుక ఎవరున్నా వదలొద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు, ఆయన ముఖ్య అనుచరుడు, ములకలచెరువు కల్తీమద్యం కేంద్ర మేనేజర్ కట్టా రాజు, టీడీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన తంబళ్లపల్లె నేత జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్, కొడాలి శ్రీనివాసరావు బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలపై ఆరా తీసి కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. నిందితుల ఫోన్ కాల్ డేటాపైనా ఆరా తీశారు. నకిలీ మద్యం తయారీ వెనుక సూత్రధారులు, పాత్రధారులు, సహకరించిన పెద్దలు, అధికారుల పాత్రపై ఇప్పటికే విచారణాధికారులు ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్‌లో కొడాలి శ్రీనివాసరావు పేరుతో ములకలచెరువులో మూతపడిన ఓ డాబాను లీజుకు తీసుకున్నారు. పెద్ద పెద్ద యంత్రాలను ఉపయోగించి ప్రభుత్వం సరఫరా చేస్తున్న బ్రాండ్ల పేరుతో నకిలీ మద్యం తయారు చేసి బెల్ట్ షాపులకు సరఫరా చేశారు. ఈ కేసులో పది మంది నిందితులను అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వం ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించింది. జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడును టీడీపీ నుంచి సస్పెండ్ చేశారు. పెద్దతిప్పసముద్రం (పీటీఎం) మండలంలో ఉన్న సురేంద్రనాయుడుకు చెందిన ఆంధ్రవైన్స్ దుకాణాన్ని అధికారులు సీజ్ చేశారు. రాజేశ్‌కు చెందిన ములకలచెరువులోని రాక్‌స్టార్ మద్యం షాపును సీజ్ చేశారు. నకిలీ మద్యం తయారీ, విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందురెడ్డి ఫోన్ కాల్‌డేటా, బ్యాంకు లావాదేవీలను విచారణాధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం తయారీ వ్యవహారం మొత్తం హిమబిందురెడ్డికి తెలుసని, నెల నెలా ఆమెకు రూ.10-15 లక్షలు మామూళ్లు వెళ్లేవనే ఆరోపణలున్నాయి. అయితే ఆమె అవినీతి బాగోతం బయటపడకుండా.. ఎక్సైజ్ శాఖలో ఓ జిల్లా అధికారి రక్షణ కల్పిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డిలపై కేసు?

టీడీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డిపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం. తంబళ్లపల్లె నియోజకవర్గంలో టెండర్ల ద్వారా పలు మద్యం దుకాణాలను జయచంద్రారెడ్డి అనుచరులే దక్కించుకున్నారు.

రూ.25 లక్షల మద్యం స్వాధీనం

ములకలచెరువులో వెలుగుచూసిన నకిలీ మద్యం లింక్‌లు విజయవాడను తాకాయి. అక్కడ తయారైన నకిలీ మద్యాన్ని విజయవాడలో విక్రయించినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. గోదాములో ఉన్న సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన జనార్దనరావు నిర్వహిస్తున్న ఏఎన్‌ఆర్ బార్‌లో డిపోల నుంచి కొనుగోలు చేసిన కొద్దిపాటి మద్యం సీసాలను ప్రదర్శనలో ఉంచి, నకిలీ మద్యాన్ని విక్రయించేవారు. ఈ నకిలీ మద్యాన్ని భద్రపరచడానికి బార్‌కు ఎదురుగా ఉన్న వీధిలో ఒక గోదామును అద్దెకు తీసుకున్నారు. అధికారులు గోదాములో సోదాలు నిర్వహించి రూ.25 లక్షల విలువచేసే నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏఎన్‌ఆర్ బార్‌ను సీజ్ చేశారు. జనార్దన్‌పై భవానీపురం ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటరుపై దాడి కేసులో శ్రీనివాసరావు ఏ-11

గత ఎన్నికల సమయంలో తెనాలిలో ఓటరుపై జరిగిన దాడి కేసులోనూ కొడాలి శ్రీనివాసరావు పాత్ర ఉంది. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఐతానగర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు క్యూలో కాకుండా తన అనుచరులతో కలసి నేరుగా వెళ్లారు. లైన్‌లో రావాలని శివకుమార్‌ను అదే ప్రాంతానికి చెందిన ఎన్నారై గొట్టిముక్కల సుధాకర్ కోరారు. దీంతో సుధాకర్‌పై శివకుమార్ చేయి చేసుకోగా, తిరిగి సుధాకర్ కూడా ఆయన్ను చెంపదెబ్బ కొట్టారు. ఆ తర్వాత ఓటర్ సుధాకర్‌పై శివకుమార్ అనుచరులు పలు దఫాలుగా దాడిచేసి కొట్టారు. ఈ కేసులో కొడాలి శ్రీనివాసరావు ఏ-11 నిందితుడిగా ఉన్నారు.

జగన్.. మీకు ఆ అర్హత లేదు

- కల్తీ మద్యం నిందితులకు వత్తాసు పలకడం గురించి మీరు మాట్లాడకండి: మంత్రి లోకేశ్

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 'కల్తీ మద్యం గురించి, నిందితులకు వత్తాసు పలకడం గురించి మాట్లాడే అర్హత మీకు ఎక్కడుంది జగన్ గారూ!' అంటూ మంత్రి లోకేశ్ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో స్పందించారు. తన సందేశానికి జగన్ ఆదివారం చేసిన స్పందనను ట్యాగ్ చేశారు. "కల్తీ మద్యం పట్టుకున్నది మా ప్రభుత్వం. కల్తీ మద్యం నిందితుల్లో టీడీపీ నేతలున్నా అరెస్టు చేయించింది మా ప్రభుత్వం. నిందితుల్లో ఇద్దరు మా పార్టీ వారుంటే తక్షణం వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు మా అధ్యక్షుడు. మీ ఐదేళ్ల పాలనలో ఏం చేశారో మరిచిపోయి ఆరోపణలు చేయొద్దు. డబ్బు కక్కుర్తితో జే బ్రాండ్స్‌తో వేల మంది ప్రజల ప్రాణాలు తీసింది మీరు. మీ జమానాలో జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి ప్రజలు చనిపోతే, సహజ మరణాలని నిందితులను కాపాడే ప్రయత్నం చేశారు. 'పోతే పోయారు.. ఇంకా ఏడుస్తారేంటి?' అన్న మీ మంత్రి జోగి రమేశ్ అహంకారం ఇప్పటికీ ప్రజలు గుర్తించుకున్నారు" అంటూ లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

కల్తీ మద్యానికి మూల విరాట్ జగనే

- ఎన్నికలకు ముందు టీడీపీలోకి వైసీపీ కోవర్టులు: పంచుమర్తి

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కల్తీ లిక్కర్ మాఫియాకు మూల విరాట్‌గా ఉన్న జగన్ రూ.3,500 కోట్లు కొల్లగొట్టారని మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'కల్తీ మద్యం విషయంలో సీఎం చాలా కఠినంగా ఉన్నారు. కేవలం ఆరోపణలు వచ్చినందుకే ఇద్దరు పార్టీ నాయకులను సస్పెండ్ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారికంగానే కల్తీ మద్యం వ్యాపారం జరిగింది. ఆ పార్టీ నేతలు విచ్చలవిడిగా కల్తీ మద్యం వ్యాపారాలు చేశారు. చాలా మంది జైలు పాలయ్యారు. వారిలో ఎంత మందిని జగన్ సస్పెండ్ చేశారు? కల్తీ మద్యం కేసులో జైలుకు వెళ్లిన వారిని స్వాతంత్ర సమర యోధుల్లా భావించి పరామర్శించిన వ్యక్తి జగన్. అలాంటి వ్యక్తి నేడు ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు కొందరు వైసీపీ కోవర్టులు టీడీపీలో చేరారు. వారివల్లే పార్టీకి చెడ్డ పేరు వస్తోంది. జే బ్రాండ్ల మద్యంలో విష పూరిత పదార్థాలు ఉన్నట్టు చెన్నై, బెంగళూరుతోపాటు అమెరికాలోని ప్రముఖ ల్యాబ్‌లు నిర్ధారించాయి. అయినా వైసీపీ ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోలేదు?' అని పంచుమర్తి ప్రశ్నించారు.

ఆయన పెద్దిరెడ్డి మనిషే!

జయచంద్రా రెడ్డి వైసీపీ కోవర్టే

- ఎన్నికల ముందు టీడీపీలో చేరిక
- అనూహ్యంగా తంబళ్లపల్లి టికెట్
- ద్వారకానాథ్ రెడ్డి గెలుపునకు సహకారం

(రాయచోటి - ఆంధ్రజ్యోతి)



వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైసీపీ నేతలతో కలసి కేక్ కట్ చేస్తున్న జయచంద్రారెడ్డి (ఫైల్ ఫొటో)

ఆయన మనసంతా వైసీపీయే! ఆయన సంబంధాలూ వైసీపీ నేతలతోనే! కానీ... వ్యూహాత్మకంగా టీడీపీలో చేరారు! అనూహ్యంగా టికెట్ తెచ్చుకున్నారు! ఆ తర్వాత... వైసీపీ అభ్యర్థి గెలుపు కోసం పరోక్షంగా సహకరించారు! ఆయనే... జయచంద్రా రెడ్డి! నకిలీ మద్యం కేసులో ఆయన పాత్ర ఇప్పుడు కీలకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి సర్కారు హవా కనిపించినా... అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లిలో వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి గెలుపొందారు. ఆయన... మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి సోదరుడనే విషయం తెలిసిందే! పెద్దిరెడ్డి కుటుంబానికి జయచంద్రా రెడ్డి ఆది నుంచీ వీర విధేయుడు కావడం గమనార్హం. ఆయనను టీడీపీలో చేర్చుకోవడమే ఒక తప్పయితే... అసెంబ్లీ టికెట్ ఇవ్వడం మరో తప్పని అప్పుడే పార్టీ వర్గాలు వాపోయాయి! జయచంద్రా రెడ్డి వైసీపీ కోవర్టు అని... ఆయన కారణంగా తెలుగుదేశం పార్టీకి నకిలీ మకిలీ అంటుకుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

తొలి నుంచీ పెద్దిరెడ్డితోనే...

మొలకలచెరువు మండలం కదిరినాథునికోటకు చెందిన జయచంద్రారెడ్డి ఆది నుంచీ మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి విధేయుడిగా ఉన్నారు. పెద్దిరెడ్డి కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి, జయచంద్రారెడ్డికి కలిపి ఉగాండా దేశంలో లిక్కర్ వ్యాపారం ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మొలకలచెరువులో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరగడం విశేషం. అదే మొలకలచెరువులో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఒక క్రికెట్ టోర్నీ నిర్వహించి... ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ద్వారకానాథరెడ్డిని అప్పట్లో ఆహ్వానించారు. అలాంటి జయచంద్రారెడ్డి... మరో ఆరేడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలనగా, 2023 డిసెంబరులో అనూహ్యంగా టీడీపీలో చేరారు. చంద్రబాబు సమక్షంలోనే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలో మురుసుకాపులు ఎక్కువగా ఉన్నారని.. ఆయనకు టికెట్ ఇస్తే గెలుస్తారంటూ.. ఆయన సామాజికవర్గ నేతలు చంద్రబాబును నమ్మించారు. ఫలితంగా 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల మొదటి జాబితాలోనే జయచంద్రారెడ్డి పేరు ప్రకటించారు. అయితే ఆయన పెద్దిరెడ్డి కుటుంబ కోవర్టు అని టీడీపీ శ్రేణుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పెద్దిరెడ్డి కుటుంబసభ్యులతో వివిధ సందర్భాల్లో జయచంద్రారెడ్డి ఉన్న ఫొటోలు బయటపడి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. దీంతో ఆయనకు బీఫారం ఇవ్వకుండా టీడీపీ అధిష్ఠానం పెండింగ్ పెట్టింది. నామినేషన్ పత్రాల పరిశీలన సందర్భంగా బీఫాం ఇచ్చేందుకు గడువు ముగుస్తుండగా చివరి క్షణంలో అందజేశారు.

వైసీపీ అభ్యర్థికి సహకారం...

టికెట్ వచ్చి, నామినేషన్ల దాఖలు.. పరిశీలన అనంతరం జయచంద్రా రెడ్డి ఒక్కసారిగా ఎన్నికల ప్రచారంలో స్పీడ్ తగ్గించారు. దాని వెనుక పెద్దిరెడ్డి కుటుంబం ఆదేశాలు ఉన్నాయని ఇప్పటికీ టీడీపీ శ్రేణులు ఆరోపిస్తుంటాయి. పోలింగ్ రోజు పలు మండలాల్లో ఏజెంట్లను కూడా పెట్టకుండా వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి విజయానికి జయచంద్రారెడ్డి సహకరించారనే ఆరోపణలున్నాయి. ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికే ఈయన అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. టీడీపీ జెండా మోసి, పెద్దిరెడ్డి కుటుంబ అరాచకాలకు బలైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు 70 శాతం వరకు జయచంద్రారెడ్డికి దూరంగా ఉండిపోయారు. అంగళ్లులో చంద్రబాబుపై దాడి జరిగిన సందర్భంగా వైసీపీ బనాయించిన అక్రమ కేసుల్లో జైళ్లకు వెళ్లి వచ్చి ఊళ్లు వదిలి వెళ్లిన వారు కూడా ఆయనకు దూరంగా ఉంటున్నారు.

ఆయన వర్గీయులదే హవా..

నియోజకవర్గవ్యాప్తంగా అన్ని రకాల వ్యవహారాల్లోనూ జయచంద్రారెడ్డి వర్గీయులదే హవా. కాంట్రాక్టు పనులు సైతం టీడీపీతో సంబంధం లేని వ్యక్తులకే ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బినామీల పేర్లతో మద్యం దుకాణాలు దక్కించుకోవడం, బెల్టు షాపుల నిర్వహణ మొత్తం ఆయన వర్గీయుల చేతుల్లోనే నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బయటి వ్యక్తులు ఎవరైనా నియోజకవర్గంలో కాంట్రాక్టు పనులు చేయాలంటే ముఖ్యమైన వ్యక్తులకు మామూళ్లు ఇచ్చుకోవాల్సిందేననే ఆరోపణలు ఉన్నాయి. అంగళ్లులో ఆయన వర్గీయులు భూదందాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో వారు అధికారులను బెదిరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తంబళ్లపల్లె పరిధిలో జరిగిన అక్రమాలు, అరాచకాలపై ఇప్పటివరకు ఆయన ఒక్కసారి కూడా నోరు విప్పిన పాపాన పోలేదని టీడీపీ కార్యకర్తలు వాపోతున్నారు.

డీజే హోరుతో ఆగిన గుండె!

దుర్గా నిమజ్జనోత్సవంలో అపశ్రుతి

పెందుర్తి (విశాఖపట్నం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకల్లో దుర్గాదేవి విగ్రహ నిమజ్జనోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే హోరుకు ఓ వ్యక్తి గుండె ఆగిపోయింది. వివరాలివీ.. విశాఖ జిల్లా పెందుర్తి మండలం పెదగాడిలో ఆదివారం రాత్రి దుర్గాదేవి విగ్రహ నిమజ్జనోత్సవం ప్రారంభమైంది. ఊరేగింపులో డీజే సౌండ్స్ ఏర్పాటు చేయగా యువకులు ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ అప్పికొండ త్రినాథ్(56), అతడి భార్య లక్ష్మి ఓ పాటకు సరదాగా డ్యాన్స్ చేశారు. పాట ముగిసిన వెంటనే పక్కకు వచ్చి, అరుగు మీద కూర్చుని త్రినాథ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అక్కడివారు సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. త్రినాథ్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

- కోర్టు హాల్లో వీడియోలు తీసిన చెవిరెడ్డి అనుచరులు

విజయవాడ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో విజయవాడ, గుంటూరు జిల్లా జైళ్లలో ఉన్న ఏడుగురు నిందితులకు ఏసీబీ కోర్టు ఈనెల 13 వరకు రిమాండ్‌ను పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, సజ్జల శ్రీధర్‌రెడ్డి, బూనేటి చాణక్యతో పాటు గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణలను పోలీసులు ఏసీబీ కోర్టులో సోమవారం హాజరు పరిచారు. వారికి రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసులో బెయిల్ పొందిన ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, పైలా దిలీప్, బాలాజీ గోవిందప్ప కోర్టు వాయిదాకు హాజరయ్యారు. బెయిల్ పొందిన నిందితులకు వాయిదాల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారి తరపు న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. బెయిల్ షరతులను సడలించాలని న్యాయవాదులు కోరగా.. పిటిషన్ దాఖలు చేయాలని న్యాయాధికారి ఆదేశించారు. కోర్టు హాలులో చెవిరెడ్డి ఫొటోలు, వీడియోలు తీస్తుండటాన్ని గమనించిన సిట్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ ఓ యువకుడి వద్ద సెల్‌ఫోన్ లాక్కుని వీడియోలు, ఫొటోలు తొలగించారు.

పాస్‌పోర్టు ఇప్పించండి

సిట్ అధికారులు సీజ్ చేసిన తన పాస్‌పోర్టును తిరిగి ఇప్పించాలని ఎంపీ మిథున్‌రెడ్డి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అమెరికాకు వెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం కొంతమంది ఎంపీల బృందాన్ని ఎంపిక చేసిందని, అందులో తానూ ఉన్నందువల్ల పాస్‌పోర్టు అవసరం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా తనపై సిట్ అధికారులు జారీచేసిన లుక్ అవుట్ సర్క్యులర్‌ను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశం బెయిల్ షరతుల్లో ఉన్నందున దీనిపై పిటిషన్ దాఖలు చేయాలని న్యాయాధికారి ఆదేశించారు. తదుపరి విచారణను 8వ తేదీకి వాయిదా వేశారు.

ప్రొక్లమేషన్ ప్రొసీజర్ పిటిషన్ దాఖలు

మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాష్‌రెడ్డిపై సిట్ అధికారులు కోర్టులో ప్రొక్లమేషన్ ప్రొసీజర్ పిటిషన్ దాఖలు చేశారు. అవినాష్‌రెడ్డి విదేశాల్లో తలదాచుకున్నాడని సిట్ అధికారులు గుర్తించారు. అతడిపై చర్యలు తీసుకోవడానికి ప్రొక్లమేషన్ ప్రొసీజర్ ప్రకారం ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. దీనికి అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. నిందితుడు విచారణకు రాకుండా తప్పించుకు తిరుగుతున్నప్పుడు అతడి గురించి పత్రికల్లో ప్రకటన ఇవ్వడానికి కోరే అనుమతినే ప్రొక్లమేషన్ ప్రొసీజర్ అంటారు.

చెవిరెడ్డి ప్రాసిక్యూషన్‌కు స్పీకర్ అనుమతి

మద్యం స్కాం కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ప్రాసిక్యూట్ చేయడానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనుమతి ఇచ్చారు. చెవిరెడ్డి ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే అయినా.. కుంభకోణం జరిగిన సమయంలో ఎమ్మెల్యేగా ఉన్నారు. అవినీతి కేసుల్లో ప్రజాప్రతినిధులను ప్రాసిక్యూట్ చేయడానికి స్పీకర్ అనుమతి తప్పనిసరి. దీనికి సంబంధించి కొద్దిరోజుల క్రితం సిట్ అధికారులు స్పీకర్‌కు లేఖ రాశారు. ఆయన అనుమతి ఇవ్వడంతో ఆ కాగితాలను కోర్టుకు నివేదించారు.

జిల్లాల పర్యటనకు సిద్ధమైన పవన్ కల్యాణ్

అమరావతి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని గిరిజన ప్రాంతాల్లో పర్యటించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిద్ధం అయ్యారు. ఈ నెలలో తొలుత పార్వతీపురం మన్యం జిల్లాల్లోని కురుపాంలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థినులు అనారోగ్యంతో ఆసుపత్రుల పాలైన నేపథ్యంలో ఆ పాఠశాలను ఆయన పరిశీలిస్తారు. అనంతరం పిఠాపురంలో పర్యటించనున్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కూడా పర్యటించాలని ఆయన నిర్ణయించారు. ఈ పర్యటనలకు సంబంధించిన తేదీలను ఖరారు చేసే పనిలో అధికారులున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.